

మాట్లాడుతున్న ఏడుకొండలు, పక్కన ఝాన్సీ, భగవాన్‌నాయక్

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



వేడుకలు సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు

ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే గురువారం ఘనంగా జరిగింది. కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్‌లు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు.



ఎంబీబీఎస్ పట్టా అందుకున్న కుమార్తెకు ముద్దు పెడుతున్న తల్లి

పశ్చిమంపై ఫోకస్

- ప్రత్యేక దృష్టి సారించిన తెలుగుదేశం పార్టీ
- మూడు లోక్‌సభా స్థానాలకు బలమైన అభ్యర్థులు
- ఎంపీని అసెంబ్లీ బరిలోకి తెచ్చే ఆలోచన
- మార్కాపురంలో ఇల్లు తీసుకుంటున్న మాగుంట
- 3న లోకేష్, 10న చంద్రబాబు రాక
- బాపట్ల లోక్‌సభ స్థానం రేసులో ప్రసాదరావు?
- మహీధరరెడ్డితో వేమిరెడ్డి భేటీలో అంతర్యమేమిటో!


ఉమ్మడి ప్రకాశం జిల్లాతో సంబంధం ఉన్న మూడు లోక్‌సభ స్థానాల నుంచి బలమైన అభ్యర్థులను రంగంలో దింపటంతో పాటు పశ్చిమ ప్రాంతంపై టీడీపీ ప్రత్యేక దృష్టి సారించింది. ఆ ప్రాంతంలోని ఒక అసెంబ్లీ స్థానం నుంచి ఎంపీ మాగుంటను రంగంలోకి దింపే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. 3న పశ్చిమం నుంచే లోకేష్ పర్యటన ప్రారంభిస్తుండగా, 10న మార్కాపురానికి బాబు రానున్నారు. దీంతోపాటు జిల్లాలో మిగిలిన అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల ఎంపికపై గురువారం హైదరాబాద్‌లో బాబు కసరత్తు చేశారు. ఇప్పటికే ఒంగోలు లోక్‌సభ నుంచి రాఘవరెడ్డి, నెల్లూరు నుంచి వేమిరెడ్డి పోటీ ఖరారుకాగా బాపట్లపై కసరత్తు పూర్తయినట్లు సమాచారం. నేడో, రేపో మిగిలిన అభ్యర్థుల ఎంపికపై ఒక అవగాహనకు వచ్చి మాగుంటను పార్టీలో చేర్చుకునే కార్యక్రమాన్ని కూడా వెంటనే పూర్తిచేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను ఇప్పటికే టీడీపీ ప్రకటించింది. ఆ పార్టీతో జతకట్టిన జనసేనకు దర్శిని కేటాయించగా అక్కడ అభ్యర్థి ఎంపికపైనా కసరత్తు జరుగుతోంది. ఇదే సమయంలో జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ గట్టి పట్టును ప్రదర్శించిన పశ్చిమప్రాంతంపై టీడీపీ ప్రత్యేక వ్యూహాన్ని రూపొందిస్తోంది. అక్కడ అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక కసరత్తు చేపట్టడమే గాక ఆ ప్రాంతాల్లో చంద్రబాబు, లోకేష్‌లు పర్యటనలకు రానున్నారు. అదేసమయంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా దర్శి లేక పశ్చిమప్రాంతంలో ఒక సభకు హాజరయ్యేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలను గెలుచుకోవటం ద్వారా టీడీపీకి జిల్లాలో పట్టున్న విషయం నిరూపితమైంది. ఆ నాలుగు స్థానాలు తూర్పు ప్రాంతంలోనే దక్కాయి. రెండేళ్ల నుంచి పశ్చిమంపై టీడీపీ ప్రత్యేకదృష్టి పెట్టింది. వెలిగొండపై స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించటమే గాక అధికారంలోకి రాగానే మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు స్పష్టంగా ప్రకటించి ఉన్నారు.

మూడు లోక్‌సభా స్థానాలకు బలమైన అభ్యర్థులు

ముందుగా టీడీపీ లోక్‌సభ స్థానాలపై దృష్టి కేంద్రీకరించింది. నెల్లూరులో వేమిరెడ్డి చేరిక టీడీపీ, జనసేన కూటమికి మంచి బలాన్నిచ్చింది. ఉమ్మడి జిల్లాలోని కందుకూరు అసెంబ్లీ కలిసి ఉన్న నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. ఆయన 2వ తేదీ అధికారికంగా టీడీపీలో చేరబోతున్నారు. మరోవైపు వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ మాగుంట, ఆయన అనుచరులు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. జిల్లాలో లోకేష్, చంద్రబాబుల పర్యటనలు జరగనున్న నేపథ్యంలో మాగుంట చేరిక రెండుమూడు రోజుల్లోనే ఉండే అవకాశం కనిపిస్తోంది. 3వ తేదీ నుంచి మూడురోజులపాటు ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో లోకేష్ పర్యటించనున్నారు. మాగుంట పార్టీలో చేరే తేదీ విషయమై శుక్రవారం ఒక నిర్ణయం జరగవచ్చని తెలుస్తోంది. వీలైతే బాబు సమక్షంలో ఆయన 2న అమరావతిలో కానీ లేదా మరోరోజు కానీ చేరే విషయంపై బాబుతో మాట్లాడి శుక్రవారం నాడే ఒక నిర్ణయానికి రావచ్చని తెలుస్తోంది. ఇక ఉమ్మడి జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలున్న బాపట్ల లోక్‌సభ అభ్యర్థి ఎంపికపైనా గురువారం హైదరాబాద్‌లో బాబు కసరత్తు చేశారు. పోటీకి సిద్ధంగా ఉన్న విశ్రాంత ఐఆర్‌ఎస్ ఆఫీసర్ దగ్గుమల్ల ప్రసాదరావు గురువారం హైదరాబాద్‌లో చంద్రబాబును కలిశారు. పర్చూరు నియోజకవర్గం చింతగుంపల గ్రామానికి చెందిన ప్రసాదరావును శుక్రవారం కూడా కలవాలని బాబు సూచించినట్లు తెలిసింది. దళితులలో రెండు వర్గాలకు సంబంధించి ఒకరిని తిరుపతి, మరొకరిని బాపట్ల లోక్‌సభ నుంచి రంగంలో దింపాలని భావిస్తున్నారు. తిరుపతి నుంచి మాదిగ సామాజికవర్గానికి చెందిన మహిళ పేరు పరిశీలనలో ఉన్నందున మాల సామాజికవర్గానికి చెందిన ప్రసాదరావుకు బాపట్ల నుంచి పోటీ చేసే అవకాశం దక్కే చాన్స్ కనిపిస్తోంది. అయితే తుది నిర్ణయం జరగలేదు.







10న చంద్రబాబు ప్రత్యేక సమావేశం

ఆదివారం నుంచి లోకేష్ శంఖారావం కార్యక్రమాలు పశ్చిమం నుంచే ప్రారంభమవుతున్నాయి. 2వ తేదీ రాత్రికి ఆయన వైపాలెం చేరతారు. 3న కార్యకర్తల విస్తృత సమావేశంలో పాల్గొంటారు. అదే రోజు మధ్యాహ్నం గిద్దలూరులో, సాయంత్రం మార్కాపురంలో జరిగే సమావేశాల్లో లోకేష్ పాల్గొంటారు. ఆదివారం రాత్రికి దర్శిలో బసచేసి సోమవారం ఉదయం దర్శి, ఒంగోలు, కొండపిలలో జరిగే శంఖారావం కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం రాత్రికి కందుకూరులో బసచేసి మంగళవారం ఉదయం కందుకూరులోను మధ్యాహ్నం కనిగిరి నియోజకవర్గం పామూరులో జరిగే శంఖారావం కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రానికి నెల్లూరు జిల్లా ఉదయగిరి వెళ్తారు. ఆ వెంటనే 10వ తేదీ చంద్రబాబు మార్కాపురం రానుండటం విశేషం. మార్కాపురంలో ఆయన పశ్చిమప్రాంతంలోని తటస్థులు, ఆయా వర్గాలకు చెందిన ప్రముఖులు, మేధావులతో సమావేశం కాబోతున్నారు. పెద్దసంఖ్యలో ఆయా వర్గాల వారు హాజరయ్యే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ సందర్భంగా బాబు పశ్చిమప్రాంత సామాజిక, ఆర్థికాభివృద్ధికి సంబంధించి అలాగే మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి మరింత స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉంది. బాబు వచ్చేరోజుకు మొత్తం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

మాగుంటను అసెంబ్లీ బరిలో దింపే ఆలోచన

ఎంపీ మాగుంటను పశ్చిమప్రాంతంలోని ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఒంగోలు లోక్‌సభ నుంచి తన కుమారుడు రాఘవరెడ్డిని రంగంలో దింపబోతున్నట్లు మాగుంట వెల్లడించిన విషయం తెలిసిందే. ఒక ఇంట్లో ఒకరికే పదవి అన్న నిర్ణయంతో ఉన్న టీడీపీ.. అనివార్యమైన చోట ఒకే ఇంట్లో ఇద్దరికి కూడా అవకాశం ఇస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఇప్పటికే అలా నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ పశ్చిమప్రాంతంలో మరింత పట్టు సాధించేందుకు మాగుంటను రంగంలో దింపాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కనిగిరి, వైపాలెం అభ్యర్థులుగా ఉగ్రనరసింహారెడ్డి, ఎరిక్షన్‌బాబులను టీడీపీ ప్రకటించింది. తాజాగా గిద్దలూరు నుంచి అశోక్‌రెడ్డినే రంగంలోకి దించే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ముఖ్యనాయకులంతా అశోక్‌రెడ్డి పేరునే సూచించారు. దర్శిని జనసేనకు కేటాయించినప్పటికీ అభ్యర్థిని ప్రకటించలేదు. జనసేన తరఫున అక్కడ గరికపాటి వెంకట్ రేసులో ఉన్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే గరటయ్య కుమారుడు చైతన్యను పరిగణనలోకి తీసుకున్నారు. ఒక సర్వేలో చైతన్యకు సానుకూలంగా వచ్చిన అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. జనసేన వైపు నుంచి వెంకట్ పేరు కూడా బలంగా వినపడుతోంది. అలాగే ఒక మాజీ మంత్రి ఒకదశలో ముందడుగు వేసినప్పటికీ మళ్లీ వెనక్కు తగ్గినట్లు సమాచారం. నరసరావుపేటకు చెందిన ఒక మహిళా డాక్టరు కూడా దర్శి టికెట్‌ను ఆశిస్తున్నారు. రానున్న రెండుమూడు రోజుల్లో బాబు, పవన్ మరోసారి కలిసినప్పుడు జనసేన అభ్యర్థి ఖరారయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే పశ్చిమప్రాంతంలోని అన్నిచోట్ల టీడీపీలోకి భారీగా వలసలు పెరిగాయి. అలాగే మాగుంట రాకతో పలువురు ద్వితీయశ్రేణి నాయకులు కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మార్కాపురంలో పోటీకి సిద్ధంగా ఉన్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం రాత్రి ఒంగోలు వచ్చి మాగుంటను కలిశారు. గురువారం వారు హైదరాబాద్ వెళ్లారు. అక్కడ బాబును కలిసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు మాగుంట మార్కాపురంలో పార్టీ కార్యాలయంగానే కాకుండా నివాసానికి అనుగుణమైన ఇంటిని తీసుకోబోతున్నారు. అందుకోసం ఒకటి రెండు ఇళ్లు చూశారు కూడా. ఎంపీగా పోటీచేస్తున్న రాఘవరెడ్డి ప్రచారం కోసమే ఇల్లు తీసుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ మాగుంట, టీడీపీ అధినాయకత్వం అడుగులు, కొత్త వ్యూహంలో భాగంగానే కనిపిస్తున్నాయి.

కీలకంగా మహీధర్‌తో వేమిరెడ్డి భేటీ

గురువారం సాయంత్రం నెల్లూరు లోక్‌సభ స్థానం టీడీపీ అభ్యర్థి అయిన వేమిరెడ్డి కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డితో భేటీ కావటం రాజకీయంగా కీలకమైంది. మహీధరరెడ్డిని ఆయన స్వగ్రామమైన మాచవరంలో వేమిరెడ్డి కలిసి సుమారు గంటసేపు మంతనాలు జరిపారు. వేమిరెడ్డి వైసీపీలో ఉన్నప్పటి నుంచి మహీధరరెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన శనివారం టీడీపీలో చేరి నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీచేయబోతున్నారు. ఇప్పటికే నెల్లూరులో వైసీపీలో ఆయనతో సన్నిహితంగా ఉండే పలువురితో ఆ పార్టీకి రాజీనామా చేయించారు. తాజాగా మహీధర్‌తో కూడా ఆయన టీడీపీలో చేరే అంశాన్ని గురించే మాట్లాడి ఉండవచ్చని భావిస్తున్నారు. మహీధర్ ఏ విషయంపైనా స్పష్టమైన హామీ ఇవ్వలేదని అంటున్నారు. ఒకటి రెండురోజులు సమయం కావాలని చెబుతూనే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండటమే ఉత్తమమని ఆలోచిస్తున్న విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. ఇప్పటికే ఇద్దరు ఇన్‌చార్జిలను మార్చిన వైసీపీ.. మధుసూదన్ విషయంలో కూడా పునరాలోచన చేస్తుందేమోనన్న అనుమానాలు కూడా మహీధరరెడ్డి చేస్తున్నట్లు సమాచారం. అదే విషయాన్ని ఆయన అనుచరులతో కూడా ఆయన వ్యాఖ్యానిస్తున్నారు. వేమిరెడ్డి కలిసి వెళ్లిన తర్వాత మహీధరరెడ్డి తన వ్యక్తిగత కుటుంబ శ్రేయోభిలాషులతో పాటు ముఖ్య అనుచరులతో ప్రత్యక్షంగానేగాక, ఫోన్‌లో కూడా మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం.

బిజీబిజీగా మాగుంట

ఎంపీని కలిసేందుకు భారీగా అభిమానుల రాక



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29 : వైసీపీకి రాజీనామా చేసిన ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అభిమానులు తరలిరావడంతో ఆయన కార్యాలయం కిటకిటలాడింది. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిమానులతో సందడి నెలకొంది. ఇప్పటివరకు వైసీపీలో ఎంపీగా ఉన్న మాగుంటపై అధిష్ఠానం వ్యవహరించిన తీరుతో విసిగిపోయి బుధవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ద్వితీయ శ్రేణి నాయకులు మాగుంటను కలిసి మద్దతు తెలిపారు. నగరంలోని జరిగిన పలు ప్రారంభోత్సవాలు, ఇతర కార్యక్రమాల్లోనూ ఎంపీ మాగుంటను నాయకులు, అభిమానులు ఫాలో అయ్యారు.

పాఠశాల వంట గదికి తాళం

బిల్లు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ ఆగ్రహం



వంటగదికి తాళాలు వేస్తున్న యేసు

బేస్తవారపేట, ఫిబ్రవరి 29 : పాఠశాల వంటగదికి స్కూల్ కమిటీ చైర్మన్ తాళం వేసిన ఘటన మండలంలోని బసినేపల్లెలో చోటుచేసుకొంది. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2018లో చైర్మన్‌గా ఉంటూ గోన యేసు పాఠశాలలో రూ.1.50 లక్షలతో వంటగదిని నిర్మించాడు. అయితే నాటి నుంచి నేటి వరకు బిల్లులు ఇవ్వలేదు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని వాపోయారు. అప్పుతెచ్చి వంట గది నిర్మించినప్పటికీ, నేటికీ బిల్లు ఇవ్వలేదని యేసు తెలిపారు. ప్రస్తుతం అప్పుకు వడ్డీ పెరిగిందన్నారు. బిల్లు ఇవ్వకపోవడంతో గురువారం గోన యేసు వంట గదికి తాళాలు వేశారు. దీంతో పాఠశాలలో వంట చేయడానికి ఇబ్బంది పడ్డారు. తనకు బిల్లులు చెల్లిస్తేనే గదికి తాళాలు తీస్తానని ఎంఈవోకు, పాఠశాల హెచ్‌ఎంకు విన్నవించాడు. ప్రస్తుతం కూడా ఆయనే చైర్మన్‌గా ఉన్నాడు. అయినప్పటికీ, బిల్లులు రాక తాళం వేయడం గమనార్హం.

బకాయిల కోసం ఏపీటీఎఫ్ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏ ఇతర బకాయిలన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. 12వ పీఆర్సీలో 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలు విడతల వారీగా కాకుండా ఏకమొత్తంగా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ల క్లెయిమ్స్‌లను వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు పర్సనల్ క్వాంటం పెన్షన్లను పెంచాలని, టీచర్ల నియామకంలో అప్రంటీస్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ పేస్కేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ప్రతినిధులు బి.శేషారావు, పి.హనుమంతరావు, పి.శేషిరెడ్డి, ఐ.విజయసారథి, పి.సుబ్బారావు, ఎంవి.కృష్ణయ్య, డి.మధు, పి.వీరరాఘవులు పాల్గొన్నారు. అనంతరం ఒంగోలు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కనిగిరిలో జరిగిన ఏపీటీఎఫ్ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని ఉపాధ్యాయులకు మద్దతు తెలిపారు.

నిధుల గోల్‌మాల్‌పై పాలకవర్గం ఆగ్రహం



డీసీఎంఎస్ భవనం

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29 : డీసీఎంఎస్‌లో జరిగిన ఎరువుల నిధులు గోల్‌మాల్‌పై గురువారం జరిగిన సొసైటీ పాలకవర్గ సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ పాలకవర్గ సమావేశానికి సొసైటీ అధ్యక్షురాలు రావి పద్మావతి అధ్యక్షత వహించారు. ఎరువులకు సంబంధించి పొగాకు బోర్డు నుంచి సొసైటీకి జమ చేసిన నిధులను సొసైటీ అకౌంటెంట్ బి.రామచంద్రరావు డ్రాచేసి గోల్‌మాల్ చేయడంపై సమావేశంలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. సమావేశం నుంచే రామచంద్రరావుతో అధికారులు ఫోన్‌లో మాట్లాడి రెండురోజుల్లో గోల్‌మాలైన నిధులు తిరిగి సొసైటీకి జమచేయాలని హెచ్చరించారు. పొలం విక్రయించి డబ్బులు సొసైటీకి జమచేస్తానని ఆయన చెప్పినట్లు సమాచారం. రామచంద్రరావు నుంచి ఆ నిధులు వసూలు చేసిన తర్వాత అతనిపై చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, బిజినెస్ మేనేజర్ పాల్గొన్నారు.

ఆరంభం పర్వాలేదు

- పొగాకు కిలో రూ.230 పలికిన ధర
- ప్రారంభమైన కొనుగోళ్లు
- పాల్గొన్న బోర్డు చైర్మన్, ఈడీలు

ఒంగోలు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దక్షిణాదిలోని ఒంగోలు-1, కొండపి కేంద్రాలలో తొలివిడతగా గురువారం వేలం ప్రక్రియ చేపట్టగా కొండపిలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఒంగోలు-1లో ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబులు లాంఛనంగా ప్రారంభించారు. రెండుచోట్ల 18 బేళ్ల వంతున తొలిరోజు వేలంకు తీసుకరాగా కిలో రూ.230 గరిష్ఠ ప్రారంభ ధరగా వ్యాపారులు ఇచ్చారు. ఒక్క బేలుకు మాత్రం కిలో రూ.250 లభించింది. అయితే ధరను హ్యాండ్‌సెట్‌లో రూ.230కి బదులు రూ.250ని ఒక కంపెనీకి చెందిన బయ్యరు నొక్కడం వల్ల అలా వచ్చింది. జరిగిన తప్పిదాన్ని సదరు కంపెనీ ప్రతినిధితో పాటు అధికారులు, ఇతర వ్యాపారులందరూ గుర్తించారు. ఈ ఘటన ఒంగోలు-1 వేలం కేంద్రంలో చోటుచేసుకుంది. కాగా ఈ ఏడాది పొగాకును వ్యాపారులు ప్రారంభ ధర కిలో రూ.230 ఇస్తున్న విషయం ఇతర బేళ్లకు ఇచ్చిన ధరను బట్టి స్పష్టం కాగా అదే విషయాన్ని సంబంధిత కంపెనీ ప్రతినిధులు బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా అక్కడ వేలం పరిశీలిస్తున్న బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు అందుకు అనుమతించలేదు. రైతులు కూడా ఈ ఏడాది ప్రారంభ ధర కిలో రూ.250 ఇవ్వాలని కోరుతూ వస్తున్న నేపథ్యంలో పొరపాటుగా అయినప్పటికీ రూ.250 పలకడం వారికి ఎంతో కొంత సంతృప్తి ఇస్తుందన్న భావనతో అధికారులు ఆ ధరను కొనసాగించాలని సూచించారు. ఆ రకంగా తొలిరోజు సాంకేతికంగా గరిష్ఠ ధర కిలో రూ.250గా పరిగణించే అవకాశం ఉన్నప్పటికీ వాస్తవంగా చూస్తే ప్రారంభ ధర కిలో రూ.200గా ఉండగా ఈ ఏడాది రూ.230తో ప్రారంభించడం పట్ల రైతులలో ఒకింత సంతృప్తి వ్యక్తమవుతోంది. అయితే క్రమంగా ధరలు పెంచుతూ సగటు ధర కిలో రూ.250 నుంచి రూ.260 వరకు దక్కేలా చూడాలని రైతు ప్రతినిధులు అటు అధికారులు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఒంగోలు-1లో బోర్డు ఈడీ శ్రీధర్ బాబు పూజలు చేసి కొనుగోళ్లు ప్రారంభించగా ఆర్‌ఎం లక్ష్మణరావు, బోర్డు సభ్యుడు పొద వరప్రసాదరావు, రైతు కమిటీల ప్రతినిధులు గురువారెడ్డి, ఆళ్ల సుబ్బారావు, వడ్డెళ్ల ప్రసాదు పాల్గొన్నారు అలాగే కొండపి కేంద్రంలో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ ప్రారంభించగా, సెక్రటరీ దివి వేణుగోపాల్, బోర్డు సభ్యుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.



ఒంగోలు కేంద్రంలో కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఈడీ శ్రీధర్‌బాబు

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



- నేటి నుంచి ప్రారంభం
- నిమిషం లేటైనా అంతే
- సీసీ కెమెరాల నిఘా

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29 : జిల్లాలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలతో పరీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల ప్రధాన ద్వారాల వద్దే క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

- ఇంటర్ పరీక్షలకు మొత్తం 44,733 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో 21,570 మంది మొదటి సంవత్సరం కాగా, 23,163 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.
- పరీక్షకు విద్యార్థులు నిమిషం లేటుగా వచ్చినా అనుమతించరు. పరీక్ష 9 గంటలకు ప్రారంభమవుతుండగా 9.01కు వచ్చినా విద్యార్థులను అనుమతించరు.
- సీసీ కెమెరాల పటిష్ఠ నిఘాలో పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్రాల్లోని అన్ని గదులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రత్యక్షంగా చూసేందుకు ఒంగోలు ఆర్ఐవో కార్యాలయం, విజయవాడ ఇంటర్ బోర్డు కార్యాలయాలకు ఈ కెమెరాలను అనుసంధానించారు.
- పరీక్ష కేంద్రాలను నో ఫోన్ జోన్ ఏరియాలుగా ప్రకటించారు.
- పరీక్ష నిర్వహణలో అధికారులు, సిబ్బంది, ఇన్విజిలేటర్లు సైతం కేంద్రాలకు మొబైల్ ఫోన్లు తీసుకు రాకూడదు.
- పరీక్షాకేంద్రాలకు డిజిటల్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.
- పరీక్ష విధులకు హాజరయ్యే అధికారులు, ఇన్విజిలేటర్లు, సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలి. బయట వ్యక్తులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదు.
- కంభం, పెదదోర్నాల, అర్ధవీడు, వైపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గిద్దలూరులోని మరో కళాశాలను సున్నితమైనవిగా గుర్తించి వాటిపై ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేశారు.
- పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు మూడేసి చొప్పున ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు.
- పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే విద్యాశాఖ యాక్టు 25 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.
- అన్ని కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులతో వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.
- అన్ని కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.
- పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది. 17 కళాశాలల విద్యార్థుల కోసం ఈ ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను కండక్టర్‌కు చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు.



కంచెలో చిక్కుకొని జింక మృతి

దర్శి మండలం వెంకటాచలంపల్లె పొలాల్లో ఘటన

లోపలి పేజీల్లో...

టూ వీలర్స్ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి



లోకే‌ష్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 29: రాష్ట్రంలోని టూ వీలర్స్, మెకానిక్‌లు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టూ వీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకే‌ష్‌ను కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం తాడేపల్లిలో లోకే‌ష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10లక్షల టూవీలర్ మెకానిక్‌లు ఉన్నారని, జిల్లాల వారీగా వివిధ సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఆయా సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తామన్నారు. కార్మికులందరూ ఎన్నికల్లో అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు డి.ధర్మారావు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌కే. ఆసిఫ్‌ఆలీ, కోశాధికారి జుబేర్, నాయకులు వాసు, మగ్బుల్, నాగరాజు పాల్గొన్నారు.

పంచాయతీల్లో కొనుగోలు చేసే

వస్తువులు నాణ్యతగా ఉండాలి : డీపీవో

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: గ్రామ పంచాయతీల్లో కొనుగోలు చేసే వస్తువులు నాణ్యతా ప్రమాణాలు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ.నారాయణరెడ్డి కోరారు. ఒంగోలులోని పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో గురువారం వివిధ రకాల వస్తువులకు ఉండాల్సిన నాణ్యతా ప్రమాణాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏపీడీఐఆర్‌డీ, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్-బీఐఎస్ ఆధ్వర్యంలో వివిధ రకాల మెటీరియల్స్‌కు ఉండాల్సిన నాణ్యత ప్రమాణాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాల కంపెనీల వాటినే కొనుగోలు చేయాలని చెప్పారు. ప్రధానంగా పంచాయతీల్లో ప్రజల అవసరాల కోసం కొనుగోలు చేసే సిమెంట్, స్టీల్, వ్యవసాయ పరికరాలు, కార్యాలయాలకు అవసరమైన మెటీరియల్, స్టేషనరీ, ఎలక్ట్రికల్ కేబుల్స్, పీవీసీ పైప్స్, గ్యాస్‌స్టౌవ్, ప్రెజర్ కుక్కర్ తదితర వస్తువులకు సంబంధించి తప్పనిసరిగా నాణ్యతగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన బేళ్లకు అధిక ధరలు

- పొగాకు బోర్డు కార్యదర్శి వేణుగోపాల్



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

కొండపి, ఫిబ్రవరి 29 : రైతులు పొగాకును నాణ్యమైన గ్రేడింగ్ చేసుకుని బేళ్లు వేలానికి తీసుకొస్తేనే గిట్టుబాటు ధరలు వస్తాయని గుంటూరు పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ చెప్పారు. గురువారం ఉదయం కొండపిలో పొగాకు వేలం కేంద్రంలో వేలం ప్రారంభమైన సందర్భంగా కేంద్రం ఆవరణలో రైతులతో జరిగిన సమావేశంలో రైతు నాయకుడు నాగినేని బాస్కర్ మాట్లాడుతూ ఈ ఏడాది పొగాకు పెట్టుబడి వ్యయం అధికమైందన్నారు. సరాసరి ధర కేజీకి 260 రూపాయలు వస్తేనే గిట్టుబాటు అవుతుందని చెప్పారు. సమావేశంలో సభ్యుడు బొడ్డపాటి బ్రహ్మయ్య, బ్లాక్ సాయిల్ వర్జీనియా పొగాకు రైతుల సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, ఫెర్టిలైజర్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసమురళి, ఐటీసీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పొగాకు వేలం ప్రారంభం

కొండపి, ఫిబ్రవరి 29 : కొండపి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. వేలం కేంద్రం పరిధిలోని మర్రిపూడి మండలం జువ్విగుంట గ్రామానికి చెందిన ఎంపిక చేసిన నాణ్యమైన ఎఫ్-1 రకం బేళ్లు రైతులు వేలానికి ఉంచారు. వేలం నిర్వహణాధికారి గర్నెపూడి సునీల్‌కుమార్ కేజీ 255 రూపాయలు ధర నిర్ణయిస్తూ వేలం ప్రారంభించారు. కంపెనీల ప్రతినిధులు కేజీ 230 రూపాయలకు అన్ని బేళ్లను కొనుగోలు చేశారు. వేలం కార్యక్రమాన్ని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, బోర్డు కార్యదర్శి వేణుగోపాల్ పరిశీలించారు.

ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-1లో..

సంతనూతలపాడు, ఫిబ్రవరి 29: పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-1లో గురువారం పొగాకు కొనుగోలు ప్రక్రియను బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6న మిగిలిన కేంద్రాల్లో కొనుగోలు ప్రారంభిస్తామని తెలిపారు. 2023-24 ఆక్షన్‌లో అదనంగా పండించిన పొగాకుకు జరిమానా విధించే అవకాశముందన్నారు. కాగా 18 పొగాకు బేళ్లు చిలంకూరు గ్రామానికి చెందిన రైతులు వేలానికి తీసుకురాగా గరిష్ఠంగా రూ.250, కనిష్ఠ ధర రూ.230లు దక్కింది. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ ఎం.లక్ష్మణరావు, మారం సుబ్బారెడ్డి, పి.వరప్రసాద్, రైతు నాయకులు పాల్గొన్నారు.

పశువుల సంత ప్రారంభం



పశువుల సంతను ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

సంతనూతలపాడు, ఫిబ్రవరి 29: సంతనూతలపాడులో గత కొన్నేళ్లగా మూతపడిన పశువుల సంతను గురువారం మంత్రి, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేరుగ నాగార్జున ప్రారంభించారు. తొలుత కార్యక్రమానికి హాజరైన మంత్రి నాగార్జునకు సెక్రటరీ దానమ్మ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం.బంగారుబాబు, మండల కన్వీనర్ చెంచిరెడ్డి, నాయకులు యలమందారెడ్డి, శ్రీమన్నారాయణ, అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 29: బాల్యవివాహాలను అరికట్టాలని సీడీపీవో ఇవాంజలిన్ తెలిపారు. గురువారం సంతనూతలపాడులోని మండలపరిషత్ కార్యాలయంలో కైలాస్ సత్యర్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల సంరక్షణ కోసం, అత్యవసరమైతే 1098 టోల్‌ఫ్రీ నెంబర్, పోలీస్ హెల్ప్‌లైన్ నెంబరు 100కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, ఎంఈవో వెంకారెడ్డి, ఏఎన్ఎంలు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 29 : ఒంగోలులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో గురువారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డైరెక్టర్ జగదీష్ మాట్లాడారు. విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసి వారి ఆలోచనకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే భావి తరాలకు శాస్త్రవేత్తలుగా ఎదుగుతారన్నారు. కాగా విద్యార్థులు సుమారు 56 రకాల ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దుర్గా భవాని, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి అర్బన్ ఎస్ఐగా కృష్ణయ్య

చీమకుర్తి, ఫిబ్రవరి 29 : చీమకుర్తి అర్బన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా యావి కృష్ణయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ముండ్లమూరు పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

వైభవంగా నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ

నాగులుప్పలపాడు(ఒంగోలురూరల్), ఫిబ్రవరి 29: కనపర్తిలోని శ్రీగంగా పార్వతీసమేత ఏలేశ్వరస్వామి దేవాలయంలో గురువారం నందీశ్వర విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

'మెప్మా' కుంభకోణంలో దోషులపై చర్యలేవీ..?

బాధ్యులందరిపై చర్యలు తీసుకోకుంటే కోర్టుకెళతాం • టీడీపీ నాయకుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 29 : బోగస్ గ్రూపుల పేరుతో భారీగా కుంభకోణానికి పాల్పడిన వారిలో అసలు దోషులను వదిలేశారని, కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా విచారణ జరిగిందని, అవినీతిలో ఇంకా దోషులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వారిపై చీటింగ్ కేసులు నమోదు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మెప్మాలో సుమారు రూ.50 కోట్ల మేర అవినీతి జరిగిందని తాము ఆరోపించగా, కలెక్టర్‌కు కూడా వినతి పత్రం అందజేసినట్లు చెప్పారు. తమ విన్నపాన్ని స్వీకరించిన కలెక్టర్ ముగ్గురు అధికారులను విచారణకు ఆదేశించగా, అవినీతికి పాల్పడిన వారిలో కొందరిని మాత్రమే బాధ్యులను చేసి అసలు దోషులను వదిలేశారని ఆరోపించారు. ఇందులో వెనుక వుండి అవినీతికి కారణమైన వైసీపీ కార్పొరేటర్లు, నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తమ ఆరోపణలపై స్వయంగా మేయర్ స్పందించి మీడియాతో మాట్లాడి రూ.12 కోట్లు అవినీతి జరిగిందని ఒప్పుకున్నారన్నారు. మెప్మాలో జరిగిన విచారణ జరిపి కొందరుపైనే వేటు వేశారన్నారు. అయితే రిమూవ్ చేశారని, అయితే రికవరీ సంగతి ఏమిటని వారు ప్రశ్నించారు. ఈ కుంభకోణంలో బ్యాంకు అధికారుల పాత్ర కూడా ఉందని, వారిని విచారించాలని డిమాండ్ చేశారు. మేయర్ 24 గంటల్లో అవినీతిపై స్పష్టమైన ప్రకటన చేస్తే, అధికారులు పదహారు రోజుల తర్వాత మొక్కుబడి చర్యలకు పరిమితం అయ్యారని ఆరోపించారు. అయితే బ్యాంకు అధికారులపైన, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన వారిపైన, అలాగే ఇందులో కీలకంగా వ్యవహరించిన వైసీపీకి చెందిన కొందరు కార్పొరేటర్లు, వైసీపీ మహిళ నాయకులు, ఇతర నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. దీనిలో మెప్మా జిల్లా అధికారులను కూడా కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, సీవోలు, సీఎంఎం, పీడీపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. దీనిపై హైకోర్టులో ప్రజాప్రయోజనం వాజ్యం దాఖలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా మేయర్ గంగాడ సుజాత, ఇతర అధికారుల పాత్రపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. విచారణ అధికారుల తీరుపైనా అనుమానాలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో నాయకులు ఎద్దు శశికాంత్‌భూషణ్, కామేపల్లి శ్రీనివాసరావు, చుండి శ్యామ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే క్రైస్తవులకు మేలు

టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాసు



మాట్లాడుతున్న స్వామిదాసు

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 29: తెలుగుదేశం పార్టీ హయాంలోనే క్రైస్తవులకు మేలు జరిగిందని ఆ పార్టీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని మార్టిన్ మెమోరియల్ చర్చిలో పాస్టర్స్ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులు తెలుగుదేశం పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించాలని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే మేలు జరుగుతుందని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో క్రైస్తవులు, పాస్టర్లపై దాడులు పెరిగాయని ఆరోపించారు. దేవుని సేవ కూడా స్వేచ్ఛగా చేసే పరిస్థితిలో లేదన్నారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ జిల్లాలో సంఘకాపరులకు, పాస్టర్లకు ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే క్రైస్తవులపై దాడులు అరికట్టాలని కోరారు. శుభకార్యాలు చేసుకోవడానికి కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు స్థలం కేటాయించాలన్నారు. అదేవిధంగా ప్రతి మండలంలోనూ క్రైస్తవుల సమాధుల తోటకు స్థలం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన స్వామిదాసు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, రాబోయే ఎన్నికల్లో అండగా ఉండాలని కోరారు. క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షులు టీఎస్ఎస్.సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కపిల్‌బాషా, 11వ డివిజన్ అధ్యక్షుడు గంగవరపు సందీప్, నగరంలోని పాస్టర్లు పాల్గొన్నారు.

అట్టడుగువర్గాల అభివృద్ధికి బాబు ష్యూరిటీ

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్



అంబేడ్కర్‌నగర్‌లో కరపత్రాన్ని అందజేస్తున్న విజయ్‌కుమార్

చీమకుర్తి, ఫిబ్రవరి 29 : అట్టడుగు వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి చంద్రబాబునాయుడు ష్యూరిటీ అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీఎన్.విజయ్‌కుమార్ తెలిపారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం చీమకుర్తి పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, తూర్పుబజార్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన బీఎన్‌కు అడుగడుగునా మహిళలు, యువకులు ఘనస్వాగతం పలికారు. పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన తదుపరి ఇంటింటా తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. ఆడబిడ్డ నిధి కింద 18ఏళ్ల దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటున్నా ఒక్కొక్కరికి రూ.15వేలు, దీపం పథకం కింద ఏడాదికి కుటుంబానికి మూడు సిలిండర్లు ఉచితం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు, యువగళం నిధి కింద ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేలను టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, కాట్రగడ్డ రమణయ్య, కాట్రగడ్డ కృష్ణవేణి, గొల్లపూడి సుబ్బారావు, గంగుల శివపార్వతి, గొల్లపూడి కోటేశ్వరరావు, గొల్లపూడి రమాదేవి, బత్తుల రమణ, పాండ్యా ఆశీర్వాదం, చావాబత్తిన శ్రీనివాసరావు, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్, తాతినేని శ్రీరాం, దరిమడుగు నాగరాజు పాల్గొన్నారు.

బీఎన్‌కు సత్కారం

ఒంగోలు(రూరల్): మద్దిరాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గురువారం ఒంగోలులో బీఎస్.విజయకుమార్‌ను కలిసి బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి సాయిబాబా, నెప్పల శివకృష్ణ, చెరుకూరి రమేష్, వద్దినేని నరేంద్ర, నెప్పల శ్రీకాంత్, నెప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ఎంబీబీఎస్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే



సెల్ఫీలు దిగుతున్న వైద్యవిద్యార్థులు



ఈ పట్టా అమ్మకు అంకితం..



చిన్నారితో ఫొటో దిగుతూ...

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 29 : ఒంగోలులోని రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక కాలేజీ ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అధ్యక్షతన వేడుకలకు ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తి పవిత్రమైనదన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు దేవుడుగా భావించే వైద్యుడు సేవా గుణం కలిగి ఉండాలని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ మాట్లాడుతూ డాక్టర్ కావాలనే కోరిక ప్రతి విద్యార్థిలోనూ ఉంటుందని, అయితే దానిని నిజం చేసుకోవడంలోనే కృషి, పట్టుదల అవసరమన్నారు. భగవంతుడు డాక్టర్‌గా ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నాలుగేళ్లపాటు ఎంతో కష్టపడి చదువు పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ ఏడుకొండలు మాట్లాడుతూ కేవలం ఎంబీబీఎస్‌తోనే కాకుండా వివిధ విభాగాల్లో స్పెషలైజేషన్ చేయాలని సూచించారు. విద్యా బోధన చేసిన అధ్యాపక, సిబ్బందిని అభినందించారు.

మధుర జ్ఞాపకాలు..

తల్లిదండ్రుల కష్టం, విద్యార్థుల కలల నిజమైన గ్రాడ్యుయేషన్ రోజు వారిలో మరపురాని మధుర స్మృతులను మిగిల్చింది. తమ పిల్లలు గ్యాడ్యుయేషన్ పట్టా పుచ్చుకున్న రోజును పండుగలా భావించారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రుల కళ్లలో ఆనందభాష్పాలు కనిపించగా, సహ విద్యార్థులతో సెల్ఫీలతో సందడి చేశారు. ఇన్నాళ్ళ తమ విద్యాభ్యాసం, పడిన కష్టాని తగిన గుర్తింపు వైద్యుడుగా పట్టా పొందడం మరచి పోలేకపోతున్నామన్నారు. భవిష్యత్తులో పేదలకు వైద్య సేవలందించి, తమ సేవా గుణాన్ని చాటుకుంటామని విద్యార్థులు వెల్లడించారు.

ఉత్సాహంగా నాటకోత్సవాలు



నాటికలోని ఓ సన్నివేశం

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 29: ఒంగోలులో గత మూడు రోజులుగా హైదరీక్లబ్‌లో జరుగుతున్న నాటకోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి ప్రముఖ నాటక రచయిత గోవిందరాజుల నాగేశ్వరరావు రచించిన పక్కింటి మొగుడు నాటిక హాస్య భరితంగా కొనసాగింది. ముందుగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పడమిటి గాలి నాటకంపై రూపొందించిన ది సెన్సేషన్ ఆఫ్ పడమటి గాలి డాక్యుమెంటరీని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వాతావరణానికి, రైతుల జీవనానికి, యువత పాశ్చాత్య పోకడలకు దర్పణం పట్టేలా నాటకాన్ని రచించిన పాటిబండ్ల ఆనందరావు అభినందనీయులన్నారు. రచయిత పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ పడమిటి గాలి నాటిక రెండు తెలుగు రాష్ట్రాలలో అనేక చోట్ల ప్రదర్శితమై సంచలనం సృష్టించిందన్నారు. దీని వెనుక నటీనటులు, సాంకేతిక వర్గం చేసిన కృషి ఎంతో గొప్పదని చెప్పారు. నాటకాన్ని 25 సంవత్సరాలు గడిచినా ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ అంగలకుర్తి విద్యాసాగర్ ఈ డాక్యుమెంటరీని రూపొందించగా, శ్యామ్ చదలవాడ దర్శకత్వం వహించారు.

అలరించిన పక్కింటి మొగుడు

అనంతరం ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక ఇతరుల అవసరాలను అవకాశంగా తీసుకుని ఎదుటివారిని బ్లాక్‌మెయిల్ చెయ్యటం తప్పనే సారాంశంతో వివిధ పాత్రల మధ్య హాస్య భరితమైన సంభాషణలు, కడుపుబ్బ నవ్వించే సన్నివేశాలతో కొనసాగింది. ఓ తాతగారు, బామ్మగారు తమ ఆస్తికి వీలునామా రాసి చనిపోగా, ఆ ఆస్తిని ఆయన వారసులకు అందజేయటానికి వచ్చిన లాయర్, ఆ కుటుంబ సభ్యుల మధ్య కథ రసవత్తరంగా కొనసాగింది. లాయర్ వచ్చిన సమయంలో ఆస్తికి వారసుడైన మధు ఇంట్లో లేకపోవటంతో కథ వివిధ మలుపులు తిరుగుతుంది. బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించిన ఈ నాటికలో ఎం.హరనాథబాబు, బాలినేని నాగేశ్వరరావు, దేవసేన, యశోద, ఉన్నం వెంకటశేషయ్య, ఎం.శ్రీరామమూర్తిలు అద్భుతంగా నటించారు. నాటికకు శ్రీరమణ సంగీతాన్ని సమకూర్చగా, పాటిబండ్ల కమలాకర్ ఆహార్యం, రంగాలంకరణ బాధ్యతలు నిర్వహించారు.

అవీ..ఇవీ..

3న పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా ఎన్నికలు జరగనున్నాయి. ఈమేరకు ఎన్నికల అధికారులైన ఏపీఎన్‌జీవో సంఘం ఒంగోలు నగర అధ్యక్ష, కార్యదర్శులు టి.మంజేష్, ఎస్‌కే.మగ్బుల్‌షరీఫ్‌లు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. మార్చి 3వ తేదీన పాత జిల్లా పరిషత్ సమావేశపు మందిరంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శితో పాటు అసోసియేట్ అధ్యక్షులు, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్తకార్యదర్శి, కోశాధికారితో పాటు ఆర్గనైజింగ్ సెక్రటరీలు, స్టేట్ కౌన్సిలర్, జేసీసీ మెంబర్ల పదవులకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 10నుంచి 10.30 గంటల వరకు నామినేషన్ల పత్రాల జారీ, ఉదయం 10.30నుంచి 11 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, ఉదయం 11నుంచి 11.30 గంటల వరకు నామినేషన్ పత్రాల పరిశీలన, 11.30 గంటలకు నామినేషన్ల పత్రాల ప్రకటన, మధ్యాహ్నం 12 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ, 12.15 గంటలకు పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు పోలింగ్, సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుందని వారు ప్రకటించారు.

ఘనంగా క్విస్‌లో సైన్స్‌డే



బహుమతిని అందుకుంటున్న విద్యార్థినులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. క్విస్ విద్యా సంస్థల ఫౌండర్ చైర్మన్ నిడమానూరి సూర్య కళ్యాణచక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ గాయత్రి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు ప్రదర్శనను తిలకించారు. ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ మూలాలను అవగాహన చేసుకొని పూర్తిస్థాయి ఇంజనీరింగ్ విద్యార్థిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో బేసిక్ సైన్స్ అండ్ హ్యుమనిటీస్ విభాగాధిపతి గంటా శ్రీనివాసరావు, డిపార్ట్‌మెంట్ ప్రాజెక్టు స్కిల్లింగ్, రీసెర్చ్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



బ్యాటింగ్ చేస్తూ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ మాగుంట

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: పీసీఎల్ బై మాగుంట టీ10 క్రికెట్ మెగా ఫైనల్ పోటీలను గురువారం ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. ఈ క్రికెట్ పోటీలు ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించగా గురువారం ఒంగోలులో ఫైనల్ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన ఎంపీ మాగుంట యువకులతో కలిసి క్రికెట్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. క్రీడాకారులకు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, మాజీ ఎంపీపీ జెల్లం సత్యనారాయణ, ఆంధ్రక్రికెట్ అసోసియేషన్ సభ్యుడు వెంకటాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్‌కు 722 మంది హాజరు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29 : ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(ఏపీటెట్) కు గురువారం ఒంగోలు నగరంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో మొత్తం 722 మంది అభ్యర్థులు హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు. పరీక్షకు మొత్తం 787 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 65 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

6 నుంచి టంగుటూరులో పొగాకు కొనుగోళ్లు

టంగుటూరు, ఫిబ్రవరి 29 : టంగుటూరులోని పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ల ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు టుబాకో బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు గురువారం చెప్పారు. ఒంగోలు-1 ప్లాట్‌ఫాంలో కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. ఈ కొనుగోళ్లను పరిశీలించేందుకు ఒంగోలు టుబాకో వేలం కేంద్రం-1కు వచ్చిన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మిగిలిన పొగాకు వేలం కేంద్రాలన్నీ ఈనెల 6న ప్రారంభం కానున్నట్లు చెప్పారు.

నూరుశాతం పోలియో చుక్కలు వేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి

సింగరాయకొండ, ఫిబ్రవరి 29 : మార్చి 3 ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో ఐదేళ్లలోపు ఉన్న చిన్నారులకు నూరుశాతం పోలియో చుక్కలు వేయాలని జిల్లా వైద్యాధికారి రాజ్యలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చైతన్యకృష్ణ, శ్రీధర్, ఉజ్వల, లీనా రేఫెల్ సీహెచ్‌వోలు బీవీకే సాంబశివరావు, సయ్యద్ మసూద్ అలీ, కె.రాజమ్మ, సయ్యద్ అక్బర్‌బాషా, పద్మ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కె.ఉప్పలపాడులో పరిశీలిస్తున్న అధికారులు

కొండపి, ఫిబ్రవరి 29 : మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను నియోజకవర్గ ఈఆర్వో ఎ.కుమార్, తహసీల్దార్ బి. కిరణ్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు, ర్యాంప్‌లు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.


ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయం : బీజేపీ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయం కావడంతో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్నారని బీజేపీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వైసీ.యోగయ్యయాదవ్ పేర్కొన్నారు ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా గురువారం రామనగర్, డీమార్ట్ సెంటర్, పెళ్ళూరు గ్రామాల్లో జరిగిన సభల్లో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించారన్నారు. అన్ని వర్గాల ప్రజలను రోడ్డు వేయడంతో ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. దేశాభివృద్ధి కోసం పాటుపడుతున్న బీజేపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శెగ్గం శ్రీనివాసరావు, డి.శివాజీ, సత్యనారాయణ, సంజీవకుమార్, సీతారామయ్య రాయపాటి అజయ్, ధనిశెట్టి రాము, మరంపల్లి దుర్గేష్, కోటేశ్వరి, సత్యవతి, రాజేష్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 29: శాంతిభద్రతలు పరిరక్షణలో భాగంగా ఒంగోలు సబ్‌డివిజన్‌లో 30 పోలీసు చట్టం అమలు చేస్తున్నట్లు డీఎస్పీ కిషోర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 30 వరకు ఈ చట్టం అమలులో ఉంటుందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసు ముందస్తు అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

వడ్డెర కాలనీ యువత నివాళి



నివాళులర్పిస్తున్న కాలనీవాసులు

కొణిజేడు(టంగుటూరు), ఫిబ్రవరి 29 : టీడీపీ నాయకుడు మన్నం వెంకటరమణ మరణం మండలంలోని కొణిజేడు వడ్డెర కాలనీ ప్రజలను తీవ్రంగా కలచివేసింది. తమ కాలనీలో మన్నం తన సొంత నిధులు రూ.3లక్షలు వెచ్చించి కమ్యూనిటీ భవనం నిర్మించారని వారంతా గుర్తు చేసుకున్నారు. తమ కాలనీ అభివృద్ధికి సహకరించిన మన్నం లేకపోవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. వారంతా గురువారం కమ్యూనిటీ భవనంలో మన్నం చిత్రపటాన్ని ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు.



బీసీ కమిషన్ సభ్యునికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి

● కమిషన్ సభ్యులు కుందుర్తి

మర్రిపూడి, ఫిబ్రవరి 29 : బలహీన వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ సభ్యులు కుందుర్తి గురవాచారి చెప్పారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీలకు రిజర్వేషన్లు వర్తిస్తాయని చెప్పారు. ఇప్పటికే 30 కులాలను గుర్తించి జాతీయ బీసీ కమీషన్‌కు పంపించామన్నారు. అంతకు ముందు ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, బీసీ నాయకులు గురవాచారికి సాదర స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసాచారి, జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మాచేపల్లి నాగయ్య సర్పంచ్ కదిరి భాస్కరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పీ బ్రహ్మానందం, పీ సుధాకర్, ఈ రవిప్రసాద్, మాల్యాద్రి, ఈదుముడి ప్రసాద్, గట్టుపల్లి శ్రీనివాసులు, గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపోరు యాత్రలో ప్రసంగిస్తున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బాలకోటయ్య

కేంద్ర పథకాలను పక్కదారి పట్టిస్తున్న వైసీపీ ప్రభుత్వం

మర్రిపూడి, ఫిబ్రవరి 29 : ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పలు ప్రజా సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ మిడసల బాలకోటయ్య ఆరోపించారు. బీజేపీ చేపట్టిన ప్రజాపోరు యాత్రలో భాగంగా గురువారం అయ్యపరాజుపాలెం, జగ్గరాజుపాలెం, తంగెళ్ల, కూచిపూడి, మర్రిపూడి గ్రామాల్లో జరిగిన చైతన్య యాత్రలో ఆయన ప్రసంగించారు. మహిళలు, రైతులు, యువత, నిరుపేద కులాల ఆర్థిక అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లూరి రామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు కుంచాల ప్రసాదు, బీజేపీ మండల కన్వీనర్ వై పిచ్చయ్య చౌదరి, నియోజకవర్గ కార్యదర్శి ఏ శివ, నాయకులు బెండ చైతన్య పాల్గొన్నారు.

కంచెలో చిక్కుక్కొని జింక మృతి

దర్శి, ఫిబ్రవరి 29 : మండలంలోని వెంకటచలంపల్లి పొలాల్లో ఒక దానిమ్మతోటకు వేసిన కంచెలో ఇరుక్కొని చుక్కల జింక మృతి చెందింది. వెంకటచలంపల్లి కొండ కింద వన్యప్రాణులు తిరుగుతుంటాయి. ఆ ప్రదేశంలో సాగు భూముల్లో బోర్లు వేసి దానిమ్మ తోటలు వేశారు. ఎండలకు తోటలోకి ప్రవేశించే క్రమంలో కంచెలో ఇరుక్కొని ఊపిరాడక జింక మృతి చెందింది.



అరాచక పాలకులకు బుద్ధి చెప్పండి

ఏపీటీఎఫ్ ధర్నాకు సంఘీభావం తెలిపి మాట్లాడిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 29 : వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలకులకు బుద్ధి చెప్పాలని కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన ధర్నాకు డాక్టర్ ఉగ్ర గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సక్రమంగా నెల జీతం పడే పరిస్థితి లేదన్నారు. ఎన్నికలకు ముందు జగన్ సీపీఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేస్తామని హామీ నెరవేర్చలేదని విమర్శించారు. సమాజంలో పూజ్యులైన ఉపాధ్యాయులను వైసీపీ పాలకులు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సైకో జగన్‌ను ఉపాధ్యాయులు, ఉద్యోగులు గద్దె దింపాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లు ఉపాధ్యాయులు ఎన్ని ఉద్యమాలు చేసినా జగన్‌రెడ్డి పట్టించుకోలేదన్నారు. దీంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్, నాయకులు శ్రీనివాసులు, బీవీఎస్ ప్రసాద్, ప్రసాద్, హజరత్‌రెడ్డి, దండే శ్రీనివాసులు, రమేష్‌బాబు, జేఎస్ ఆనంద్‌బాబు, కే రామ్మోహన్, సుబ్బయ్య, జీ రామకృష్ణ, హరిబాబు, వహీద్, చిన్న నారాయణ, ఖజామస్తాన్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న టీడీపీ కనిగిరి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

దర్శి : ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని అప్రంటీస్ విధానం రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ అలవెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏఎల్‌వీ ప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకులు ఎస్‌కోటేశ్వరరావు, జి రంగ స్వామి, వి రాఘవరావు, ఎస్‌కె మస్తాన్‌వలి, షేక్ కరిముల్లా, మహితేజ, శ్రీనివాసులు, బి రామకృష్ణ, వేమా రమణయ్య, వెంకటేశ్వర్లు, డివి రమణారెడ్డి, చక్రదర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి



పోలీసు అధికారుల సమీవేశంలో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి

నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 29: ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. గురువారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేసి దోషులకు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా చెడునడవడిక ఉన్నవారిని బైండోవర్ చేయాలని చెప్పారు. ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందుకోసం సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రధాన దృష్టి సారించాలని సూచించారు. గత ఎన్నికల్లో జరిగిన నేరాలను సమీక్షించి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లపైని రంతర నిఘా ఉంచాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదిదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, డీఎస్పీలు రామచంద్ర, రామరాజు, బాలసుందరరావు, అశోక్‌వర్ధన్, వి. శ్రీనివాసులు, సీహెచ్.శ్రీనివాసులు, ట్రైనీ డీఎస్పీ షేక్ షహబాజ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెడ్‌కానిస్టేబుల్‌కు సత్కారం

పోలీసుశాఖలో 33 ఏళ్ళు ఉద్యోగం చేసి హెడ్ కానిస్టేబుల్ హోదాలో ఉద్యోగ విరమణ చేసిన ఎ సెకె.అహ్మద్‌బాషను ఎస్పీ పరమేశ్వరరెడ్డి స్థానిక ఎస్పీ కార్యాలయంలో శాలువతో సత్కరించారు. భవిష్యత్తులో పోలీసుశాఖ అండగా ఉంటుదని ఎస్పీ పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు సర్దార్ డిమాండ్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29: రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించడంతో పాటు వేల సంఖ్యలో పేరుకుపోయిన క్లెయిమ్స్‌ను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌డీ.సర్దార్ డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో చేర్చాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఒంగోలు నగరం కర్నూలురోడ్డు పై ఓవర్ బ్రిడ్జి వద్ద కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేసి రూ.1200 కోట్లకు పైగా కార్మికుల సొమ్మును ప్రభుత్వ ఖజానాకు దారి మళ్ళించిందని ఆరోపించారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు బోర్డు ద్వారా అనేక సౌకర్యాలు పొందుతుంటే మన రాష్ట్రంలో మాత్రం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కార్మికుల కడుపు కొడుతుందని విమర్శించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఏపీ భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి బి.హరికృష్ణ మాట్లాడుతూ కరోనా కాలంలో పనులు లేక భవన నిర్మాణ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడి అనేక మంది మరణించినా ఏ ఒక్కరికి ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇసుక, సిమెంట్, ఇటుక ధరలు విపరీతంగా పెంచడంతో గృహ యజమానులు పనులు నిలిపివేయడంతో కార్మికులకు పనులు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పీవీఆర్.చౌదరి, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, శ్రీను, సుబ్బారావు, ఎస్‌కే. బాషా, బాలాజీ, బాబురావు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మన బూత్ బాధ్యత మనదే ..!

» నిబద్ధతతో పనిచేస్తే విజయం మనదే
» డబుల్‌గేమ్ పద్ధతి మార్చుకోవాలని హితవు
» టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 29 : మన బూత్ బాధ్యత మన దేనని.. నిబద్ధతతో పనిచేస్తే వచ్చే ఎనికల్లో అఖండ విజయం మనదేనని కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం కనిగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి నాయకుడూ వారి వారి బూత్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఆయా మండలాల్లో యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జి, గ్రామ, వార్డు, మండలపార్టీ అధ్యక్షుడితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్ని చురుకుగా నిర్వహించాలని సూచించారు. ఇంకా ఎన్నికలు 50 రోజులు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. మార్చి 5వ తేదీన జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ కనిగిరి నియోజకవర్గానికి రానున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు పార్టీకి వెన్నంటి ఉండి పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ మండలపార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, తెలుగుమహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉగ్ర

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మార్టూరు, ఫిబ్రవరి 29: తండ్రి అస్థికలను విజయవాడ దగ్గర కృష్ణా నదిలో కలిపి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా, తమ్ముడు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం మండల పరిధిలో ఇసుక దర్శి ఫ్లైవోవరుపై చోటుచేసుకుంది. ఒంగోలు వైపు వెళుతున్న టాటా ఏసీ వాహనాన్ని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న అన్న గుడిపాటి నాగబ్రహ్మం (40) అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న తమ్ముడు సాంబశివరావుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం సంఘటనా స్థలానికి వచ్చి సాంబశివరావును మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగబ్రహ్మం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముందు ఖాళీగా వెళుతున్న టాటా ఏసీ వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ద్విచక్రవాహనం వేగం అదుపుకాలేక బలంగా ఢీకొనడంతో నాగబ్రహ్మం తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు భావిస్తున్నారు.



మృతి చెందిన నాగబ్రహ్మం

బాధితులు మేదరమెట్ల వాసులు

కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన నాగబ్రహ్మం, సాంబశివ రావులు అన్నదమ్ములు. నాగబ్రహ్మంకు భార్య అరుణ కుమారి, ఇద్దరు కవల మగ పిల్లలు ఉన్నారు. సాంబశివరావు సింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పని చేస్తున్నారు. గతంలోనే తల్లి చనిపోగా, ఈనెల 25న తండ్రి ఆది నారాయణ అనారోగ్యకారణంగా మృతి చెందాడు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో తండ్రి అస్థికలను కృష్ణా నదిలో కలపడానికి అన్నదమ్ములు ద్విచక్రవాహనంపై విజయవాడకు వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని తిరిగి బైక్‌పై మేదరమెట్ల వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు నాగబ్రహ్మం మృతదేహానికి శవపంచనామా చేసిన అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొట్టిన కంటైనర్

● ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి
● కనుమళ్ల జాతీయ రహదారి వద్ద ఘటన

సింగరాయకొండ, ఫిబ్రవరి 29 : జాతీయ రహదారిపై ఓ కంటైనర్ అదుపుతప్పి అవతలి వైపు రోడ్డులోకి దూసుకెళ్లి అటుగా వస్తున్న ఐచర్ లారీని ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కనుమళ్ల జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఐచర్ లారీ డ్రైవర్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కంటైనర్ కనుమళ్ల జాతీయ రహదారి రన్‌వే వద్దకు వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నారు. దీంతో కంటైనర్ అదుపుతప్పి అవతలి వైపు రోడ్డులోకి దూసుకెళ్లి రొయ్యల వ్యర్థాల లోడ్‌తో ఎదురుగా వస్తున్న ఐచర్ లారీని బలంగా ఢీకొట్టి బోల్తాకొట్టింది. ఐచర్ లారీ డ్రైవర్ బీహార్‌కు చెందిన డ్రైవర్ బాబుల్‌కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు, పోలీసులు హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకున్నారు. బోల్తాపడిన లారీకి తాళ్లు కట్టి వేరొక లారీ సహాయంతో పక్కకు తీశారు. క్యాబిన్‌లో గాయాలతో కొట్టుమిట్టాడుతున్నా డ్రైవర్ బాబుల్‌కుమార్‌ను బయటకు తీశారు. వెంటనే ఆయన్ను, గాయపడిన చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన కంటైనర్ డ్రైవర్ శ్రీనివాసులను 108, హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఐచర్ లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. జరిగిన ఘటనపై ఎస్సై టి. శ్రీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బోల్తాపడిన లారీని పక్కకు తీస్తున్న పోలీసులు

మన్నం వెంకటరమణకు కన్నీటి వీడ్కోలు

టంగుటూరు, ఫిబ్రవరి 29 : ప్రవాసాంధ్రుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు, మండలంలోని కాకుటూరివారిపాలేనికి చెందిన మన్నం వెంకటరమణ(53) ఈ నెల 21న మృతి చెందారు. హైదరాబాద్‌లో గురువారం కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, టీడీపీ నాయకులు ఆయనకు కన్నీటివీడ్కోలు పలికారు. అక్కడ బీఎన్‌రెడ్డి నగర్‌లోని స్వగృహంలో ఉంచిన వెంకటరమణ మృతదేహాన్ని ఫిల్మ్‌నగర్‌లోగల శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆయన పెద్ద కుమారుడు దహన సంస్కారాలు నిర్వర్తించారు. వెంకటరమణకు భార్య, ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు. అమెరికా నుంచి ఇండియా వస్తున్న వెంకటరమణకు విమాన ప్రయాణంలో ఉండగానే గుండెనొప్పి వచ్చింది. ఆ సమయంలో విమానం గ్రీస్ దేశంలో ఉండగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ తీసుకొని ఆయనను ఆ దేశంలోని ఆసుపత్రికి తరలించారు. కొన్ని గంటలు మృత్యువుతో పోరాడి చివరకు కన్నుమూశారు. వెంకటరమణ మృతదేహాన్ని గురువారం ఉదయం హైదరాబాద్ తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాకుటూరివారిపాలెం నుంచి బంధువులు, రాష్ట్ర తెలుగుయువత అధికార ప్రతినిధి రామా గోపి హైదరాబాద్ చేరుకొని రమణ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. 2009లో ఆయన దర్శి నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు.



వెంకటరమణ అంతిమ యాత్ర (ఇన్‌సెట్లో) మన్నం వెంకటరమణ

పొగాకు మార్కెట్ ఆశాజనకం

కొండపి, ఫిబ్రవరి 29 : ఈ ఏడాది పొగాకు మార్కెట్ ఆశాజనకంగా ఉండొచ్చని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ చెప్పారు. గురువారం కొండపిలో పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పొగాకు పండించే చైనా, బ్రెజిల్, జింబాంబ్వే దేశాల్లో వివిధ కారణాలతో పొగాకు కొరత ఏర్పడిందని, అందువల్ల ఈ సీజన్‌లో పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉందని చెప్పారు. మొత్తం వేలం ప్రక్రియలో ఏ రోజుల్లో ఏయే రకం పొగాకును డిమాండ్‌గా వ్యాపారులు కొంటున్నారో అర్థం చేసుకుని ఆ ప్రకారమే రైతులు పొగాకును వేలానికి తెచ్చుకోవాలన్నారు. రాష్ట్రంలో 142 మి లియన్ కేజీలకు బోర్డు అనుమతించగా, అంచనాలకు మించి రైతులు పొగాకు పండించారని చెప్పారు.

అదేవిధంగా పండుగుల్లను బోర్డు ద్వారా కొనుగోలు చేసేందుకు, పొగాకు ముక్క విక్రయాలు కూడా వేలం చివరి రోజుల్లో కాకుండా మధ్యలోనే ఒకటి రెండు రోజులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఆర్‌జేడీ

మార్టూరు, ఫిబ్రవరి 29: స్థానిక జడ్పీ హైస్కూల్‌ను గురువారం ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ) కె.లింగేశ్వర రెడ్డి సందర్శించారు. ఈ హైస్కూల్లో త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు గల వసతులను ఆయన పరిశీలించారు.

టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

- వై.పాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబ
- ఆ పార్టీలో భారీగా చేరిన కార్యకర్తలు
- భవిష్యత్తుకు గ్యారెంటీ బాండ్ల పంపిణీ



టీడీపీలో చేరిన కుటుంబాలతో ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 29 : రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పడం ఖాయమని ఆ పార్టీ టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరి పనిచేసే కేడర్‌కు కూడా పూర్తి గౌరవ మర్యాదలతో తగు ప్రాధాన్యత ఇస్తామన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయించి ప్రారంభిస్తామన్నారు. మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటిస్తామన్నారు. అర్హులైన పేదలకు ఆరు గ్యారెంటీలు అమలుజేస్తామన్నారు. నియోజకవర్గంలో నాలుగేళ్లగా నీళ్లు తోలిన వైసీపీ సర్పంచులు, కాంట్రాక్టర్లే రోడ్డెక్కారన్నారు. దీంతో సొంత పార్టీ కేడరే రాస్తారోకో చేసిందన్నారు. ఇక వీరు ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజల విశ్వాసం కోల్పోయారని అన్నారు. రాష్ట్ర ప్రజలు టీడీపీ జనసేన పొత్తులో ప్రభుత్వం ఏర్పడాలని కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, యేర్వ మల్లికార్జునరెడ్డి, మేకల వలరాజు, శ్రీనివాసరెడ్డి, పయ్యావుల ప్రసాదు, టీడీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటి కన్వీనర్లు,గ్రామ కమిటి అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీగా చేరికలు

ఎర్రగొండపాలెం : ఎర్రగొండ పాలెం మండల కేంద్రం లో వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఎర్రగొండపాలెం మూడో ఎంపీటీసీ సభ్యురాలు కాయకాకుల సత్యావతి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. 2024 ఎన్నికలకు టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన ఎన్నికల మెనిఫెస్టోను ఆకర్షితురా లై టీడీపీలో చేరినట్లు సత్యవతి చెప్పారు. ఆమె భర్త కాయకాకుల సుబ్బయ్య ఆధ్వర్యంలో 20కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వైసీపీ యువ నాయకుడు ఒంగో లు ఆదిరెడ్డితో పాటు ఆయన ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. కంచర్ల వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యం లో 10 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. యువనాయకుడు ఒంగోలు ఆదిరెడ్డి మాట్లాడుతూ వైసీపీలో 10 సంవత్సరాలుగా సేవలు చేశామని, ఒక్క పని కూడ జరగలేదని, అందుకే టీడీపీలో చేరినట్లు తెలిపారు. 2024 ఎన్నికల్లో ఎర్రగొండపాలెం నియోజక వర్గం అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబును అధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఒంగోలు ఆదిరెడ్డితో పాటు కోటా వెంకటరెడ్డి, కోటా చిన్న వెంకటరెడ్డి, పఠాన్ నాసర్‌ఖాన్ టీడీపీ చేరారు.టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



తాటిచర్లలో బాండ్లు అందజేస్తున్న ముత్తుముల సంజీవరెడ్డి

శంఖారావం సభను విజయంతం చేయండి

ఎర్రగొండపాలెం : నారా లోకేష్ నేతృత్వంతో మార్చి 3న జరిగే విజయశంఖారావం సభను కార్యకర్తలు జయప్రదం చేయాలని ఎర్రగొండపాలెం టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు సూచించారు. ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 3న త్రిపురాంతకం మండలం బోడిరెడ్డి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన సభ నిర్వహించను న్నట్లు తెలిపారు. నియోజకవర్గం లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు సభ విజయవంతానికి కృషిచేయాలని కోరారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం లోని ఐదు మండలాలలోని గ్రామాల ప్రజలకు దగ్గరగా ఉండేవిధంగా జాతీయ రహదారి బోడిరెడ్డిపల్లె జంక్షన్ వద్ద సభా వేదిక సిద్ధం చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలో 265 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని 25 వేల మంది ప్రజలు సభకు రావాలని, కార్యకర్తలు ప్రజలను చైతన్య వంతం చేయాలని అన్నారు.



బాండ్లు అందజేస్తున్న నారాయణరెడ్డి కుమారులు

మార్కాపురం రూరల్ : మండలంలోని బోడపాడు గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు విష్ణేష్ రెడ్డి, నియోజకవర్గం పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి తనయుడు కందుల రోహిత్‌రెడ్డి, నాయకులు నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా విష్ణేష్‌రెడ్డి, రోహిత్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కష్టాలు తీరాలంటే టీడీపీ - జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జవ్వాజి రామానుజలరెడ్డి, బోడపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొగ్గు శేఖర్‌రెడ్డి, గూడా రమణారెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే బడుగు బలహీన వర్గాల సంక్షేమం

కొమరోలు : బడుగు బలహీనవర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని ఎంపీటీపీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని తాటిచర్ల, హసనాపురం, పామూరిపల్లి గ్రామంల్లో 'బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు సంక్షేమం చంద్రబాబుకే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అరాచక వైసీపీ ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పి మన గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గెలిపించుకుందామన్నారు. రాష్ట్రంలో అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రాక్షస పాలన చేస్తున్న జగన్‌రెడ్డి పని అయిపోయిందన్నారు. కార్యక్రమానికి మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని ఇంటిటికి తిరిగి 'బాబు ష్యూరిటీ-భవిషత్తుకు గ్యారెంటీ' కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో టీడీపీ బోనేని వెంకటేశ్వర్లు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు బిజ్జాల తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ చిన్నావుల తిరుమలరెడ్డి, అంబావరపు భాస్కర్‌రెడ్డి, పోలెబోయిన మద్దిలేటి, జనార్ధన్‌రెడ్డి, ఏలూరి చిన్నసుబ్బయ్య, వీరంరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, మారంరెడ్డి వీర నారాయణ రెడ్డి, మారంరెడ్డి ఈశ్వరరెడ్డి, మేముల రమణయ్య, బీసీ నాయకులు పందరబోయిన గోపాలకృష్ణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రైతుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



మోక్షగుండంలో టీడీపీ కరపత్రాలు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

బేస్తవారపేట, ఫిబ్రవరి 29 : రైతుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని గిద్దలూరు నియోజకవర్గ బేస్తవారపేట టీడీపీ నాయకులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తిగిరెడ్డి భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పూనూరు భూపాల్‌రెడ్డి అన్నారు. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గురువారం బేస్తవారపేట మండలంలోని మోక్షగుండం, పందిళ్లపల్లె కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి టీడీపీ-జనసేన ఉమ్మడిగా ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాలను మహిళలకు, ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు సంక్షేమం అందిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి రైతులను నట్టేట ముంచాడన్నారు. పంట పొలాల బోరు మోటర్లుకు మీటర్లు బిగించి రైతుల మెడలకు ఉరితాడు బిగించాడని విమర్శించారు. రైతులకు సంక్షేమ పథకాలు అమలుచేయాలంటే టీడీపీని గెలిపించాల్సిన బాధ్యతల అందరిపై ఉందన్నారు. బేస్తవారపేట పట్టణంలో జరిగిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాజుల విశ్వనాథం, ముప్పూరి రాము, ,సైదులు హుస్సేన్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

గిద్దలూరు, ఫిబ్రవరి 29 : పట్టణంలోని పలు నిరుపేద కుటుంబాలకు వాసవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. లీఫ్ సంవత్సరం సందర్భంగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని వనితాక్లబ్‌ల ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మాగులూరి శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో వాసవి వనితాక్లబ్ అధ్యక్షురాలు కటకం లక్ష్మీప్రియ, కార్యదర్శి తేజస్వి, జోన్ ఛైర్మన్ శేగు పద్మావతి, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కేవీ.రమణ, అమ్మవారిశాల అధ్యక్షులు గర్రె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహానికి నమస్కరిస్తున్న భక్తులు

త్రిపురాంతకం, ఫిబ్రవరి 29: మండలంలోని కేశినేనిపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు వడ్లమాని గోవర్ధనాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రభాతసేవా, గణపతిపూజ, పుణ్యాహవచనం, యంత్రాభిషేకం, యాగమండప దేవతాపూజలు, మహారుద్రహోమం, జపతర్పణం, గర్తన్యాసం, రత్నన్యాసం, బీజన్యాసం, దాతున్యాసం, యంత్రస్థాపన, విగ్రహ బింబ ప్రతిష్ఠ, కలన్యాసం, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు.

శ్రీశైలానికి 24 గంటలు అనుమతి

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 29 : దక్షిణాది పుణ్యక్షేత్రాలలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న శ్రీశైలానికి ఏ సమయంలోనైనా వెళ్లేందుకు అటవీ శాఖాధికారులు అనుమతించారు. నల్లమలలోని అటవీ ప్రాంతంలో శ్రీశైలం ఉన్నందున వన్యప్రాణుల మనుగడకు విఘాతం కలుగకుండా ఉండేందుకు అటవీ శాఖాధికారులు రాత్రి 9 గంటల సమయం తర్వాత శ్రీశైలానికి అనుమతించరు. ఉదయం 6 గంటలకు మాత్రమే అనుతులున్నాయి. అయితే శ్రీభ్రమరాంబికామల్లికార్జున స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్చి ఒకటవ తేదీ నుంచి 11వ తేదీ వరకు 24 గంటలు రాకపోకలకు అనుమతులు ఇచ్చినట్లు రేంజి అధికారి విశ్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రికులు అటవీ ప్రాంతంలో సిగరెట్టు, బీడి కాల్చి పడవేయవద్దని, ప్లాస్టిక్ వస్తువులు ఎక్కడ పడితే వేయరాదని పర్యావరణాన్ని కాపాడి సహకరించాలని కోరారు.

నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలక మండలి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 29: స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ పాలక మండలి నూతన కమిటీ గురువారం ఆలయంలో ప్రమాణ స్వీకారం చేసింది. పెనుగొండ కేశవరావు, గోపాలుని హరిహరరావు, గుంటక విజయలక్ష్మీ, సూరె సురేంద్ర, సాదం వీరయ్య, పిన్నిక లక్ష్మీ, సురభి లక్ష్మీదేవి, కందుకూరి సుబ్బమ్మ, కురాటి మహాలక్ష్మీలతో పాటు ఎక్స్ అఫిసియో సభ్యులుగా ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు ప్రమాణా స్వీకారం చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 29: మహాశివరాత్రి సందర్భంగా మార్కాపురంలోని శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న బ్రహ్మోత్సవాల పోస్టర్లను గిద్దలూరు ఎమ్మెల్యే అన్నారాంబాబు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ ఛైర్మన్ కేశవరావు, శ్రీశైలం దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యురాలు డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌సీకి వాటర్ కూలర్ అందజేత

బేస్తవారపేట, ఫిబ్రవరి 29: బేస్తవారపేట ఎంఆర్‌సీ కార్యాలయానికి 1998 డీఎస్సీ, ఎంటీఎస్ ఉపాధ్యాయులు వాటర్ కూలర్‌ను ఎంఈవోలు కాశయ్య, రమణారెడ్డిలకు బహుకరించారు .కార్యాలయానికి నిత్యం మండలంలోని ఉపాధ్యాయులు రాకపోకలు సాగిస్తుండటంతో వారికి తాగునీటి కోసం ఈ ఫ్రిజ్‌ను అందజేస్తున్నట్లు 1998 డీఎస్సీ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు ఎం.బాలిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణారెడ్డి, బంగారురెడ్డి, శ్రీనివాసులు జక్కాభాస్కర్, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 29: పల్స్‌పోలియోపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు ర్యాలీలో పాల్గొన్నారు. ఐదేళ్లలోపు ఉన్న చిన్నారు లకు విధిగా పోలియో చుక్కలు వేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విగ్నిక్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రం సొమ్ముతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటం

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 29: బీజేపీ ప్రభుత్వం కేంద్రం నుంచి ఇచ్చిన సొమ్ముతో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలు చేస్తోందని, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీ కృష్ణారావు అన్నారు. మండలంలోని పెద్దనాగులవరం, నికరంపల్లి, వేమలకోట, జమ్మనపల్లి, కోల భీమునిపాడు గ్రామాలలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర కార్యక్రమం నిర్వహించారు.రానున్న ఎన్నికలలో మరోసారి దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రధాని మోదీ గెలిపించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమం కన్వీనర్ రాజా శ్రీకాంత్, మండల అధ్యక్షుడు సైతం శివప్రసాద్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, పార్టీ నాయకులు నాగేశ్వరరావు, కాశీరావు, వై.వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : పశ్చిమ ప్రకాశం సస్యశ్యామలం కావాలంటే వెలిగొండతోనే సాధ్యమని బీజేపీ మండల అధ్యక్షులు గండి వీరారెడ్డి అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడులో ప్రజాపోరు యాత్రను గురువారం ప్రారంభించారు. నాయకులు మల్లారెడ్డి, సూర్యనారాయణ, సామేలు, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

ఆరామక్షేత్ర శిథిలాల పరిశీలన



ఆరామక్షేత్రాన్ని పరిశీలిస్తున్న గురవాచారి

పొదిలి, ఫిబ్రవరి 29 : పొదిలిలో ఇటీవల అధికారులు కూల్చివేసిన విశ్వబ్రాహ్మణ ఆరామక్షేత్రాన్ని బీసీ కమిషనర్ మెంబర్ కుందుర్తి గురవాచారి గురువారం పరిశీలించారు. జిల్లా పర్యటనలో భాగంగా పొదిలిలో విశ్వబ్రాహ్మణులకు అనువుగా ఉన్న ఆరామక్షేత్రం పడగొట్టడం దురదృష్టకరమన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులు అందరు ఏ కార్యక్రమం చేపట్టినా కలిసికట్టుగా నిర్వహించాలని సూచించారు. అలా ఉన్నప్పుడే అందరు గౌరవిస్తారని, ఏ పనిచేయాలన్నా అధికారులు, నాయకులు ఆలోచించి చేస్తారని తెలిపారు. ఆరామక్షేత్రం కూల్చివేయాల్సిన అవసరం ఏమి వచ్చిందనే విషయాన్ని ఆరాతీశారు. అనంతరం ఆయనకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు, పొదిలి సంఘ నాయకులు సామంతపూడి నాగేశ్వరరావు, యద్దనపూడి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతిచెందిన వెంకట నారాయణరెడ్డి

పెద్దారవీడు, ఫిబ్రవరి 29: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని గొబ్బూరు శివారు పొలాల్లో గురువారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గొబ్బూరుకు చెందిన వెన్నా వెంకట నారాయణ రెడ్డి(48) గురువారం ఉదయం 8 గంటల సమయంలో భార్యతో కలిసి సాగుచేసిన మిరప పంటకు నీళ్లు కట్టడానికి వెళ్లాడు. బోరును వేయడానికి ప్యానల్ బోర్డులో ఉన్న స్టాటర్‌ను నొక్కుతున్న సమయంలో కింద ఉన్న సర్వీసు వైరు నారాయణరెడ్డి కాలికి తాకింది. దీంతో షాకుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై వెంకట సైదులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

గడ్డి వాములు దగ్ధం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 29: స్థానిక చెరువు సమీపంలోని దసరా మండపం వద్ద మూడు గడ్డివాములు గురువారం దగ్ధమయ్యాయి. దొంతిరెడ్డి కోటిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డిలకు చెందిన మూడు గడ్డి వాములు దగ్ధం అయ్యాయి. కాగా రూ.4లక్షల ఆస్తి నష్టం సంబవించింది. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో తమ గడ్డివాములు తగలబెట్టారని ఆరోపించారు. మార్కాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

కొమరోలు, ఫిబ్రవరి 29: హత్యాయత్నం కేసులో దోషికి ఐదేళ్ల శిక్షవిధిస్తూ, మార్కాపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి దేవేంద్రరెడ్డి గురువారం తీర్పుచెప్పారు. స్థానిక ఎస్సై కోటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.., మండలంలోని పోట్టిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రోద్దుటూరి శివ, ఆయన తల్లి కాశమ్మలపై అదే గ్రామానికి చచెందిన జి.చిన్నబాదరయ్య హత్యాయత్నం చేశారు. కుటుంబ తగాదాలు మనసులో పెట్టుకొని, 2018 మార్చి 17న వారిని కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్సై అబ్దుల్ రెహమాన్ కేసు నమోదుచేశారు. ఈ మేరకు కేసును విచారించిన మార్కాపురం అసిస్టెంట్ సెషెన్స్ కోర్టు న్యాయాధికారి బి.దేవేంద్రరెడ్డి గురువారం 5సంవత్సరాలు జైలు శిక్ష, రూ.500 జరిమానను విధించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిని నెల్లూరు జైలుకు తరలించారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- ఇందిరా కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి



బహుమతులు అందజేస్తున్న హనుమారెడ్డి

మార్కాపురం, ఫిబ్రవరి 29: విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలను పెంపొందించుకోవాలని ఇందిరా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. స్థానిక ఇందిరా కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఎగ్జిబిషన్, పోటీలు నిర్వహించారు. విద్యార్థులు శాస్త్రీయ, సాంకేతిక పురోగతికి సంబంధించిన 60కి పైగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని, ఆవిష్కరణల కొత్తమార్గాలను అన్వేషించడాన్ని కొనసాగించాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషాఈశ్వరన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం సక్సెస్‌తో దద్దరిల్లిన తాడేపల్లి ప్యాలెస్

టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 29 : తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేనల ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా బహిరంగసభ సక్సెస్‌తో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్‌ఆర్‌సీపీ దొంగలకు వ్యతిరేకంగా టీడీపీ, జనసేనలు పోరాడుతున్నాయన్నారు. మొన్న జరిగిన తాడేపల్లిగూడెం సభను చూసి తాడేపల్లి ప్యాలెస్ వణుకు మొదలైందన్నారు. రానున్న ఎన్నికలు రాష్ట్రానికి చాలా కీలకమన్నారు. టీడీపీతో జనసేన పొత్తు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, 5 కోట్ల ఆంధ్ర రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసమన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగు నింపేందుకు రెండు పార్టీలు కూటమిగా ఏర్పడినట్లు తెలిపారు. రాష్ట్ర పునః నిర్మాణానికి ప్రజలు చేతులు కలుపాలని, జగన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడన్నారు. తూర్పు గోదావరి జిల్లా డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి ఆ మృతదేహాన్ని వారి ఇంటికి డోర్ డెలివరి చేశాడని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు టీడీపీ అన్నా క్యాంటీన్లు తెరచి పేదలకు రూ.5తో భోజనం పెడితే జగన్‌రెడ్డి వాటిని మూయించాడన్నారు. కరోనా సమయంలో మాస్క్ అడిగినందుకు దళిత వైద్యుడు సుధాకర్‌ను మానసిక వికలాంగుడిగా ముద్ర వేసి చంపారన్నారు. వైసీపీ వేధింపులు భరించలేక క్రికెట్ ప్లేయర్ హనుమవిహారి పారిపోయాడన్నారు. 'వై నాట్ 175' అంటున్న జగన్‌కు మనం ఓటు ఎందుకు వేయాలి అని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్, ఉచిత ఇసుక ఎక్కడ అని ప్రశ్నించారు. పులివెందులలో జగన్‌కు ఈసారి ఓటమి తప్పదన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం సూపర్ సిక్స్ ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

ఘనంగా ఎంబీబీఎస్ విద్యార్థుల గ్రాడ్యుయేషన్





సరదాగా సెల్ఫీ తీసుకుంటున్న స్నేహితురాలు, నా వైద్యురాలు అమ్మే, ఆమెకే కిరీటం

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 29 : ఒంగో లులోని రిమ్స్ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. స్థానిక కాలేజీ ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు అధ్యక్షతన వేడుకలకు ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ ఝాన్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యవృత్తి పవిత్రమైందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు దేవుడుగా భావించే వైద్యుడు సేవా గుణం కలిగి ఉండాలని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్ మాట్లాడుతూ డాక్టర్ కావాలనే కోరిక ప్రతి విద్యార్థిలోనూ ఉంటుందని, అయితే దానిని నిజం చేసుకోవడంలోనే కృషి, పట్టుదల అవసరమన్నారు. భగవంతుడు డాక్టర్‌గా ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నాలుగేళ్లపాటు ఎంతో కష్టపడి చదువు పూర్తి చేసిన విద్యార్థులను అభినందించారు. ప్రి న్సిపాల్ ఏడుకొండలు మాట్లాడుతూ కేవలం ఎంబీబీఎస్‌తోనే కాకుండా వివిధ విభాగాల్లో స్పెషలైజేషన్ చేయాలని సూచించారు. విద్యా బోధన చేసిన అధ్యాపక, సిబ్బందిని అభినందించారు.

మధుర జ్ఞాపకాలు..

తల్లిదండ్రుల కష్టం, విద్యార్థుల కలల నిజమైన గ్రాడ్యుయేషన్ రోజు వారిలో మరపురాని మధుర స్మృతులను మిగిల్చింది. తమ పిల్లలు గ్రాడ్యుయేషన్ పట్టా పుచ్చుకున్న రోజును పండుగలా భావించారు. ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రుల కళ్లలో ఆనందభాష్పాలు కనిపించగా, సహ విద్యార్థులతో సెల్ఫీలతో సందడి చేశారు. ఇన్నాళ్ళ తమ విద్యాభ్యాసం, పడిన కష్టాని తగిన గుర్తింపు వైద్యుడుగా పట్టా పొందడం మరచి పోలేకపోతున్నామన్నారు. భవిష్యత్తులో పేదలకు వైద్య సేవలందించి, తమ సేవా గుణాన్ని చాటుకుంటామని విద్యార్థులు వెల్లడించారు.

వైభవంగా రాములవారి విగ్రహ ప్రతిష్ఠ





వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు, గజవాహనంపై వేణుగోపాలుడు

పొదిలి, ఫిబ్రవరి 29 : పట్టణంలోని ఓబుల శెట్టివారి వీధిలో సీతారామ లక్ష్మణ, హనుమత్ సమేత శీపట్టాభిరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారికి ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, వాస్తుహోమం పూజ, పీఠారోహణం, సప్తధాతు నవరత్న నవధాన్య పూజలు నిర్వహించి యంత్ర ప్రతిష్ఠ విగ్రహప్రతిష్ఠ చేశారు. అనంతరం అంగరంగ వైభవంగా సీతారామ కల్యాణం నిర్వహించారు. భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

సర్వభూపాలుడిగా వేణుగోపాలుడు

తర్లుపాడు : తర్లుపాడులో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం గజ వాహనంపై మువ్వగోపాలుడు సర్వభూపాలుడి అలంకరణలో వేణుగోపా లుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు కారంపూడి వెంకటరమణా చార్యులు, భార్గవ రామాచార్యులు, కూనపులి రమణయ్యశర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారిని తర్లుపాడు పురవీధుల్లో మేళతాళాలతో, డప్పు వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు జై వేణుగోపాల స్వామి అంటూ భజనలు చేశారు. భక్తులు వార్లుపోసి కాయాకర్పూరాలు సమర్పించారు. పలువురు దంపతులు ఉభయదాతలుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవ రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త జవాజి విజయభాస్కర్‌రావు, వివిధ వాహనాల ఉభయ దాతలు కశ్శెట్టి జగన్‌బాబు, జవాజి సత్య నారాయణ, వాడేల కృష్ణప్రసాద్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథోత్సవం

తర్లుపాడు : తర్లుపాడులో వెలసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. రథోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

రథం మరమ్మతు పనులు ప్రారంభం

పొదిలి, : మహాశివరాత్రి పర్వదినోత్సవం సందర్భంగా పార్వతీసమేత నిర్మామహేశ్వర స్వామి వారిని పురవీధుల్లో ఊరేగించేందుకు నిర్మించిన రథం మరమ్మత్తులు గురువారం ప్రారంభించారు. ధర్మకర్త యక్కలి శేషగిరి, రథనిర్మాణ దాత సామంతపూడి నాగేశ్వరరావు, అన్నా కృష్ణచైతన్య తదితరులు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు.

ఎంపీపీగా లక్ష్మీదేవి బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీపీ

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 29: మండల ఎంపీపీగా తిప్పాయపాలెం ఎంపీటీసీ సభ్యురాలు బండి లక్ష్మీదేవి గురువారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో బాధ్యతలను స్వీకరించి పేద పండితుల ఆశీర్వచనం పొందారు. అనంతరం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవో తోట చందన నూతనంగా ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన బండి లక్ష్మీదేవితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించి పేద పండితుల ఆశీర్వచనం పొందారు. ఇన్‌చార్జ్ ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన బండి లక్ష్మీదేవివి గిద్దలూరు ఎమ్మెల్యే, వైసీపీ మార్కా పురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాం బాబు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీపీ పోరెడ్డి అరుణ, జెడ్పీటీసీ సభ్యుడు నారు బాపన్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ షంషీర్ అలీ బేగ్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్ల బోతుల కొండయ్య, అరెకటిక కార్పొరేషన్ డైరెక్టర్ వెంకమ్మ, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గోలమారి శ్రీనివాసరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు శాలువా బోకేలతో శుభాకాంక్షలు తెలియజేశారు.


మృతిచెందిన చుక్కల జింక

కంచెలో చిక్కుకొని జింక మృతి

దర్శి, ఫిబ్రవరి 29 : మండలంలోని వెంకటచలంపల్లి పొలాల్లో ఒక దానిమ్మతోటకు వేసిన కంచెలో చిక్కుకొని చుక్కల జింక మృతి చెందింది. వెంకటచలంపల్లి కొండ కింద వణ్య ప్రాణులు తిరుగుతుంటాయి. ఆ ప్రదేశంలో సాగు భూముల్లో బోర్లు వేసి దానిమ్మ తోటలు వేశారు. ఎండలకు తోటలకు ప్రవేశించే క్రమంలో కంచెలో చిక్కుకొని ఊపిరాడక జింక మృతి చెందింది.

5న పేదలకు చీరల పంపిణీ

పామూరు, ఫిబ్రవరి 29 : కేసీపీ సిమెంట్ అధినేత్రి వీఎల్ ఇందిరాదత్తు వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5న పేదలకు చీరలను పంపిణీ చేస్తున్నట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ పబ్బర్తి వెంకట సుబ్బయ్య తెలిపారు. సాయిబాబా మందిరంలో 100 నిరుపేద మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేస్తారని తెలిపారు.

మన బూత్ బాధ్యత మనదే

- నిబద్ధతతో పనిచేస్తే విజయం మనదే
- డబుల్‌గేమ్ పద్ధతి మార్చుకోవాలని హితవు
- టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 29 : మన బూత్ బాధ్యత మనదేనని.. నిబద్ధతతో పనిచేస్తే వచ్చే ఎనికల్లో అఖండ విజయం మనదేనని కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం కనిగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రతి నాయకుడూ వారి వారి బూత్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఆయా మండలాల్లో యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జి, గ్రామ, వార్డు, మండలపార్టీ అధ్యక్షుడితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్ని చురుకుగా నిర్వహించాలని సూచించారు. ఇంకా ఎన్నికలు 50 రోజులు మాత్రమే ఉన్నాయన్నారు. ఈ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. మార్చి 5వ తేదీన జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ కనిగిరి నియోజకవర్గానికి రానున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు పార్టీకి వెన్నంటి ఉండి పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గంలోని వివిధ మండల పార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మాజీ మండలపార్టీ అధ్యక్షులు గాయం తిరుపతిరెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

నీటిని పొదుపుగా వాడుకోవాలి


మోపాడు వద్ద నీటి మడ వేస్తున్న రైతు

పామూరు, ఫిబ్రవరి 29 : మోపాడు రిజర్వాయర్ ఆయకట్టులో వరి పైరు సాగు చేసిన రైతులందరూ నీటిని దుబారా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులు సూచించారు. రిజర్వాయర్ పరిధిలో తూర్పుకట్టకింద పల్లి, లక్ష్మీనరసాపురం, మోపాడు, కరేళ్లపాడు మోపాడు కొండారెడ్డిపల్లి గ్రామాల్లో సుమారు 850 హెక్టార్లలో వరిని సాగు చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 10 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది. ఆయకట్టు భూముల్లో వరితో పాటు కంభాలదిన్నె, బొట్లగూడూరు ప్రాంతాల్లో 12వందల ఎకరాల్లో తెల్లజొన్న, మరో 200 ఎకరాల్లో నూగు, 710 హెక్టార్లల్లో శనగ పంటలను సాగులో ఉన్నాయి. ఎండలు తీవ్రంగా కాస్తున్న నేపథ్యంలో కాలువల ద్వారా నీటి పారుదల సక్రమంగా లేనందున అధికారుల ఆదేశాలతో రైతులు పొదుపు చర్యలు పాటిస్తున్నారు. కాలువల దగ్గర మడలు వేస్తూ పంటలను రక్షించుకుంటున్నారు. మరో 15 రోజుల్లో జొన్న పంట కోతలు ప్రారంభించేందుకు రైతులు సిద్ధపడుతున్నారు. వెనుక చిక్కి వరి పంటలు సాగు చేసిన రైతులకు ఇంకా రెండు నెలల పాటు నీటి తడులు అవసరం ఉన్నట్లు చెప్పారు.

తక్కువ ధరకే మందుల విక్రయాలు


జనరిక్ షాప్‌ను ప్రారంభిస్తున్న దద్దాల

పామూరు, ఫిబ్రవరి 29 : ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరలకే మందుల విక్రయాలు చేస్తున్నట్లు వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ తెలిపారు. పామూరు సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ గ్రౌండ్ ఎదురుగా ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాన్ని ఎంపీపీ గంగసాని లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాతతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో 1759 మెడిసిన్‌లతోపాటు 580 సర్జికల్ మెడికల్ కిట్లు లభిస్తాయని తెలిపారు. ప్రజలు జనరిక్ మందుల దుకాణాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ డీసీవో పీ రాజశేఖర్, బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్ విండో కార్యాలయ సీఈవో ఎన్.శేషిరెడ్డి, ఎస్‌డీఎల్ సీవో శ్రీనివాసులు, కరుణాకర్, ఏఎంసీ వైస్ చైర్మన్ షేక్ చాంద్‌బాషా, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, డైరెక్టర్లు షేక్ సలీం, సీహెచ్.శ్రీను, సర్పంచ్ డీ కొండబాబు, ఉప సర్పంచ్ వైవీ సాయికిరణ్, నాయకులు కే రామిరెడ్డి, జీవీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదల ఆర్థికాభివృద్ధి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న రఫీ

పామూరు, ఫిబ్రవరి 29 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన మహిళాశక్తి సూపర్‌సిక్స్ పథకాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ఆర్ రఫీ అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆదేశాలతో పట్టణంలోని సీఎస్‌పురం, విరువూరు రోడ్‌లో బాబు ష్యూరిటీ.. భవిష్‌త్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అవినీతి అరాచక వైసీపీ పాలనకు చమరగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు కనిగిరి సీటును కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ గడ్డం రామారావు, పత్తు మస్తాన్, చెక్క చెన్నయ్య, నాయబ షకీబ్ పాల్గొన్నారు.

పేదవర్గాలు విద్యారంగంలో ముందుండాలి


మెటీరియల్ అందజేస్తున్న రామారావు

తాళ్లూరు, ఫిబ్రవరి 29 :పేదవర్గాల విద్యార్థులు విద్యారంగంలో ముందుండాలని బహుజన ఉద్యోగుల సంఘం కన్వీనర్ రామారావు అన్నారు. తాళ్లూరు కేజీబీవీ విద్యాలయంలోని 10వ తరగతి బాలికలకు కప్పల కొండయ్య జ్ఞాపకార్థం కుమార్తె ఉపాధ్యాయురాలు సరోజిని ఉచితంగా స్టడీ మెటీరియల్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరోజిని పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం 20 ఏళ్లుగా కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతులుగా నిలిచి అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చే దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జి.అక్షయబాబు, పి.శ్రీనివాసరావు, ఇట్టా వెంకటేశ్వర్లు, ఎస్‌వో జి.సుజిత పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

జడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ


చెక్కును అందజేస్తున్న జడ్పీచైర్‌పర్సన్

తాళ్లూరు, ఫిబ్రవరి 29 : రైతుల అభ్యున్నతే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. తాళ్లూరులో సున్నా వడ్డీరుణాలు, ఎస్సీ, ఎస్టీలకు భూహక్కు పత్రాలను గురువారం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న రైతులకు వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తామన్నారు. తాళ్లూరు మండలంలో 21-22 రబీ కాలంలో రుణాలు తీసుకున్న 370 మంది రైతులకు 8లక్షల 81వేల 302 రూపాయలు వడ్డీని ప్రభుత్వం అందజేసిందన్నారు. ఖరీఫ్ కాలంలో 280 మంది రైతులకు రూ.7లక్షల 35వేల 715 అందజేయడం జరిగిందన్నారు. 3 విడత వైస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ నిధుల కింద 123మందికౌలు రైతులకు 3లక్షల 39వేల 290లు, 46 మంది అటవి రైతులకు 93వేల 633లు,7460 మంది పట్టా భూముల రైతులకు కోటి 49లక్షల 20వేలు వెరసి మొత్తం 8729 మంది రైతులకు కోటి 69లక్షల 69వేల 940లు జమచేయటం జరిగిందన్నారు. భూమి కొనుగోలుపథకం కింద గతంలో పంపిణీ చేసి 138 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం 81లక్షలు చెల్లించి భూహక్కు పత్రాలనుపంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏదైనా ఇబ్బందులు ఉన్నప్పుడు ఆభూములను అమ్ముకునేందుకు వెసులు బాటు కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, వ్యవసాయాధికారి బీ ప్రసాద్‌రావు, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు తూము వెంకటసుబ్బారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ యాడిక శ్రీనివాస రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూధన్‌రెడ్డి, మోషే, రామిరెడ్డి, సర్పంచ్ మేకల చార్లెస్ సర్జన్, ఎంపీటీసీ ప్రభుదాసు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ ప్రసిడెంట్లు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ముండ్లమూరు, ఫిబ్రవరి 29 : ముండ్లమూరు మండల పోలీసు స్టేషన్ నూతన ఎస్‌ఐగా వై.నాగరాజు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొం డెపి ఎస్‌ఐగా పని చేస్తూ సాధారణ బదిలీల్లో ముండ్లమూరుకు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ముండ్లమూరు ఎస్‌ఐగా పని చేసిన యూ వెంకటకృష్ణయ్య చీమకుర్తి పోలీసు స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ పేకా ట, కోడి పందాలు, మద్యం, బెల్టు షాపుల పై ఉక్కుపాదం మోపుతామన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతి గ్రామంలో పర్యటించి పరిస్థితులను అవగాహన చేసుకొని ఎలాంటి సమస్య రాకుండా చూడటం జరుగుతుందన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

- వైసీపీని వీడిన అడవిలోపల్లికి చెందిన 15కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన డాక్టర్ ఉగ్ర


ఉగ్రతో కలిసి విజయచిహ్నం చూపిస్తున్న అడవిలోపల్లి యువకులు

పీసీపల్లి, ఫిబ్రవరి 29 : పీసీపల్లి మండలంలో తెలుగుదేశం పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి. రోజురోజుకూ వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వారిసంఖ్య పెరుగుతూనే ఉంది. గత ఎన్నికల్లో వైసీపీని నమ్మి ఓట్లు వేసిన వారంతా నియోజకవర్గంలో అభివృద్ధి జరగకపోవడంతో టీడీపీ ప్రభుత్వం వచ్చి ఉగ్ర నరసింహారెడ్డి ఎమ్మెల్యే అయితేనే అభివృద్ధి చెందుతుందని భావించి పలు గ్రామాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డిని కలిసి టీడీపీలో చేరుతున్నారు. అడవిలోపల్లి గ్రామంలోని వైసీపీకి చెందిన 15 కుటుంబాలు కనిగిరి వెళ్లి అమరావతి గ్రౌండ్స్‌లో ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఉగ్ర పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. రోజూ టీడీపీలో చేరికలు పెరుగుతుండడంతో వైసీపీ బలహీనపడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. టీడీపీలో చేరినవారిలో కె. మాధవరెడ్డి, రామిరెడ్డి, ఎస్.మహాలక్ష్మమ్మ, ఎ న్.శ్రీనివాసులరెడ్డి, ఎమ్.చెన్నారెడ్డి, డి.మాల్యాద్రిరెడ్డి, కె.మాలకొండారెడ్డి, కే.ఒక్కిరెడ్డి, నా గిరె డ్డి, శివ చైతన్యరెడ్డి, మనోహర్‌రెడ్డి, మహేంద్రరె డ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డిలు ఉ న్నారు. చేరికల కార్యక్రమంలో వీరితోపాటు టీ డీపీ నాయకులు మాలకొండారెడ్డి, రత్తయ్యయాదవ్, హనుమారెడ్డి, ఓబుల్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, సత్తిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


అట్టలను అందజేస్తున్న సునీత

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ముండ్లమూరు, ఫిబ్రవరి 29 : బహుజన ఉద్యోగుల సం ఘం నియోజక వ ర్గం ఆధ్వర్యంలో ముం డ్లమూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ముందు ఎంఈవో-2 కే వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పెద ఉల్లగల్లు యూపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఆదాం ఆర్థిక సా యంతో 40 మంది విద్యార్థులకు ప్యాడ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రామారా వు, బహుజన ఉద్యోగుల సంఘం కన్వీనర్ రామారావు, మండల కన్వీనర్ కోనేటి శ్రీను, దర్శి మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణ జరపాలి

దర్శి, ఫిబ్రవరి 29 : మండలంలోని తూర్పువెంకటాపురం పంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని గ్రామస్థులు ఎం. రామాంజనేయులు, మానికొండ రామకృష్ణ, బాదం వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. పంచాయతీలో పనులు చేయకుండా లక్షలాది రూపాయలు మార్చుకున్నారని ఆరోపించారు. గతంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద వేసిన సీసీ రోడ్డును మళ్లీ ఆర్థిక సంఘం నిధులలో రోడ్డు వేసినట్లు బిల్లులు చేసుకున్నారని లిఖిత పూర్వర ప్రకటనలో పేర్కొన్నారు. పంచాయతీలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని జిల్లా స్పందనలో గతనెల నవంబరు 6వ తేదీ న ఫిర్యాదు చేశామన్నారు. గత జనవరి 14వ తేదీన విచారణకు వస్తామని డీపీవో కార్యాలయం నుంచి సమాచారం అందిందన్నారు. ఇచ్చిన గడువు దాటి 45 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు విచారణకు రాలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్


కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

తాళ్లూరు, ఫిబ్రవరి 29 : మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఎస్కే మహమ్మద్ హుస్సేన్, సెక్టార్ ఆఫీసర్ ప్రసాదరావు గురువారం పరిశీలించారు. తాళ్లూరులోని 248, 249, 250 పోలింగ్ కేంద్రాలను, కొత్తపాలెం ఎంపీపీ స్కూల్‌లోని 253, 254 పో లింగ్ కేం ద్రాలను, మాధవరం ఎంపీయూపీ స్కూల్ పరిధిలోని 262 పో లింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలందు వసతులు సరిగ్గావున్నదీ లేనిది పరిశీలించారు. దివ్యాంగులకు తగిన సదుపాయాలు, గదుల నిర్మాణ వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వీవీఎస్ఆర్ మూర్తి, బీఎల్‌వోలు, పోలీసులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరితో అనుబంధం వీడలేనిది..!

- ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే భావోద్వేగం
- దద్దాల వస్తున్నారని త్వరగా ముగించి వెళ్లిన బుర్రా

కనిగిరి, ఫిబ్రవరి 29: కనిగిరితో తన అనుబంధం వీడలేనిదని కనిగిరి ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ అన్నారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం రాత్రి జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే నాయకులు, ప్రజలనుద్దేశించి భావోద్వేగంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరినీ ఉదహరించి తన తప్పులుంటే మన్నించమంటూ వేడుకున్నారు. తనకు కనిగిరి ప్రాంతం అంతగా తనతో బందం ముడి వేసిందన్నారు. ఇక్కడి ప్రజలు చాలా మంచి వాళ్లన్నారు. ఆదరిస్తే ప్రాణం ఇచ్చేంతగా అభిమానిస్తారన్నారు. దశాబ్దకాలంపాటు తనను ఆదరించినందుకు ప్రతి ఒక్కరికీ నమస్కారాలు తెలియచేశారు. పార్టీ అదిష్ఠానం నిర్ణయం మేరకు కందుకూరులో పోటీ చేసేందుకు వెళ్తున్నానే కానీ కనిగిరికి మాత్రం దూరం కానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, పులి శాంతి, సీఎస్‌పురం జడ్పీటీసీ మూడమంచు వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, కౌన్సిలర్ తమ్మినేని సుజాత, కాసుల గురవయ్యయాదవ్, రామనబోయిన శ్రీనివాసులుయాదవ్, పెన్నా వెంకటేశ్వర్లుయాదవ్, ఏఎంసీ డైరెక్టర్ బొట్టు శ్రీనివాసులు పాల్గొన్నారు.

దద్దాల వస్తున్నారని..

కనిగిరి వైసీపీ ఇన్‌చార్జి దద్దాల వస్తున్నట్లు తెలియడంతో ఎమ్మెల్యే బుర్రా ప్రసంగాన్ని త్వరగా ముగించుకొని తన చాంబర్‌లోకి వెళ్లిపోయారు. తనను కలిసేందుకు వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ వస్తున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడి నుంచి కారెక్కి వెళ్లిపోయారు.

పశు నష్ట పరిహారం చెల్లించాలి

పామూరు, ఫిబ్రవరి 29 : వైఎస్సార్ పశు నష్ట పరిహార పెండింగ్ సొమ్ములను సంబంధిత రైతు బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి జీవాలకు మేత, నీళ్ల సౌకర్యం కల్పించి వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని ఏపీ గొర్రెల మేకల పెంపకం దారుల జిల్లా కమిటీ కార్యదర్శి తోట తిరుపతిరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మొత్రావులపాడు, పామూరు గ్రామాల్లో పర్యటించి గొర్రెలకాపరుల సమస్యలను పరిశీలించారు. 2021-22 సంవత్సరంలో వివిధ రకాల రోగాలు, ప్రమాదాల, కుక్కలబారిన పడి వందలాది జీవాలు పాడిగేదెలు చనిపోయి లక్షలాది రూపాయలను రైతులు నష్టపోయారన్నారు. నష్టపరిహారం కోసం పశు వైద్యాధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపినా నేటికీ పరిహారం చెల్లించలేదని తిరుపతిరావు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మెడబలిమి బ్రహ్మయ్య, యోగయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

పామూరు, ఫిబ్రవరి 29 : ఇంటర్ పరీక్షలకు పామూరు పరీక్షా కేంద్రాలు సిద్ధం చేసినట్లు డిపార్ట్‌మెంట్ అధికారులు పీవీ నారాయణ, రవీంద్ర తెలిపారు. పామూరులో 729 మంది విద్యార్థులు శుక్రవారం నుంచి ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. పామూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 399, ఆదిత్య కాలేజీలో 330 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

అరాచక సర్కార్‌కు బుద్ధి చెప్పండి

ఏపీటీఎఫ్ ధర్నాకు సంఘీభావం తెలిపిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 29 : వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచక సర్కార్‌కు బుద్ధి చెప్పాలని కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ చేపట్టిన ధర్నాకు డాక్టర్ ఉగ్ర గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సక్రమం గా నెల జీతం పడే పరిస్థితి లేదన్నారు. ఎన్నికలకు ముందు జగన్ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని హామీ నెరవేర్చలేదని విమర్శించారు. సమాజంలో పూజ్యులైన ఉపాధ్యాయులను వైసీపీ పాలకులు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సైకో జగన్‌ను ఉపాధ్యాయులు, ఉద్యోగులు గద్దె దింపాలన్నారు. టీడీపీ అధికా రంలోకి వస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల ఉపాధ్యాయులు ఎన్ని ఉద్యమాలు చేసినా జగన్‌రెడ్డి పట్టించుకోలేదన్నారు. దీంతో ఉపాధ్యాయులు తీ వ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్, నాయకులు శ్రీనివాసులు, బీవీఎస్ ప్రసాద్, ప్రసాద్, హజరత్‌రెడ్డి, దండే శ్రీనివాసులు, రమేష్ బాబు, జేఎస్ ఆనంద్‌బాబు, కే రామ్మోహన్, సుబ్బయ్య, జీ రామకృష్ణ, హరిబాబు, వహీద్, చిన్న నారాయణ, ఖజామస్తాన్ పాల్గొన్నారు.



దర్శి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సమస్యలను పరిష్కరించాలని ధర్నా

దర్శి : ఎంతోకాలంగా అపరిశుత్రంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని అప్రంటీస్ విధానం రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ అలవెన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏఎల్‌వీ ప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకులు ఎన్‌కోటేశ్వరరావు, జి రంగ స్వామి, వి రాఘవరావు, ఎస్‌కె మస్తాన్‌వలి, షేక్ కరిముల్లా, మహితేజ, శ్రీనివాసులు, బి రామకృష్ణ, వేమా రమణయ్య, వెంకటేశ్వర్లు, డివి రమణారెడ్డి, చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.


సభావేదిక ప్రాంగణాన్ని చదును చేసి పనులు చేస్తున్న దృశ్యం


హెలిపాడ్ దిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, పార్టీ శ్రేణులు

భారీగా.. రా.. కదలిరా

- రేపు దాచేపల్లిలో సభ
- జన సమీకరణకు విస్తృత ఏర్పాట్లు
- విజయవంతం చేయాలని నేతల ప్రచారం
- శ్రీకృష్ణదేవరాయలు, మక్కెన సహా పలువురి చేరికలు

(పిడుగురాళ్ల, గుంటూరు సిటీ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రాజకీయ సమీకరణలు చకచకా మారుతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శనివారం రా.. కదలిరా సభ నిర్వహణకు టీడీపీ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలి రావాలని టీడీపీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. రా కదలిరా సభకు గురజాల సమీపంలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కన తిరుమల కోల్డ్ స్టోరేజి పక్కన ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సభలో టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు రాష్ట్ర నేతలు పాల్గొననున్నారు. చంద్రబాబు పాల్గొంటున్న సభను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరించిన నేతలు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, అసెంబ్లీ అభ్యర్థులు బాధ్యతలు స్వీకరించారు. ప్రతి నియోజకవర్గం నుంచి వేలాదిగా జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభకు తరలివచ్చే వారి కోసం ఎక్కడికక్కడ ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. సమయం తక్కువగా ఉండటంతో గ్రామాలు, పట్టణాల్లో సభకు సంబంధించి విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కేడర్‌లో సమరోత్సాహం

పార్టీ అభ్యర్థుల ప్రకటన అనంతరం గురజాలలో జరిగే రా కదలిరా సభ నిర్వహణతో పార్టీ క్యాడర్‌లో సమరోత్సాహం నెలకొంది. ఇప్పటికే పల్నాడు జిల్లా వినుకొండ, మాచర్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట నియోజకవర్గాలకు అభ్యర్థులను అధినేత చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా గురజాలకు యరపతినేని శ్రీనివాసరావు పేరు ఖరారైందన్న ప్రచారం జరుగుతుండటం.. ఈ నియోజకవర్గ పరిధిలో సభ ఏర్పాటుతో ఆయన నేతృత్వంలో భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినుకొండ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్ల అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పెదకూరపాడు ఇన్‌చార్జి కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ విజయవంతానికి క్యాడర్‌ను సమాయత్తపరుస్తున్నారు. దాచేపల్లి సభలో వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సహా పలువురు నాయకులు, స్థానిక సంస్థల ప్రతినిధులు చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకోనున్నారు. ఈ అంశాన్ని లావుతో పాటు మక్కెన గురువారం ధ్రువీకరించారు. టీడీపీలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా చేరతారన్న ప్రచారం ఉంది. అయితే ఆయన చేరిక సందిగ్ధంలో ఉందని టీడీపీ నేతలు తెలిపారు. తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని జంగా చెబుతున్నారు. ఆయన ఇంకా వైసీ పీకి రాజీనామా కూ డా చేయలేదు. అయి తే జంగా అభ్యర్థి త్వంపై టీడీపీ అధిష్ఠానం నరసరావుపేట, గురజాల నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే.

గురజాల సెంటిమెంట్ నేపథ్యంలో..

ఎన్నికలకు ముందు, అభ్యర్థుల ప్రకటన తర్వాత నిర్వహిస్తున్న రా.. కదలి రా సభతో పల్నాడులో యరపతినేని శ్రీనివాసరావు జనజాతరకు తెరలేపారు. హఠాత్తుగా ఖరాయిన ఈ కార్యక్రమంలో భారీ చేరికలు ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ సభ మొత్తం పల్నాడు జిల్లా ఎన్నికల వాతావరణాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. చంద్రబాబుకి పల్నాడులో గురజాల సెంటిమెంట్ బలంగా ఉంది. అందుకు తగ్గట్లుగా రా కదలిరా సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇక్కడ నుంచి కార్యక్రమం ఆరంభిస్తే విజయం తథ్యమన్న ఆలోచన ఉంది. 2014లో కూడా గురజాల నియోజకవర్గం పొందుగల నుంచే చంద్రబాబు ఎన్నికల శంఖారావం పూరించి గద్దెనెక్కారు. ఆ ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ విజయకేతనం ఎగుర వేసింది. ఇప్పుడు కూడా పూర్వపు వైభవం దిశగా అడుగులు వేసేందుకు గురజాలలో సభ ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల తర్వాత మారిన రాజకీయ పరిణామాలతో పల్నాడులో టీడీపీ క్యాడర్ తీవ్రఒత్తిడికి గురౌతుంది. ఈ పరిస్థితుల్లో రా కదలిరా సభ క్యాడర్‌కు వెన్నుదన్నుకానుంది. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో దాడులు, హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న వైసీపీ నేతలకు చంద్రబాబు ఈ సభ సాక్షిగా నేరుగా వార్నింగ్ ఇవ్వనున్నారు. క్యాడర్‌ను ఎన్నికలకు సర్వసన్నద్ధం చేసేందుకు ఈ పర్యటన ఉపకరిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. లక్ష మందితో సభను నిర్వహించి తద్వారా ప్రత్యర్థుల శిబిరాన్ని మానసికంగా దెబ్బతీసేందుకు యరపతినేని పావులు కదుపుతున్నారు. గ్రామాలను ప్రభావితం చేయడంతో పాటు, ఎన్నికల గెలుపు ఓటమిని ప్రభావితం చేయగలిగిన నేతలు చంద్రబాబు సమక్షంలో తిరిగి పార్టీలోకి రానున్నట్లు తెలుస్తోంది.

చారిత్రాత్మకంగా సభ : యరపతినేని

గురజాలలో రా.. కదలిరా మరో చారిత్రాత్మక సభగా మిగిలిపోనున్నదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. దాచేపల్లి సమీపంలో జరుగుతున్న బహిరంగ సభ ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 సెప్టెంబరులో ఆత్మగౌరవయాత్ర స్ఫూర్తితో రా.. కదలిరా సభ విజయవంతం చేస్తామన్నారు. ఇప్పటిదాకా రాష్ట్రంలో జరిగిన రా.. కదలిరా సభలకన్నా గురజాల సభ భారీగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవ్వాలని కోరారు. లక్ష మందితో సభను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు కదలి రావాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు మరికొంతమంది ముఖ్యనేతలు కూడా ఈ సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.


సభావేదిక ప్రాంగణం వద్ద ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు

రేపు టీడీపీలో చేరుతున్నా: ఎంపీ లావు

దాచేపల్లిలో జరిగే రా.. కదలిరా సభలో చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరుతున్నట్లు వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి అభిమానులు తరలిరావాలని పిలుపిచ్చారు. ప్రజా సంక్షేమం, పల్నాడు అభివృద్ధికి కట్టుబడి మరలా నరసరావుపేట లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా తాను పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ, అభివృద్ధి సాధించేందుకే తన ప్రతి అడుగు, ఆలోచన ఉంటుందన్నారు. ఎంపీగా ఈ ఐదేళ్లలో సాధించుకున్న ప్రగతి పనులను పూర్తి చేసుకోవడంతో పాటుగా రానున్న కాలంలో మరిన్ని కార్యక్రమాలు సాధించుకునేందుకు ప్రజలు మళ్లీ తనను ఆశీర్వదించాలని కోరారు.



పది విద్యార్థుల కోసం ఫోన్లు

- పరీక్షలు ప్రారంభం కాకున్నా రంగంలోకి
- తల్లిదండ్రులకు జూనియర్ కళాశాలల నుంచి కాల్స్
- మీ అబ్బాయి/అమ్మాయిని చేర్పించమని డబ్బా కొట్టుడు
- ఇప్పుడు సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజు రాయితీ అని బేరసారాలు
- అసలు తమ నెంబర్లు వారి చేతికి ఎలా వెళ్లాయని తల్లిదండ్రుల ఆవేదన



గుంటూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఇంకా పరీక్షలే ప్రారంభం కాలేదు. అయినప్పటికీ కొన్ని జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఇప్పటి నుంచే విద్యార్థులకు గాలం వేసి పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. గత కొన్ని రోజుల నుంచి అదే పనిగా రిసెప్షనిస్టుల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తూ మా కాలేజ్‌లో చేర్పించమని ఏవేవో చెబుతూ వల విసురు తున్నాయి. మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయి. అంటే ఏప్రిల్ మొదటి వారం వరకు పదో తరగతి విద్యార్థులు పరీక్షల హడావుడిలో ఉంటారు. ఆయా పరీక్షలకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆ హడావుడిలో ఉంటారు. అయితే ఇంకా పరీక్షలు ప్రారంభం కాకున్నా ఫిబ్రవరి చివరి వారం నుంచి జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లపై దృష్టి సారించాయి. ఆలస్యమైతే ఎక్కడ విద్యార్థులు చేజారి పోతారేమోనని ఆత్రుత పడుతున్నాయి. దీంతో వివిధ పాఠశాలల నుంచి పదో తరగతి విద్యార్థుల వివరాలు సేకరించాయి. ఆ ప్రకారం వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పిల్లల్ని తమ కళాశాలలోనే చేర్పించాలని అభ్యర్థిస్తున్నారు. తమ కళాశాల మిగిలిన కళాశాలల కంటే గొప్ప అని ఐఐటీ, నీట్ సీట్లు సాధించామంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పుడే సీటు కన్‌ఫర్మ్ చేసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని, పరీక్షలు/ఫలితాల తర్వాత అయితే మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుందని బేరసారాలు చేస్తున్నారు. కొన్ని కళాశాలలు అయితే ఎంట్రన్స్ టెస్టు రాసేందుకు తీసుకురావాలని కోరుతున్నాయి. చాలా పాఠశాలలకు అనుబంధ కళాశాలలు కూడా ఉండటంతో వాటి యాజమాన్యాలు ఎలాగైనా తమ విద్యార్థులను బయటకు పోకుండా చేసేందుకు వివిధ రీతుల్లో ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇతర కళాశాలలకు పోతారేమోనని తమ వద్ద చదువుతున్న పదో తరగతి విద్యార్థులకి ఆదివారం కూడా సెలవు ఇవ్వకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహిస్తూ జాగ్రత్త పడుతున్నాయి.

అడ్వాన్స్ అడ్మిషన్లు..

కొన్ని కళాశాలలు అడ్వాన్స్ అడ్మిషన్లు కూడా చేపట్టాయి. ఇప్పటికే కొంతమంది విద్యార్థులను చేర్చుకుని వారి తల్లిదండ్రుల వద్ద అడ్వాన్స్ ఫీజులు కూడా జమచేసుకున్నాయి. 10వ తరగతి పరీక్షలు అయిపోయిన కొద్ది రోజులకే ఆన్‌లైన్ క్లాస్‌లు కూడా ప్రారంభిస్తామని సమాచారం ఇస్తున్నాయి. కాగా తమ ఫోన్ నెంబరు డేటా లీక్ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా విద్యా శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారి కమీషన్ల కోసం తమ పర్సనల్ నెంబర్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దీనిపై తగిన విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


విద్యా శాఖ నుంచి వివరాలు లీకు

పదో తరగతి విద్యార్థులకు సంబంధించిన డేటా విద్యా శాఖ వద్దనే ఉంటుంది. పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఆధార్, తల్లిదండ్రుల ఫోన్ నెంబర్లను కూడా అందులో నింపించారు. ఇప్పుడు ఆ డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు చేరిందంటే కచ్చితంగా లీకు వీరులు విద్యాశాఖలోనే ఉన్నారని స్పష్టమౌతున్నది. ఇందుకోసం ఆయా కళాశాలల నుంచి అమ్యామ్యాలు ముట్టినట్లు సమాచారం. విద్యార్థుల డేటా ప్రైవేటు జూనియర్ కళాశాలల చేతికి చిక్కడంతో వారి తల్లిదండ్రులకు నిత్యం మూడు నుంచి ఐదు కళాశాలల రిసెప్షనిస్టులు ఫోన్లు చేస్తున్నారు. పరీక్ష రాయబోతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విధమైన ఫోన్‌కాల్స్‌తో తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. ఒకసారి వచ్చిన ఫోన్ నెంబర్‌ని బ్లాక్ చేసినా వేరే నెంబర్ల నుంచి ఫోన్లు చేసి పీడిస్తున్నారు.

తిరునాళ్లకు..సాగర్

- నేడు సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు నీటి విడుదల

నరసరావుపేట, ఫిబ్రవరి 29: కోటప్పకొండ తిరునాళ్లలో నీటి వెతలు తీరనున్నాయి. తిరునాళ్ల కోసం సాగర్ నీటిని సరఫరా చేయనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాగర్ నుంచి కుడికాలువకు నీటిని విడుదల చేస్తారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కేఆర్ఎంబీ చేస్తోంది. మూడు టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతి ఇచ్చిందని జలవనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మి గురువారం తెలిపారు. ఈ నీటిని తాగునీటి చెరువులు నింపేందుకు, కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తుల అవసరాలకు వినియోగించడం జరుగుతుందన్నారు. కుడికాలువ నుంచి గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు నీటి సరఫరా చేస్తామన్నారు. జీబీసీ నుంచి చిలకలూరిపేట మేజర్‌కు నీటిని సరఫరా చేయనున్నట్టు చెప్పారు. నరసరావుపేట, చిలకలూరిపేట మునిసిపాల్టీ చెరువులను నింపుకొనేందుకు నీటిని వినియోగించు కోవాలన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులు పుణ్యస్నానాలకు చిలకలూరిపేట మేజర్‌లో నీరు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కోటప్పకొండ దిగువన ఉన్న చెరువులను నింపుకొనేలా ఆర్‌డబ్ల్యూఎస్ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.


సాగర్ కుడికాలువ

జీవో 117ని రద్దు చేయాలి

- బాపట్ల, రేపల్లెలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

బాపట్ల టౌన్, రేపల్లె, ఫిబ్రవరి 29: విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా ఉన్న జీవో 117ను తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్స్ ఆధ్వర్యంలో బాపట్ల ఎన్జీవో కార్యాలయం, రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు జరిగాయి. బాపట్లలో జరిగిన నిరసనలో ఏపీటీఎఫ్ నాయకులు వెంకటరత్నం, శివనాగరాజు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీ రవి, సీహెచ్ శ్రీనివాస్, చెన్నకేశవులు, ఎంవీ సత్యనారాయణ, డి.కృష్ణ, ఎండీ రఫీ, పి.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

- రేపల్లెలో జరిగిన కార్యక్రమంలో ఏపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందన్నారు. పీఆర్సీ మధ్యంతర భృతిని వెంటనే ప్రక టించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏరియా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఎంసీహెచ్ రాజారత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.



రేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

టీడీపీ.. జోష్

- విజయం దిశగా.. పయనం మొదలెట్టిన తెలుగుదేశం
- అభ్యర్థుల జాబితా విడుదలతో మరింతగా ప్రజలతో మమేకం
- పొంతనలేని ప్రకటనలతో గందరగోళంలో వైసీపీ
- అసహనంతో ఫేక్ ప్రాపగాండకు దిగుతున్న పాలకపార్టీ
- తెలుగుదేశంలోకి ఊపందుకున్న వలసలు

బాపట్ల, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆయా నియోజకవర్గాల్లో బరిలోకి దిగే అభ్యర్థులను టీడీపీ ప్రకటించడంతో నేతలతో పాటు శ్రేణుల్లో జోరు పెరిగింది. ఇప్పటికే ప్రజా సమస్యల మీద పోరాడుతూ నిత్యం ప్రజాబాహుళ్యంలో ఉంటున్న ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇప్పుడు మరింతగా ప్రజలతో మమేకం అవుతూ విజయం దిశగా పయనం మొదలెట్టారు. మరో వైపు టీడీపీలోకి వలసల పర్వం గతంతో పోలిస్తే ఊపందుకుంది. ఇదిలా ఉంటే అధికారపార్టీలో గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇంకాస్త మెండుగా గందరగోళం రాజ్యమేలుతోంది. ఇప్పటికే ప్రకటించిన ఇన్‌చార్జిల విషయంలో పార్టీ పెద్దలు పొంతనలేని ప్రకటనలు చేస్తుండడం ఒక ఎత్తయితే, కొత్త ఇన్‌చార్జిలకు ఆయా నియోజకవర్గాల్లో వైసీపీ శ్రేణుల సహాయ నిరాకరణ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. రోజురోజుకు ప్రజల్లో దిగజారుతున్న పార్టీ ప్రతిష్ఠను చూసి వైసీపీ నేతల్లో అసహనం పెరిగి ఫేక్ ప్రాపగండ ద్వారా లబ్ధి పొందాలనే నీచస్థితికి దిగజారారనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

అయిదు సీట్లకు అభ్యర్థుల ప్రకటన..

తాజాగా టీడీపీ, జనసేన ఉమ్మడిగా ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాలకు గాను చీరాల మినహాయిస్తే అయిదింటికీ బరిలో ఉండబోయే వారిపేర్లను తెలుగుదేశం ప్రకటించిన సంగతి తెలిసిందే. రేపల్లె, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో 2019ల్లో గెలుపొందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మరోమారు అవకాశమిచ్చిన టీడీపీ, వేమూరులో మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు పోటీలో ఉంటారని తెలిపింది. బాపట్లలో వేగేశన నరేంద్రవర్మ తొలిసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

సమరోత్సాహంలో తెలుగుదేశం పార్టీ..

నిన్నమొన్నటి వరకు పాలకపార్టీ వైఫల్యాలను సమర్థంగా ఎండగట్టిన టీడీపీ అభ్యర్థులు ప్రకటన చేశాక గేరుమార్చి మరింతగా దూకుడు పెంచారు. ప్రజలతో మమేకమవుతూ వారి కష్టసుఖాలను సావధానంగా వింటూ తమ ప్రభుత్వ మొచ్చాక చేయగలిగే మంచిని విస్తృతంగా జనంలోకి తీసుకెళుతున్నారు. మరోవైపు గతంలోనే టీడీపీలోకి చేరికలు ముమ్మరంగా సాగాయి. కానీ గడచిన రెండుమూడురోజుల నుంచి వలసల పర్వం మరింతగా ఊపందుకోవడం టీడీపీ జోరుకు నిదర్శనంగా కనబడుతోంది. వేమూరు మండలం వరాహాపురం గ్రామానికి చెందిన వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులతో పాటు మరి కొంతమంది సోమవారం మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు సమక్షంలో పార్టీలో చేరగా, బాపట్లకు చెందిన వైసీపీ అసమ్మతి నేత కళ్లం హరినాథరెడ్డికి అధినేత చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం టీడీపీ పట్ల ప్రజల్లో ఉన్న సానుకూలతకు అద్దం పడుతోంది. అద్దంకిలో ఈ వలసల పర్వం అయితే దాదాపుగా పాలకపార్టీ ఖాళీ అవుతుందా అనే దిశగానే సాగుతోంది. పర్చూరు, రేపల్లె నియోజకవర్గాల్లో సైతం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికల పర్వం గత కొన్ని రోజులుగా సాగుతూనే ఉంది.

గందరగోళంలో వైసీపీ..

రేపల్లె, అద్దంకి, వేమూరు నియోజకవర్గాలకు గతంలోనే సమన్వయకర్తలను ప్రకటించిన వైసీపీ అధిష్ఠానం తాజాగా పర్చూరులో సైతం మార్పు చేపట్టింది. పార్టీ పగ్గాలు తీసుకుని నెలలు గడుస్తున్నా ఆయా నియోజకవర్గాల్లో సమన్వయకర్తలకు శ్రేణుల నుంచి సహకారం దక్కకపోగా మాజీలలో అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. అద్దంకి వైసీపీ ఇన్‌చార్జి హనిమిరెడ్డికి వ్యతిరేకంగా గళం విప్పిన కృష్ణ చైతన్య తాజాగా టీడీపీ అధినేత చంద్రాబాబుతో భేటీ అయిన సంగతి తెలిసిందే. రేపోమాపో ఆయన పార్టీలో చేరడం ఖాయమని తెలుస్తోంది. దీంతో నూతన ఇన్‌చార్జి ప్రయోగం బెడిసికొట్టడమే కాకుండా వైసీపీ దశదిశ లేకుండా తయారయిందనే అభిప్రాయాన్ని సొంత పార్టీ శ్రేణులే వ్యక్తం చేస్తున్నాయి. రేపల్లె, వేమూరు లో అయితే వైసీపీ గందరగోళ స్థితి పార్టీ కేడర్‌ను నైరాశ్యంలో ముంచేసింది. ఇక పర్చూరులో మార్పు చేపట్టినా అప్పటికే జరగాల్సిన నష్టం భారీగా జరగడంతో శ్రేణుల్లో పెద్దగా కదలిక లేని స్థితి కనిపిస్తోంది.

అసహనంతో ఫేక్ ప్రచారం.. అనైతిక చర్యలు...

అనేక బాలారిష్టాలను ఆయా నియోజకవర్గాల్లో వైసీపీని వెంటాడుతుండడంతో అసహనంతో రగలిపోతున్న నేతలు, శ్రేణులు టీడీపీ నేతలే లక్ష్యంగా ఫేక్ ప్రచారాన్ని ప్రయోగిస్తున్నారు. రేపల్లె ఎమ్మెల్యే అనగాని లక్ష్యంగా ఇటీవల వైసీపీ ఈ ఫేక్ ప్రాపగండకు తెగబడింది. ఏకంగా ఆయనకే బోగస్ కాల్ రావడంతో అది విని నవ్వుకున్నానని సోషల్ మీడియా వేదికగా వైసీపీ కుట్రలను తిప్పికొట్టారు. ఇదొక ఉదాహరణ మాత్రమే దాదాపు ప్రతి నియోజకవర్గాల్లో ఇదే రకమైన కుట్రలకు వైసీపీ తెగబడుతోంది. మండల స్థాయిల్లో కీలకంగా వ్యవహరించే టీడీపీ నేతల పట్ల కూడా ఫేక్ పబ్లిసిటీతో వారిని ఆత్మరక్షణలోకి నెట్టేవిధంగా దుష్ట పన్నాగాలను పాలకపార్టీ రచిస్తోంది. మరోవైపు ఆయా అంశాలపై సమర్థంగా మాట్లాడుతూ ప్రభావితం చేయగల తటస్థులపై ప్రలోభాల ఎరవేస్తూ వారిని తన గళాలుగా మార్చుకునే కుటిల యత్నాలను కూడా వైసీపీ ప్రారంభించినట్లు తెలుస్తోంది.



పాఠశాల వంట గదికి తాళం

బిల్లు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ ఆగ్రహం



వంటగదికి తాళాలు వేస్తున్న గోన యేసు

బేస్తవారపేట, ఫిబ్రవరి 29 : పాఠశాల వంటగదికి స్కూల్ కమిటీ చైర్మన్ తాళం వేసిన ఘటన మండలంలోని బసినేపల్లెలో చోటు చేసుకొంది. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 2018లో చైర్మన్‌గా ఉంటూ గోన యేసు పాఠశాలలో రూ.1.50 లక్షలతో వంటగదిని నిర్మించాడు. అయితే నాటి నుంచి నేటి వరకు బిల్లులు ఇవ్వలేదు. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని వాపోయారు. అప్పుతెచ్చి వంట గది నిర్మించినప్పటికీ, నేటికీ బిల్లు ఇవ్వలేదని యేసు తెలిపారు. ప్రస్తుతం అప్పుకు వడ్డీ పెరిగిందన్నారు. బిల్లు ఇవ్వకపోవడంతో గురువారం గోన యేసు వంట గదికి తాళాలు వేశారు. దీంతో పాఠశాలలో వంట చేయడానికి ఇబ్బంది పడ్డారు. తనకు బిల్లులు చెల్లిస్తేనే గదికి తాళాలు తీస్తానని ఎంఈవోకు, పాఠశాల హెచ్‌ఎంకు విన్నవించాడు. ప్రస్తుతం కూడా ఆయనే చైర్మన్‌గా ఉన్నాడు. అయినప్పటికీ, బిల్లులు రాక తాళం వేయడం గమనార్హం.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

పెండింగ్ బకాయిల కోసం ఏపీటీఎఫ్ ధర్నా

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏ ఇతర బకాయిలన్నింటిని చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.రవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిరంకుశ వైఖరి అవలంభిస్తోందని విమర్శించారు. 12వ పీఆర్సీలో 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, 11వ పీఆర్సీ బకాయిలు విడతల వారీగా కాకుండా ఏకమొత్తంగా చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్ల క్లెయిమ్స్‌లను వెంటనే చెల్లించాలని, పెన్షనర్లకు పర్సనల్ క్వాంటం పెన్షన్లను పెంచాలని, టీచర్ల నియామకంలో అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ పేస్కేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ప్రతినిధులు బి.శేషారావు, పి.హనుమంతరావు, పి.శేషిరెడ్డి, ఐ.విజయసారథి, పి.సుబ్బారావు, ఎంవి.కృష్ణయ్య, డి.మధు, పి.వీరరాఘవులు పాల్గొన్నారు. అనంతరం ఒంగోలు మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కనిగిరిలో జరిగిన ఏపీటీఎఫ్ ధర్నాలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని ఉపాధ్యాయులకు మద్దతు తెలిపారు.

నిధుల గోల్‌మాల్‌పై పాలకవర్గం ఆగ్రహం

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29 : డీసీఎంఎస్‌లో ఎరువుల నిధులు గోల్‌మాల్‌పై గురువారం జరిగిన సొసైటీ పాలకవర్గ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సొసైటీ పాలకవర్గ సమావేశానికి సొసైటీ అధ్యక్షులు రావి పద్మావతి అధ్యక్షత వహించారు. ఎరువులకు సంబంధించి పొగాకు బోర్డు నుంచి సొసైటీకి జమ చేసిన నిధులను సొసైటీ అకౌంటెంట్ బి.రామచంద్రరావు డ్రాచేసి గోల్‌మాల్ చేయడంపై సమావేశంలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. సమావేశం నుంచి రామచంద్రరావుతో ఫోన్‌లో మాట్లాడి రెండురోజుల్లో గోల్‌మాలైన నిధులు తిరిగి సొసైటీకి జమచేయాలని హెచ్చరించారు. పొలం విక్రయించి డబ్బులు సొసైటీకి జమచేస్తానని ఆయన చెప్పినట్లు సమాచారం. రామచంద్రరావు నుంచి ఆ నిధులు వసూలు చేసిన తర్వాత అతనిపై చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, బిజినెస్ మేనేజర్ పాల్గొన్నారు.

మాగుంట కార్యాలయం కిటకిట

- ఎంపీని కలిసేందుకు భారీగా అభిమానుల రాక

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 29 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డిని జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన అభిమానులు కలిశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అభిమానులతో సందడి నెలకొంది. ఇప్పటివరకు వైసీపీలో ఎంపీగా ఉన్న మాగుంటపై అధిష్టానం వ్యవహరించిన తీరుతో విసిగిపోయి బుధవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో గురువారం ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ద్వితీయశ్రేణి నాయకులు మాగుంటను కలిసి మద్దతు తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పలుప్రాంతాల నుంచి వచ్చిన వారు మాగుంటను కలిశారు.

లారీని ఢీకొట్టిన కంటైనర్

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

కనుమళ్ల జాతీయ రహదారి వద్ద ఘటన

సింగరాయకొండ, ఫిబ్రవరి 29 : జాతీయ రహదారిపై ఓ కంటైనర్ అదుపుతప్పి అవతలి వైపు రోడ్డులోకి దూసుకెళ్లి అటుగా వస్తున్న ఐచర్ లారీని ఢీకొట్టి బోల్తా కొట్టింది. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కనుమళ్ల జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఐచర్ లారీ డ్రైవర్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కంటైనర్ కనుమళ్ల జాతీయ రహదారి రన్‌వే వద్దకు వచ్చేసరికి డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నారు. దీంతో కంటైనర్ అదుపుతప్పి అవతలి వైపు రోడ్డులోకి దూసుకెళ్లి రొయ్యల వ్యర్థాల లోడ్‌తో ఎదురుగా వస్తున్న ఐచర్ లారీని బలంగా ఢీకొట్టి బోల్తాకొట్టింది. ఐచర్ లారీ డ్రైవర్ బీహార్‌కు చెందిన డ్రైవర్ బాబుల్‌కుమార్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు, పోలీసులు హుటాహుటినా సంఘటన స్థలానికి చేరుకున్నారు. బోల్తాపడిన లారీకి తాళ్లు కట్టి వేరొక లారీ సహాయంతో పక్కకు తీశారు. క్యాబిన్‌లో గాయాలతో కొట్టుమిట్టాడుతున్నా డ్రైవర్ బాబుల్‌కుమార్‌ను బయటకు తీశారు. వెంటనే అయన్ను, గాయపడిన చిత్తూరు జిల్లా కుప్పంకు చెందిన కంటైనర్ డ్రైవర్ శ్రీనివాసులను 108, హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఐచర్ లారీ డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.



బోల్తాపడిన లారీని పక్కకు తీస్తున్న పోలీసులు

అరాచక పాలకులకు బుద్ధి చెప్పండి

- ఏపీటీఎఫ్ ధర్నాకు సంఘీభావం తెలిపి మాట్లాడిన డాక్టర్ ఉగ్ర

కనిగిరి, ఫిబ్రవరి 29 : వచ్చే ఎన్నికల్లో వైసీపీ అరాచక పాలకులకు బుద్ధి చెప్పాలని కనిగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ చేపట్టిన నిరసన ధర్నాకు డాక్టర్ ఉగ్ర గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సక్రమంగా నెల జీతం పడే పరిస్థితి లేదన్నారు. ఎన్నికలకు ముందు జగన్ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేస్తామని హామీ నెరవేర్చలేదని విమర్శించారు. సమాజంలో పూజ్యులైన ఉపాధ్యాయులను వైసీపీ పాలకులు నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సైకో జగన్‌ను ఉపాధ్యాయులు, ఉద్యోగులు గద్దె దింపాలన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఐదేళ్లు ఉపాధ్యాయులు ఎన్ని ఉద్యమాలు చేసినా జగన్‌రెడ్డి పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయబ్‌రసూల్, నా యకులు శ్రీనివాసులు, బీవీఎస్ ప్రసాద్, ప్రసాద్, హజరత్ రెడ్డి,దండే శ్రీనివాసులు, రమేష్‌బాబు, జేఎస్ ఆనంద్‌బాబు, కే రామ్మోహన్, సుబ్బయ్య జీ రామకృష్ణ, హరిబాబు, వహీద్, చిన్న నారాయణ, ఖజామస్తాన్ పాల్గొన్నారు.

పశ్చిమంపై ఫోకస్

ప్రత్యేక దృష్టి సారించిన టీడీపీ

మూడు లోక్‌సభ స్థానాలకు బలమైన అభ్యర్థులు

ఎంపీని అసెంబ్లీ బరిలోకి తెచ్చే ఆలోచన

మార్కాపురంలో ఇల్లు తీసుకుంటున్న మాగుంట

3న లోకేష్, 10న మార్కాపురానికి చంద్రబాబు

బాపట్ల లోక్‌సభ రేసులో ప్రసాదరావు?

కీలకంగా మారిన మహీధరరెడ్డితో వేమిరెడ్డి భేటీ



చంద్రబాబు నాయుడు



మాగుంట శ్రీని వాసులరెడ్డి



నారా లోకేష్

ఉమ్మడి ప్రకాశం జిల్లాతో సంబంధం ఉన్న మూడు లోక్‌సభ స్థానాల నుంచి బలమైన అభ్యర్థులను రంగంలో దింపటంతో పాటు పశ్చిమ ప్రాంతంపై తెలుగుదేశం పార్టీ ప్రత్యేక దృష్టిని సారించింది. తదనుగుణంగా ఒక అసెంబ్లీ స్థానం నుంచి ఎంపీ మాగుంటని రంగంలోకి దింపే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు 3న పశ్చిమప్రాంతం నుంచే లోకేష్ పర్యటన ప్రారంభిస్తుండగా 10న మార్కాపురానికి బాబు రానున్నారు. దీంతోపాటు జిల్లాలో మిగిలిన అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల ఎంపికపై గురువారం హైదరాబాద్‌లో బాబు కసరత్తు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఒంగోలు లోక్‌సభ నుంచి రాఘవరెడ్డి, నెల్లూరు నుంచి వేమిరెడ్డి పోటీ ఖరారుకాగా బాపట్లపై కసరత్తు పూర్తయినట్లు సమాచారం. నేడో రేపో మిగిలిన అభ్యర్థుల ఎంపికపై ఒక అవగాహనకు వచ్చి మాగుంటను పార్టీలో చేర్చుకునే కార్యక్రమాన్ని కూడా వెంటనే పూర్తిచేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఉమ్మడి జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాల అభ్యర్థులను ఇప్పటికే టీడీపీ ప్రకటించింది. ఆ పార్టీతో జతకట్టిన జనసేనకు దర్శిని కేటాయించగా అక్కడ అభ్యర్థి ఎంపికపైనా కసరత్తు జరుగుతోంది. ఇదే సమయంలో జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ గట్టి పట్టును ప్రదర్శించిన పశ్చిమప్రాంతంలో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ప్రత్యేక వ్యూహాన్ని రూపొందిస్తున్నారు. తదనుగుణంగా పశ్చిమప్రాంతంలో మిగిలిన నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపికపై ప్రత్యేక కసరత్తును చేపట్టడమే గాక ఆ ప్రాంతాల్లో చంద్రబాబు, లోకేష్‌లు పర్యటనలకు రానున్నారు. అదేసమయంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా దర్శి లేక పశ్చిమ ప్రాంతంలో ఒక సభకు హాజరయ్యేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలను గెలుచుకోవటం ద్వారా టీడీపీకి జిల్లాలో పట్టున్న విషయం నిరూపితమైంది. అయితే ఆ నాలుగు స్థానాలు తూర్పు ప్రాంతంలోనే దక్కాయి. దీంతో గత రెండేళ్ల నుంచి పశ్చిమంపై టీడీపీ ప్రత్యేకదృష్టిని కేంద్రీకరించింది. వెలిగొండపై స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటించటమే గాక అధికారంలోకి రాగానే మార్కాపురం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేస్తామని చంద్రబాబు స్పష్టంగా ప్రకటించి ఉన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయం ఆసన్నం కావటంతో ఆ ప్రాంతంపై మరింత దృష్టి కేంద్రీకరించటం విశేషం.

మూడు లోక్‌సభలకు బలమైన అభ్యర్థులు

ముందుగా టీడీపీ లోక్‌సభ స్థానాలపై దృష్టి కేంద్రీకరించింది. అటు వేమిరెడ్డి చేరిక టీడీపీ, జనసేన కూటమికి మంచి బలాన్నిచ్చింది. ఉమ్మడి జిల్లాలోని కందుకూరు అసెంబ్లీ కలిసి ఉన్న నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. ఆయన 2వ తేదీ అధికారికంగా టీడీపీలో చేరబోతున్నారు. మరోవైపు వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ మాగుంట, ఆయన అనుచరులు తెలుగుదేశంలో చేరేందుకు కూడా రంగం సిద్ధమైంది. జిల్లాలో లోకేష్, చంద్రబాబుల పర్యటనలు జరగనున్న నేపథ్యంలో మాగుంట చేరిక కూడా రెండు మూడు రోజుల్లోనే ఉండే అవకాశం కనిపిస్తోంది. 3వ తేదీ నుంచి మూడురోజులపాటు లోక్‌సభ పరిధిలో లోకేష్ పర్యటించనున్నారు. దీంతో మాగుంట పార్టీలో చేరే తేదీ విషయమై శుక్రవారం ఒక నిర్ణయం జరగవచ్చని తెలుస్తోంది. వీలైతే బాబు సమక్షంలో ఆయన 2న అమరావతిలో కానీ లేదా మరోరోజు కానీ చేరే విషయంపై బాబుతో మాట్లాడి శుక్రవారం నాడే ఒక నిర్ణయానికి రావచ్చని తెలుస్తోంది. ఇక ఉమ్మడి జిల్లాలో నాలుగు అసెంబ్లీ స్థానాలున్న బాపట్ల లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై కూడా గురువారం హైదరాబాద్‌లో బాబు కసరత్తు చేశారు. పోటీకి సిద్ధంగా ఉన్న విశ్రాంత ఐఆర్‌ఎస్ ఆఫీసర్ దగ్గుమల్ల ప్రసాదరావు గురువారం హైదరాబాద్‌లో చంద్రబాబును కలిశారు. పర్చూరు నియోజకవర్గం చింతగుంపల గ్రామానికి చెందిన ప్రసాదరావును మరోసారి శుక్రవారం కూడా కలవాలని బాబు సూచించినట్లు తెలిసింది. దళితులలో రెండు వర్గాలకు సంబంధించి ఒకరిని తిరుపతి, మరొకరిని బాపట్ల లోక్‌సభల నుంచి రంగంలో దింపాలని భావిస్తున్నారు. తిరుపతి నుంచి మాదిగ సామాజికవర్గానికి చెందిన మహిళ పేరు పరిశీలనలో ఉన్నందున మాల సామాజికవర్గానికి చెందిన ప్రసాదరావుకు బాపట్ల నుంచి పోటీ చేసే అవకాశం దక్కే చాన్స్ కనిపిస్తోంది. అయితే తుది నిర్ణయం జరగలేదు.

మాగుంటను అసెంబ్లీ బరిలో దింపే ఆలోచన

ఇదేసమయంలో ఎంపీ మాగుంటని పశ్చిమప్రాంతంలోని ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఒంగోలు లోక్‌సభ నుంచి తన కుమారుడు రాఘవరెడ్డిని రంగంలో దింపబోతున్నట్లు మాగుంట వెల్లడించిన విషయం తెలిసిందే. ఒక ఇంట్లో ఒకరికే పదవి అన్న నిర్ణయంతో ఉన్న టీడీపీ అవసరమైన చోట్ల అనివార్యమైతే ఒకే ఇంట్లో ఇద్దరికి కూడా అవకాశం ఇస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఇప్పటికే అలాంటి ఒక నిర్ణయం కూడా తీసుకున్నారు. మాగుంట కుటుంబం రాక ఒంగోలు లోక్‌సభ పరిధిలో బాగా కలిసొస్తుందని భావిస్తున్న టీడీపీ పశ్చిమప్రాంతంలో మరింత పట్టు సాధించేందుకు మాగుంటను రంగంలో దింపాలన్న ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. పశ్చిమప్రాంతంలో ఇప్పటికే కనిగిరి, వైపాలెం అభ్యర్థులుగా ఉగ్రనరసింహారెడ్డి, ఎరిక్షన్‌బాబులను టీడీపీ ప్రకటించింది. తాజాగా గిద్దలూరు నుంచి అశోక్‌రెడ్డినే రంగంలోకి దించే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని టీడీపీ ముఖ్యనాయకులంతా అశోక్‌రెడ్డి పేరునే సూచించారు. దర్శిని జనసేనకు కేటాయించినప్పటికీ అభ్యర్థిని ప్రకటించలేదు. జనసేన తరపున అక్కడ పనిచేస్తున్న గరికపాటి వెంకట్ రేసులో ఉన్నారు. తాజాగా మాజీ ఎమ్మెల్యే గరటయ్య కుమారుడు చైతన్యను పరిగణనలోకి తీసుకున్నారు. ఒక సర్వేలో చైతన్యకు సానుకూలంగా వచ్చిన అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అయితే జనసేన వైపు నుంచి వెంకట్ పేరు కూడా బలంగా వినపడుతోంది. అలాగే ఒక మాజీ మంత్రి కూడా ఒకదశలో ముందడుగు వేసినప్పటికీ మళ్లీ వెనక్కు తగ్గినట్లు సమాచారం. నరసరావుపేటకు చెందిన ఒక మహిళా డాక్టరు కూడా దర్శి టికెట్‌ను ఆశిస్తున్నారు. దీంతో అక్కడ కూడా బలమైన అభ్యర్థి కోసం ప్రత్యేక సర్వే నిర్వహించారు. తదనుగుణంగా రానున్న రెండుమూడు రోజుల్లో బాబు, పవన్ మరోసారి కలిసినప్పుడు జనసేన అభ్యర్థి ఖరారయ్యే అవకాశం ఉంది.

ఇప్పటికే పశ్చిమప్రాంతంలోని అన్నిచోట్ల టీడీపీలోకి భారీగా వలసలు పెరిగాయి. అలాగే మాగుంట రాకతో పలువురు ద్వితీయశ్రేణి నాయకులు కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారు. మార్కాపురంలో పోటీకి సిద్ధంగా ఉన్న మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం రాత్రి ఒంగోలు వచ్చి మాగుంటను కలిశారు. గురువారం వారు హైదరాబాద్ వెళ్లారు. అక్కడ బాబును కలిసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు మాగుంట మార్కాపురంలో పార్టీ కార్యాలయంగానే కాకుండా నివాసానికి అనుగుణమైన ఇంటిని తీసుకోబోతున్నారు. అందుకోసం ఒకటి రెండు ఇళ్లు చూశారు కూడా. అయితే ఎంపీగా పోటీచేస్తున్న రాఘవరెడ్డి ప్రచారం కోసం ఇల్లు తీసుకుంటున్నట్లు చెబుతున్నప్పటికీ మాగుంట, టీడీపీ అధినాయకత్వం అడుగులు, కొత్త వ్యూహంలో భాగంగానే కనిపిస్తున్నాయి.

కీలకంగా మారిన మహీధర్‌తో వేమిరెడ్డి భేటీ

కాగా గురువారం సాయంత్రం నెల్లూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి అయిన వేమిరెడ్డి కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డితో భేటీ కావటం రాజకీయంగా కీలకమైంది. మహీధరరెడ్డిని ఆయన స్వగ్రామమైన మాచవరంలో వేమిరెడ్డి కలిసి సుమారు గంటసేపు మంతనాలు జరిపారు. వేమిరెడ్డి వైసీపీలో ఉన్నప్పటి నుంచి మహీధరరెడ్డితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన శనివారం టీడీపీలో చేరి నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీచేయబోతున్నారు. ఇప్పటికే నెల్లూరులో వైసీపీలో ఆయనతో సన్నిహితంగా ఉండే పలువురితో ఆ పార్టీకి రాజీనామా చేయించారు. తాజాగా మహీధర్‌తో కూడా ఆయన టీడీపీలో చేరే అంశాన్ని గురించే మాట్లాడి ఉండవచ్చని భావిస్తున్నారు. కాగా మహీధర్ ఏ విషయంపైనా స్పష్టమైన హామీ ఇవ్వలేదని అంటున్నారు. ఒకటి రెండురోజులు సమయం కావాలని చెబుతూనే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల్లో పోటీ చేయకుండా ఉండటమే ఉత్తమమని ఆలోచిస్తున్న విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. ఇంకోవైపు ఇప్పటికే ఇద్దరు ఇన్‌చార్జిలను మార్చిన వైసీపీ మధుసూదన్ విషయంలో కూడా పునరాలోచన చేస్తుందేమోనన్న అనుమానాలు కూడా మహీధరరెడ్డి చేస్తున్నట్లు సమాచారం. అదే విషయాన్ని ఆయన అనుచరులతో కూడావ్యాఖ్యానిస్తున్నారు. అయితే వేమిరెడ్డి కలిసి వెళ్లిన తర్వాత మహీధరరెడ్డి తన వ్యక్తిగత కుటుంబ శ్రేయోభిలాషులతో పాటు ముఖ్య అనుచరులతో కూడా ప్రత్యక్షంగా, ఫోన్‌లో కూడా మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. దీంతో వీరి భేటీ రాజకీయంగా ఏ మలుపు తిరుగుతుందో చూడాల్సి ఉంది.

10న చంద్రబాబు ప్రత్యేక సమావేశం

ఆదివారం నుంచి లోకేష్ శంఖారావం కార్యక్రమాలు ఆ ప్రాంతం నుంచే ప్రారంభమవుతున్నాయి. 2వ తేదీ రాత్రికి ఆయన వైపాలెం చేరతారు. 3న కార్యకర్తల విస్తృత సమావేశంలో పాల్గొంటారు. అదేరోజు మధ్యాహ్నం గిద్దలూరులోను, సాయంత్రం మార్కాపురంలోను జరిగే సమావేశాల్లో లోకేష్ పాల్గొంటారు. ఆదివారం రాత్రికి దర్శిలో బసచేసి సోమవారం ఉదయం దర్శి, ఒంగోలు, కొండపిలలో జరిగే శంఖారావం కార్యక్రమాల్లో పాల్గొంటారు. సోమవారం రాత్రికి కందుకూరులో బసచేసి మంగళవారం ఉదయం కందుకూరులోను మధ్యాహ్నం కనిగిరి నియోజకవర్గం పామూరులో జరిగే శంఖారావం కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రానికి నెల్లూరు జిల్లా ఉదయగిరి వెళ్తారు. అయితే ఆ వెంటనే 10వ తేది చంద్రబాబు మార్కాపురం రానుండటం విశేషం. మార్కాపురంలో ఆయన పశ్చిమప్రాంతంలోని తటస్థులు, ఆయా వర్గాలకు చెందిన ప్రముఖులు, మేధావులతో సమావేశం కాబోతున్నారు.

పెద్దసంఖ్యలో ఆయా వర్గాల వారు హాజరయ్యే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ సందర్భంగా బాబు పశ్చిమ ప్రాంత సామాజిక, ఆర్థికాభివృద్ధికి సంబంధించి అలాగే మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి మరింత స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉంది. ముందుగా జరిగే లోకేష్ పర్యటన నాటికి ఒకటి రెండు నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక అధికారికంగా వెల్లడించకపోయినా బాబు వచ్చేరోజుకు మొత్తం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.

ఆరంభం సంతృప్తికరం

కిలో రూ.230 పలికిన ప్రారంభ ధర

మధ్యలో ఒక్క బేలుకు

రూ.250 వేసిన బయ్యరు

పొరపాటుగా నొక్కినట్లు గుర్తింపు

తగ్గించి సరిచేయమన్న వ్యాపారి

అంగీకరించని బోర్డు అధికారులు

ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు

పాల్గొన్న పొగాకు బోర్డు చైర్మన్, ఈడీలు

ఒంగోలు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దక్షిణాదిలోని ఒంగోలు-1, కొండపి కేంద్రాలలో తొలివిడతగా గురువారం వేలం ప్రక్రియ చేపట్టగా కొండపిలో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్, ఒంగోలు-1లో ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబులు లాంఛనంగా ప్రారంభించారు. రెండుచోట్ల 18 బేళ్ల వంతున తొలిరోజు వేలంకు తీసుకరాగా కిలో రూ.230 గరిష్ట. ప్రారంభ ధరగా వ్యాపారులు ఇచ్చారు. ఒక్క బేలుకు మాత్రం కిలో రూ.250 లభించింది. అయితే ధరను హ్యాండ్‌సెట్‌లో రూ.230కి బదులు రూ. 250ని ఒక కంపెనికి చెందిన బయ్యరు నొక్కడం వల్ల అలా వచ్చింది. జరిగిన తప్పిదాన్ని సదరు కంపెనీ ప్రతినిధితోపాటు అధికారులు, ఇతర వ్యాపారులందరూ గుర్తించారు. ఈ ఘటన ఒంగోలు-1 వేలంకేంద్రంలో చోటుచేసుకుంది. కాగా ఈ ఏడాది పొగాకును వ్యాపారులు ప్రారంభ ధర కిలో రూ.230 ఇస్తున్న విషయం ఇతర బేళ్లకు ఇచ్చిన ధరను బట్టి స్పష్టం కాగా అదే విషయాన్ని సంబంధిత కంపెనీ ప్రతినిధులు బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా అక్కడ వేలం పరిశీలిస్తున్న బోర్డు ఈడీ శ్రీధర్ బాబు అందుకు అనుమతించలేదు. రైతులు కూడా ఈ ఏడాది ప్రారంభ ధర కిలో రూ.250 ఇవ్వాలని కోరుతూ వస్తున్న నేపథ్యంలో పొరపాటుగా అయినప్పటికి రూ.250 పలకడం వారికి ఎంతో కొంత సంతృప్తి ఇస్తుందన్న భావనతో అధికారులు ఆ ధరను కొనసాగించాలని సూచించారు. ఆ రకంగా తొలిరోజు సాంకేతికంగా గరిష్ఠ ధర కిలో రూ.250గా పరిగణించే అవకాశం ఉన్నప్పటికి వాస్తవంగా చూస్తే ప్రారంభ ధర కిలో రూ.200గా ఉండగా ఈ ఏడాది రూ.230తో ప్రారంభించడం పట్ల రైతులలో ఒకింత సంతృప్తి వ్యక్తమవుతోంది. అయితే క్రమంగా ధరలు పెంచుతూ సగటు ధర కిలో రూ.250 నుంచి రూ.260 వరకు దక్కేలా చూడాలని రైతు ప్రతినిధులు అటు అధికారులు వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఒంగోలు-1లో బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు పూజలు చేసి కొనుగోళ్లు ప్రారంభించగా ఆర్‌ఎం లక్ష్మణరావు, బోర్డు సభ్యుడు పొద వరప్రసాదరావు, రైతు కమిటీల ప్రతినిధులు గురువారెడ్డి, ఆళ్ల సుబ్బారావు, వడ్డెళ్ల ప్రసాదు పాల్గొన్నారు అలాగే కొండపి కేంద్రంలో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ ప్రారంభించగా సెక్రటరి దివి వేణుగోపాల్, బోర్డు సభ్యుడు బ్రహ్మయ్య పాల్గొన్నారు.



ఒంగోలు 1లో పొగాకు కొనుగోళ్లు ప్రారంభిస్తున్న బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు

ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి: ఎస్పీ

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 29: ఎన్నికల విధులు నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని ఎస్పీ పి.పరమేశ్వ రరెడ్డి ఆదేశించారు. గురువారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విచారణలో ఉన్న కేసుల దర్యాప్తును త్వరగా పూర్తిచేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా చెడునడవడిక ఉన్న వారిని బైండోవర్ చేయాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, అందుకోసం సమస్యా త్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రధాన దృష్టి సారించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం


నేటి నుంచి ప్రారంభం

నిమిషం లేటైనా నో ఎంట్రీ

సీసీ కెమెరాల నిఘా

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 29 : జిల్లాలో శుక్రవారం నుంచి జరగనున్న ఇంటర్మీడియేట్ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలతో పరీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. పరీక్షలు ఉదయం 9 నుంచి 12గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులు గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలి. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల ప్రధాన ద్వారాల వద్దే క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

- ఇంటర్ పరీక్షలకు మొత్తం 44,733 మంది విద్యార్థులు హాజరవుతున్నారు. వీరిలో 21,570 మంది మొదటి సంవత్సరం కాగా 23,163 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు.
- పరీక్షకు విద్యార్థులు నిమిషం లేటుగా వచ్చినా అనుమతించరు. పరీక్ష 9 గంటలకు ప్రారంభమవుతుండగా 9.01కు వచ్చినా విద్యార్థులను అనుమతించరు.
- సీసీ కెమెరాల పటిష్ట నిఘాలో పరీక్షలు నిర్వహిస్తారు. కేంద్రాల్లోని అన్ని గదులకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షను ప్రత్యక్షంగా చూసేందుకు ఒంగోలు ఆర్ఐఓ కార్యాలయం, విజయవాడ ఇంటర్ బోర్డు కార్యాలయాలకు ఈ కెమెరాలను అనుసంధానం చేశారు.
- ఇంటర్ పరీక్ష కేంద్రాలను నో ఫోన్ జోన్ ఏరియాలుగా ప్రకటించారు.
- పరీక్ష నిర్వహణలో అధికారులు, సిబ్బంది, ఇన్విజిలేటర్లు కేంద్రాలకు మొబైల్ ఫోన్లు తీసుకురాకూడదు.



- పరీక్షా కేంద్రాలకు డిజిటల్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు.
- పరీక్ష విధులకు హాజరయ్యే అధికారులు, ఇన్విజిలేటర్లు, సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలి. బయట వ్యక్తులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరాదు.
- కంభం, పెదదోర్నాల, అర్ధవీడు, వైపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గిద్దలూరులోని మరో కళాశాలను సున్నితమైనవిగా గుర్తించి వాటిపై ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాటు చేశారు.
- పరీక్షల్లో కాపీయింగ్‌ను నిరోధించేందుకు మూడేసి చొప్పున ప్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు.
- పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే విద్యాశాఖ యాక్టు 25 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.
- అన్ని కేంద్రాల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర అత్యవసర మందులతో వైద్య బృందాలను ఏర్పాటు చేశారు.
- అన్ని కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.
- ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది. 17 కళాశాలల విద్యార్థుల కోసం ఈ ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను కండక్టర్‌కు చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ఆర్థికాభివృద్ధి

పామూరు, ఫిబ్రవరి 29 : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ప్రకటించిన మహిళాశక్తి సూపార్‌సిక్స్ పథకాలతో పేద కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని టీడీపీ ఒంగోలు పార్లమెంట్ ముస్లిం మైనారిటీ సెల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ఆర్ రఫీ అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆదేశాలతో పట్టణంలోని సీఎస్ పురం, విరువూరు రోడ్‌లో బాబు ష్యూరిటీ.. భవిషత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. అవినీతి అరాచక వైసీపీ పాలనకు చమరగీతం పాడేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ గడ్డం రామారావు, పత్తు మస్తాన్, చెక్క చెన్నయ్య, నాయబ షకీబ్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఉప్పుటూరు(పర్చూరు), ఫిబ్రవరి 29: దేవదాయశాఖకు సంబంధించి నిధుల దుర్వినియోగంపై రీజనల్ జాయింట్ కమిషనర్(ఆర్‌జేసీ) ఆధ్వర్యంలో గురువారం విచారణ చేపట్టారు. పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించి విధులు నిర్వహించిన అప్పటి ఈవో నాగేశ్వర రావు హయాంలో నిధులు దుర్వినియోగం అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈనేపథ్యంలో దేవదాయశాఖ కమిషన్ ఆదేశాల మేరకు రీజనల్ జాయింట్ కమిషనర్ డి.భ్రమరాంబ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా అసిస్టెంట్ కమిషన్ పి.పానకాలరావు సారథ్యంలో విచారణ చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఆలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని కమిషనర్ తెలిపారు.

భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు సీఎం కావాలి



సూపర్ సిక్స్ పథకాల ప్రచారంలో కొండయ్య

చీరాల, ఫిబ్రవరి 29: రాష్ట్ర ప్రజల భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య అన్నారు. పట్టణంలోని 15,16,17 వార్డులలో గురువారం సూపర్ సిక్స్ పథకాలు, మ్యానిఫెస్టో వివరాలు తెలిపే కరపత్రాలను నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. ఆ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక, అనైతిక, ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రానైట్ స్లాబుల లారీ పట్టివేత

బల్లికురవ, ఫిబ్రవరి 29: ఎలాంటి బిల్లులు లేకుండా అక్రమమార్గంలో తరలి వెళుతున్న గ్రానైట్ స్లాబుల లారీని గురువారం మైనింగ్ విజిలెన్స్ ఏడీ ఈరేష్‌బాబు ఆదుపులోకి తీసుకొన్నారు. బల్లికురవ - సంతమాగులూరు రోడ్డులో వెళుతున్న స్లాబుల లారీని అధికారులు నిలుపుదల చేసి తనిఖీ చేశారు. ఎలాంటి పత్రాలు లేకపోవటంతో లారీని పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పట్టుబడిన లారీలో ఉన్న స్లాబులకు కొలతలు వేసి పెనాల్టీలు విధిస్తామని మైనింగ్ అధికారులు తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 29: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు సమస్యలను పరిష్కరించడంతో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అనాసక్తి కనబరుస్తుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అమర్తపూడి శేఖర్‌బాబు అన్నారు. గురువారం ఫెడరేషన్ ఆధ్వర్యంలో అద్దంకి పాత తాలూకా కేంద్రం వద్ద ధర్నాలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీలో మధ్యంతర భృతి 30శాతం తక్షణ చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న కొత్త డీఏలు తక్షణం విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంకణాల శ్రీనివాసరావు, కరి రామయ్య, మలాది నాగరాజు, రమేష్‌బాబు, ఏలీషా, చెంచు రామారావు, రహమ్‌తుల్లా మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

చీరాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఏపీటీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. గురువారం చీరాల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీటీ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, పర్చూరు, చినగంజాం, కారంచేడు పరిధిలోని ఏపీటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

బీసీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఇంకొల్లు, ఫిబ్రవరి 29: చినగంజాంలో మార్చి 5న జరిగే బీసీ సెల్ పార్లమెంట్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని నేతలు కోరారు. గురువారం ఇంకొల్లులోని టీడీపీ కార్యాలయంలో బీసీ నేతలు సమావేశమయ్యారు. ప్రతి గ్రామం నుంచి ఆత్మీయ సమావేశానికి కదిలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుంజి వెంకట్రావు, సింగయ్య, సిద్ధు, వి.సాంబయ్య, వెంకయ్య, కె.వసంతరావు, ఆజాద్, గుంజి వెంకట్రావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు: చినగంజాం మండల కేంద్రంలో మార్చి 5న నియోజకవర్గ స్థాయిలో తలపెట్టిన బీసీ ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని బీసీ నేతలు కోరారు. ఇందుకు సంబంధించి గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోలూరి సింగయ్య, అన్నవరపు శ్రీనివాసులు(వాసు), కూరపాటి జగన్, కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ఉప్పుటూరి నరేంద్ర, కాల్వ శ్రీనివాసరావు, నక్కల రాఘవ, మార్టూరి రామాంజనేయులు, అద్దంకి రామసుబ్బారావు, వి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సభను జయప్రదంచేయాలి

బల్లికురవ, ఫిబ్రవరి 29: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధించాలని కోరుతూ మార్చి 3న అద్దంకిలో జరిగే ఎమ్మార్పీఎస్ సభను జయప్రదం చేయాలని అసంఘ నేతలు కోరారు. ఇందుకుసంబంధించి గురువారం బల్లికురవలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనరసయ్య, పేతురు, రమేష్, ప్రసాద్, వీరయ్య, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

దుద్దుకూరులో బాలాలయ ప్రతిష్ఠ

ఇంకొల్లు, ఫిబ్రవరి 29: మండలంలోని దుద్దుకూరు గ్రామంలో వేంచేసిన శ్రీరాజ్యలక్ష్మీ సమేత శ్రీచెన్నకేశవస్వామి దేవాలయ జీర్ణోద్ధరణలో భాగంగా బాలాలయ ప్రతిష్ఠ స్థాపన కార్యక్రమాలు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. గురువారం శతాధిక ప్రతిష్ఠాపనాచార్య శ్రీ నారాయణం వెంకటరమణ దీక్షితులు హోమం, ప్రతేక పూజలు నిర్వహించి దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. గ్రామప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పర్చూరు, ఫిబ్రవరి 29: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం పర్చూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాబోలు రత్నాకర్‌రావు(58) స్వీట్‌హోమ్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఎలుకల మందు సేవించగా, గుర్తించిన కుటుంబ సభ్యులు హుటాహుటీన పర్చూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మనస్తాపంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 29: వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. గురువారం గుండ్లకమ్మ నదికి వెళ్ళేదారిలో ఉండే పేదలకు వాసవి క్లబ్ సభ్యులు ఫిబ్రవరి 29 లీప్ డే సందర్భంగా క్లబ్ అధికారుల ఆదేశాల మేరకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఆంజనేయులు, ఉడుతు విజయలక్ష్మి, అంజలి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 29: విద్యార్థులు బాల్యం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇట్టా వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతపై పలు విషయాలను తెలియజేశారు. హెచ్‌ఎం కేవీ శ్రీనివాసరావు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరాంజనేయులు, అంకారావు, శ్రీనివాసరావు, జ్యోతి నిర్మల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

'సింహగర్జన'ను విజయవంతం చేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 29: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని విజయవంతం చేయాలని మాల మహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. మాల మహాసభ, మాల మహానాడు, పీపుల్స్ రిపబ్లికన్ పార్టీ ఆధ్వర్యంలో మార్చి 3న బాపట్లలో మాలల సింహగర్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకుసంబంధించి గురువారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పులిపాటి బాబురావు, శాస్త్రి, జూనియస్, బుల్లిబాబు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 29: చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన కట్టిబోయిన శ్రీనివాసరావు(51) క్యాటరింగ్ చేస్తూ భార్య, ఇద్దరు కుమార్తెలను పోషిస్తున్నాడు. ఈక్రమంలో ఓ శుభకార్యానికి క్యాటరింగ్‌కు వెళ్లి అర్ధరాత్రి సమయంలో రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు దాటుతుండగా బాపట్ల వైపు వెళ్లే రైలు ఢీకొని మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



ముప్పవరంలో కశ్యాపురం నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

పంగులూరు, ఫిబ్రవరి 29: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం టీడీపీ పాలనలోనే జరిగిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో రేణంగివరం, బూదవాడ, కోటపాడు, కశ్యాపురం, కొప్పెరపాడు గ్రామాలకు చెందిన నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో నేడు సైకో పాలన సాగుతోందన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రంలో విధ్వంసకర పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్నికల ముందు ముద్దులు పెట్టిన జగన్ అనంతరం ప్రజలందరితో పాటు మీడియా వర్గాలను పిడిగుద్దులు గుద్దారని అన్నారు. అన్న క్యాంటిన్లు మూసివేయించి ప్రజలకు అన్నం అందకుండా చేసిన జగన్ పెత్తందారుడు కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన జగన్ మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్‌ను పిచ్చోడని ముద్రవేసి ప్రాణం తీశారని చెప్పారు. ఇది జగన్ అరాచక పాలనకు పరాకాష్ట అని రవికుమార్ అన్నారు. 80 ఏళ్ల దాటిన వృద్ధులకు ఇంటివద్దే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి ఓట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు. జగన్ పాలనలో గంజాయి, శ్యాండ్, లిక్కర్ మాఫియా లో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉందన్నారు. చంద్రబాబు పాలనలో అభి వృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉండేదని గుర్తుచేశారు. జగన్ రెడ్డి పాలనలో డ్రగ్స్, కల్తీ లిక్కర్ మాఫియా, శ్యాండ్ మాఫియా, మహిళలపై అత్యాచారాలు, రైతుల ఆత్మహత్యలలో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపారని గొట్టిపాటి అన్నారు.

తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన కూటమి నిర్వహించిన జెండా సభతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో జనసేన మండల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. టీడీపీ, జనసేన నేతలు సమన్వయంతో సూపర్ సిక్స్ పథకా లను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, రావూరి రమేష్, ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఆదిశేఖర్, మానం సుబ్బారావు, ఓబుల్‌రెడ్డి, చిన్నా, శ్రీనివాసరెడ్డి, జనసేన నాయకులు వెంకటహనుమ, పాలెపు వీరాంజి, ఫణికుమార్, తిరుపతయ్య, సందీప్, వినోద్, రాంబాబు పాల్గొన్నారు.

గొట్టిపాటికి శ్రీనివాసరెడ్డి సంఘీభావం

పంగులూరు, ఫిబ్రవరి 29: వైసీపీ మండల కన్వీనర్ ఎర్రం శ్రీనివాసరెడ్డి ఆపార్టీ సభ్యత్వానికి, మండల కన్వీనర్ పదవికి రాజీనామా చేశారు. వైసీపీకి రాజీనామా చేసిన ఎర్రం శ్రీనివాసరెడ్డి గురువారం చిలకలూరిపేటలో ఎమ్మెల్యే రవికుమార్‌ను కలసి సంఘీభావం తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పేరుతో పేదల్ని అప్పులపాలు చేసిన సీఎం

పర్చూరు, ఫిబ్రవరి 29: ఇళ్ల నిర్మాణం పేరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరినీ అప్పులపాలు చేశారని ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదలచేశారు. ఏడాదికి 5లక్షల చొప్పున మొత్తం 25 లక్షల ఇళ్లు నిర్మించి ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చి, మాట తప్పి మడమ తిప్పారన్నారు. ఉచితంగా ఇళ్లు ఇవ్వకపోగా గృహ నిర్మాణం పేరుతో పేదలను అప్పుల పాలు చేశారని పేర్కొన్నారు. గృహాలు నిర్మించుకోకపోతే పట్టాలు రద్దు చేస్తామని బెదిరించి వారిచే ఇళ్లు కట్టించి అప్పులపాలుచేశారన్నారు. ఇళ్ల పేరుతో డ్వాక్రా మహిళలు ఒక్కొక్కరి పేరుతో రూ.35వేల చొప్పున మొత్తం రూ.3,866 కోట్లు అప్పులు తెచ్చి మహిళల నెత్తిన వేల కోట్లు అప్పులు పెట్టారని ఆరోపించారు. దీంతోపాటు టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టి రూ.10వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. ఓటీఎస్ పేరుతో ఎన్టీఆర్, చంద్రబాబు ఉచితంగా ఇచ్చిన ఇళ్లకు బలవంతంగా రూ.10వేల నుంచి రూ.30వేలు జగన్‌రెడ్డి వసూలు చేశారని మండిపడ్డారు. ఊరికి దూరంగా నివాస యోగ్యంకాని స్థలాను పేదలకు అంటకట్టారన్నారు. గతంలో చంద్రబాబు నిరుపేదలకు రెండు సెంట్లు ఇస్తే దాన్ని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం సెంటుకు కుదించిందన్నారు. రూ.7వేల కోట్లకుపైగా ఎమ్మెల్యేలు, మంత్రులు సెంటు పట్టాలో కుంభకోణం చేశారని ఆరోపించారు.

తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన జండా సభ జనజాతరతో తాడేపల్లి ప్యాలెస్ దద్దరిల్లిందని ఎమ్మెల్యే ఏలూరి అన్నారు. అధికార పార్టీ ఆటంకాలు సృష్టించినా కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. రాష్ట్ర భవిష్యత్‌కోసం వైసీపీకి వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పోరాడుతున్నాయన్నాయని దీనికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారన్నారు.

అందుబాటులో లేని సచివాలయ సిబ్బంది

» ప్రతిరోజు సంతకాలు చేసి పలాయనం

» అర్జీదారులు ఫోను చేస్తే ఫీల్డు విజిట్ అంటూ చెబుతున్న వైనం

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బల్లికురవ సచివాలయంలో సిబ్బందిలేక ఖాళీగా ఉన్న కుర్చీలు



బల్లికురవ గ్రామ సచివాలయం

బల్లికురవ, ఫిబ్రవరి 29: ప్రభుత్వం ఒకవైపు గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు గ్రామాల లోనే మెరుగైన సేవలను అందిస్తున్నామని చెబు తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం సచివాలయాలలో సిబ్బంది ఉండటం లేదు. సమస్యల పరిష్కారానికి వెళ్లిన ప్రజలకు అక్కడ ఖాళీ కుర్చీలు దర్శన మిస్తున్నాయి. ఏ సమయంలో ప్రజలు వెళ్లినా సిబ్బంది ఫీల్డు విజిట్‌లకు వెళ్లారనే సమాధానం వస్తుంది. విజిట్‌లకు వెళ్లిన వారు ఎక్కడ ఉన్నారంటే మాత్రం మాట దాట వేస్తున్నారు. మం డల స్థాయిలో పర్యవేక్షించే అధికారులు కూడా విజిట్‌లు చేయకపోవటం వలనే ఇలాంటి పరిస్థితి నెలకొందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బల్లికురవ మండల కేంద్రంలోని గ్రామ సచివాలయానికి ఏసమయంలో వెళ్లినా పూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన కొందరు అర్జీదారులు సమస్యల పరిష్కరం కోసం సచివాలయానికి వెళ్లగా.. అక్కడ డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్ మాత్రమే ఉన్నారు. మొత్తం 9 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ఏడుగురు మాత్రం ఫీల్డు విజిట్‌లకు వెళ్లినట్లు రికార్డులో వ్రాసిపెట్టి వెళ్లారు. ఇదేంటి తాము ఎప్పుడూ వచ్చిన సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండకుండా దుమ్మా కొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫీల్డు విజిట్‌లకు వెళ్లిన సిబ్బందికి కాల్ చేస్తే ఎక్కడ ఉన్నారో చెప్పకుండా దాట వేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. సచివాలయానికి ఉదయం పూట వచ్చి వెంటనే సంతకా లు చేసి విధులకు దుమ్మా కొడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని సచివాలయంలోనే పనితీరు ఇలా ఉంటే మిగిలిన సచివాలయాలలో పరిస్థితి ఎలా ఉంటుందో అని పలువురు చర్చిం చుకుంటున్నారు.

బల్లికురవ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, సర్వేయర్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, హెల్త్ ఏఎన్ఎం, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్‌తో పాటు తొమ్మిది మంది డ్యూటీలో ఉండాలి. అయితే, ఇద్దరు మాత్రమే ఉండటంతో సచివాలయాలు పెట్టటం దండగ అని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో బల్లికురవ సచివాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి లబ్ధిదారులకు పథకాలు అందించాలంటే నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న ఒక ఆడియో రికార్డు కూడా బయటకు వచ్చింది. దీనిపై అధికారులు నామ మాత్రంగా విచారణ చేశారు తప్ప చర్యలు చేపట్టలేదని ప్రజలు గుసగుస లాడుకుంటున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడిందని, సమస్యలు సకాలంలో పరిష్కారం కావటం లేదని, ఏ పని చేయాలన్న చేతులు తడపాల్సి వస్తుందని అర్జీదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే సచివాలయాలను తనిఖీలు చేసి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజ లు కోరుతున్నారు.

మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం

» 37 అంశాలు కొద్దిపాటి చర్చతో ఆమోదం



మాట్లాడుతున్న జంజనం శ్రీనివాసరావు

చీరాల, ఫిబ్రవరి 29: మొక్కుబడిగా మున్సిపల్ సమావేశం జరిగింది. గురువారం కౌన్సిల్ హాల్లో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ప్రజల సమస్యలపై మాట్లాడింది శూన్యం. అజెండాలోని 6వ అంశం స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ముఖ ద్వారంకు తుది మెరుగులు, సెక్యూరిటీ గది నిర్మాణం తదితర పనులకు సంబంధించి రూ.5లక్షల అంచనా వ్యయంగా కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు. దీనిపై 16వ వార్డు కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు మాట్లాడుతూ స్థల దాతల పేర్లు, తదితర విషయాలు ఆ అంశంలో పొందుపరచలేదని, రద్దు చేయాలని కోరారు. ఆ అంశాన్ని ప్రస్తుతానికి వాయిదావేసి, తరువాత చర్చించి నిర్ణయం తీసుకుందామని ఒకరు, ఎప్పుడైనా ఇదే ప్రస్తావన ఉంటుంది కాబట్టి ఆమోదించాలని మరొకరు ఇలా కౌన్సిలర్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

ఈక్రమంలో చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ అనే పేరులో మార్పు ఉండదని, అయితే దాతలు ఎవరైతే ఉన్నారో వారి పేర్లు ఒక శిలాఫలకంపై రాసి అందరికి కనిపించేవిధంగా ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలు అందరితో చర్చించి నిర్ణయం తీసుకుందామన్నారు. కౌన్సిలర్ మించాల సాంబశివరావు మాట్లాడుతూ ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ పేరు మార్పును ప్రభాకరరావు కోరుతున్నారని పేర్కొన్నారు. ఆయన కోరుతుంది పేరు మార్పు కాదు, దాతగా వారి తాతయ్య పేరు కూడా నమోదు చేయాలంటున్నారని చైర్మన్ వివరణ ఇచ్చారు. దీంతో సాంబశివరావు ఆ పదాన్ని సవరించుకున్నారు. అదే అంశంపై 25 వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి సురేష్ మాట్లాడుతూ తాను ఎస్ఆర్ పీఎం హైస్కూల్లో చదువుకున్నానని, ఎస్ఆర్ అండ్ పీఎం హై స్కూల్ అని మా సర్టిఫికెట్లలో ఉంది. అది కూడా మారుస్తారా అని ప్రశ్నించారు. 17వ వార్డు కౌన్సిలర్ చీమకుర్తి బాలకృష్ణ తన దగ్గర ఉన్న సమాచారం మేరకు ఆ స్కూల్‌కు సంబంధించి స్థల వితరణ, భవన నిర్మాణాల తాలీకు పూర్వా పరాలు వివరిస్తూ ఆ అంశాన్ని యథాతథంగా ఆమోదించాలని కోరారు. తన మాటకు విలువలేదంటూ - మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోడంటూ కౌన్సిలర్ ప్రభాకరరావు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ఆ అంశాన్ని ఆమోదించారు. ఆతరువాత 7వ అంశానికి సంబంధించి కాంట్రాక్టర్లు టెండర్లు వేసే క్రమంలో కొందరు ఉద్దేశపూర్వకంగా అంచనా విలువకన్నా భారీగా తక్కువకు కోడ్ చేస్తూ అభివృద్ధిని ఆటంకపరిచేం దుకు ప్రయత్నిస్తున్నారని, ఆ విషయమై కాంట్రాక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడి అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చేయాలని కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనీల్‌లు అధికారులకు చెప్తూ ఆ అంశాన్ని రద్దు చేయమని కోరారు. దీంతో ఆ అంశాన్ని రద్దు చేశారు. 17వ అంశాన్ని కూడా రద్దు చేశారు.

మొత్తం 39 అంశాలలో రెండు అంశాలు రద్దు కాగా, మిగిలిన అంశాలు కొద్దిపాటి చర్చతో ఆమోదించారు. చైర్మన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు మొత్తం 36 మంది సమావేశానికి హాజరుకావల్సి ఉంది. అయితే, చైర్మన్‌తో సహా 19 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో డీఈ ఏసయ్య, ఏఈ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మృతి చెందిన నాగబ్రహ్మం

బాధితులు మేదరమెట్ల వాసులు

మార్టూరు, ఫిబ్రవరి 29: తండ్రి అస్థికలను విజయవాడ దగ్గర కృష్ణా నదిలో కలిపి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందగా, తమ్ముడు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం మండల పరిధిలో ఇసుక దర్శి ఫ్లైవోవరుపై చోటుచేసుకుంది. ఒంగోలు వైపు వెళుతున్న టాటా ఏసీ వాహనాన్ని వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనాన్ని నడుపుతున్న అన్న గుడిపాటి నాగబ్రహ్మం (40) అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న తమ్ముడు సాంబశివరావుకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 వాహనం సంఘటనా స్థలానికి వచ్చి సాంబశివరావును మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రామిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగబ్రహ్మం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముందు ఖాళీగా వెళుతున్న టాటా ఏసీ వాహనం సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి ద్విచక్రవాహనం వేగం అదుపుకాలేక బలంగా ఢీకొననడంతో నాగబ్రహ్మం తలకు తీవ్ర గాయమై మృతి చెందినట్లు భావిస్తున్నారు.

కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామానికి చెందిన నాగబ్రహ్మం, సాంబశివరావులు అన్నదమ్ములు. నాగబ్రహ్మంకు భార్య అరుణకుమారి, ఇద్దరు కవల మగ పిల్లలు ఉన్నారు. సాంబశివరావు సింగరకొండలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పని చేస్తున్నారు. గతంలోనే తల్లి చనిపోగా, ఈనెల 25న తండ్రి ఆది నారాయణ అనారోగ్యకారణంగా మృతి చెందాడు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో తండ్రి అస్థికలను కృష్ణా నదిలో కలపడానికి అన్నదమ్ములు ద్విచక్రవాహనంపై విజయవాడకు వెళ్లారు. కార్యక్రమం ముగించుకొని తిరిగి బైక్ పై మేదరమెట్ల వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు నాగ బ్రహ్మం మృతదేహానికి శవపంచనామా చేసిన అనంతరం పోస్టుమార్టం నిర్వ హించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్టూరులో మూడు ఇంటర్ పరీక్షా కేంద్రాలు

మార్టూరు, ఫిబ్రవరి 29: ఇంటర్ మీడియట్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమవుతున్నాయి. మార్టూరులోని మూడు పరీక్షా కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు, అందుకు సంబంధించి ఈ కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు మండల విద్యాశా ఖా ధికారి ఎం.వస్రాం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మూడు కేంద్రాలలో ఇంటర్ రెండు సంవత్సరాలకు సంబంధించిన 1047 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. వీరికోసం 45 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. మార్టూరులోని ప్రభుత్వ జూనియర్ కళా శాలలో 227 మంది, శ్రీహర్షిణి జూనియర్ కాలేజీలో 325 మంది, రాయల్ జూనియర్ కాలేజీలో 495 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు

మార్టూరు, ఫిబ్రవరి 29: విద్యాహక్కు చట్టం ప్రకారం రానున్న విద్యా సంవత్సరం 2024-25లో మండలంలోని ప్రతి ప్రయివేటు పాఠశాలలో పేద విద్యార్థులకు 1 వతరగతిలో 25 శాతం సీట్లు కేటాయించాలని మండల విద్యాశాఖాధికారి ఎం.వస్రాం నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా విధానం విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా అర్హులైన పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో 25 శాతం సీట్లు కేటాయిస్తున్నట్టు పేర్కొన్నారు. అవసరమైన వారు వచ్చే నెల 14వతేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంఈవో కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఆర్‌జేడీ

మార్టూరు, ఫిబ్రవరి 29: స్థానిక జడ్పీ హైస్కూల్‌ను గురువారం ప్రాంతీయ సంచాలకులు (ఆర్‌జేడీ) కె.లింగేశ్వర రెడ్డి సందర్శించారు. ఈ హైస్కూల్లో త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు గల వసతులను ఆయన పరిశీలించారు. అనంతరం 8, 9వ తరగతులకు సంబంధించి సిలబస్, తరగతి గదులలో ఫ్యాన్లు, విద్యుత్, మరుగుదొడ్లు, ట్యాబ్‌ల వినియోగం తదితర విషయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంగ్లీషులో విద్యార్థుల ప్రమాణాలను పరిశీలించేందుకు పలు ప్రశ్నలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధి కారులు ఎం.వస్రాం నాయక్, ఎం.ప్రేమలత, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అందుబాటులోకి వ్యాయామ సాధనాలు

చీరాల, ఫిబ్రవరి 29: స్థానిక ఎస్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగ ణంలో రూ.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన లేడీస్ జిమ్ నిర్మాణం తుదిదశకు చేరింది. త్వరలో ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు స్కూల్ ప్రాంగణం వాకర్స్ (పురుషులు, మహి ళలు)కు అనువుగా ఉంది. యాంత్రిక జీవనంలో శారీరక శ్రమ తగ్గుతోంది. దీంతో ఎక్కువ మంది అవకాశం ఉన్నప్పుడు వాకింగ్, జిమ్‌లకు వెళ్లేందుకు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఈనేపథ్యంలో లేడీస్ జిమ్ నిర్మాణం చేపట్టి వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో ఉయ్యాల, సేద దీరుతూ కూర్చునేందుకు అరుగులు, గార్డెన్ ఏర్పాటు చేశారు.

పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న వాసవి క్లబ్ ప్రతినిధి వెంకటేశ్వరరావు

చీరాల, ఫిబ్రవరి 29: స్థానిక వాసవి క్లబ్ ఆధ్వర్యంలో లీఫ్ ఇయర్ (ఫిబ్రవరి 29)ను పురస్కరించుకుని గురువారం క్లబ్ కార్యాలయం 101 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వీవీ సత్యనారాయణ, సీహెచ్ సురేష్‌బాబు, వీఎస్ తూతిక మల్లికార్జునరావు, పోలిశెట్టి శ్యామ్‌సుందర్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 29: అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చెప్పారు. మండలంలోని ఈపురుపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద 1,3 సచివాలయాల పరిధిలో, సిండికేట్ వీవర్స్ కాలనీలో సచివాలయం-2 వద్ద గురువారం జరిగిన గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వపరంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఏపీఎం సుబ్బారావు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా

మార్టూరు, ఫిబ్రవరి 29: సీపీఎస్ రద్దు చేయాలని,పెండింగ్‌లో ఉన్న రెండు డీఏ లను వెంటనే విడుదల చేయాలని, కొత్తగా ఉపాధ్యాయుల నియామకాల్లో అప్రెంటీస్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ స్కేలులో కలపాలని, తదితర సమస్యల పరిష్కారం కోరుతూ గురువారం మార్టూరులో మండల కాంప్లెక్స్ వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ వై.సంధ్య శ్రీకి అందజేశారు. కార్యక్రమంలో మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు మాడుగుల కిషోర్, షేక్ ఇ ర్షద్ జాహ, షేక్ జానీబాషా, కంభంపాటి ప్రశాంత్, పరిమి ప్రసన్నకుమారి, దేవరకొండ రేణుకామ్మ, సరోజ, ప్రమీల, నాదెండ్ల శ్రీనివాసరావు, రేపూడి శ్రీనివాసరావు, నాగిరెడ్డి, వీరయ్య, బండారు రాంబాబు, జయ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పూనూరులో రథశాలకు శంకుస్థాపన

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 29: మండలంలోని పూనూరు గ్రామంలో గురువారం రథశాలకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో స్వామి వారి రథానికి, రథశాల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నారాయణంచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ కు చెందిన అధికారులతో పాటు రాటకొండ హనుమంతరావు, వెంకట్, సందీప్ దీక్షితులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుకార్యక్రమాలకు హాజరుకానున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, ఫిబ్రవరి 29: ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పలు కార్య క్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు పి.గుడిపాడు, 10.30కితమ్మవరం, 11 గంటలకు అనమనమూరు, 11.30కి చెరువుకొమ్ముపాలెం, 12 గంటలకు రామాంజనేయపురం, 12.30కి సూరేపల్లి, మధ్యాహ్నం ఒంటి గంటకు నక్కబొక్కలపాడులో జరిగే కార్యక్రమాలకు హాజరు కానున్నారు.

డీఎస్పీగా బేతపూడి ప్రసాద్ బాధ్యతల స్వీకరణ




బేతపూడి ప్రసాద్

చీరాలటౌన్, ఫిబ్రవరి 29: చీరాల డీఎస్పీగా బేతపూడి ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే అన్ని విభాగాల్లో అధికారులు బదిలీ అయ్యారు. ఈక్రమంలో ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ ప్రసాదరావును ఆకస్మికంగా బదిలీ చేస్తూ గత శనివారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో బేతపూడి ప్రసాద్‌ను నియమించగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని పలువురు పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

నాటుసారా తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

జాండ్రపేట(చీరాలటౌన్), ఫిబ్రవరి 29: నాటుటసారా తరలిస్తున్న ఇద్దరు మహిళలను వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అదుపులోకి తీసుకున్నారు. అందిన వివరాల ప్రకారం.. చీరాలకు చెందిన వీరిరువు గురువారం రాత్రి స్కూటీపై వేటపాలెం నుంచి చీరాలకు సుమారు 60 లీటర్ల నాటుసారా తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న సీఐ శేషగిరిరావు సిబ్బందితో జాండ్రపేట వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకుని సారాను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో పోలీసులు విచారణ చేపట్టారు.



సోమశిలలో 16.764 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఫిబ్రవరి 29: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, గురువారం నాటికి జలాశయంలో 16.764 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2,500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 550 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నామని వారు తెలిపారు.



కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వేమిరెడ్డి, నారాయణ తదితరులు

వైసీపీ కోటకు బీటలు

- వీపీఆర్ వెంట టీడీపీలోకి భారీగా వలసలు
- ఉమ్మడి జిల్లాపై వేమిరెడ్డి ప్రభావం
- రేపే అరుదైన ఘట్టం ఆవిష్కరణ ?

నెల్లూరు, ఫిబ్రవరి29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లాలో వైసీపీ నిట్టనిలువునా చీలనున్నది. కుట్ర పూరిత రాజకీయాలను తట్టుకోలేక వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్న వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(వీపీఆర్) భారీ స్థాయిలో ఆ పార్టీ నాయకులను తనవెంట తీసుకెళుతున్నారు. వీపీఆర్‌ను కేవలం ఓ ఆర్థికశక్తిగా మాత్రమే చూసిన వైసీపీ పెద్దలు, అందుకు తగిన మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోంది. వీపీఆర్ వెంట నడవటానికి సిద్ధపడిన నాయకులను చూసి కళ్లు తేలేయడంతప్ప ఏమి చేయలేకపోతున్నారు. కందుకూరు నియోజకవర్గంతో కూడిన ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి వందలాది మంది వైసీపీ నాయకులు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరడానికి సన్నద్ధమయ్యారు. మార్చి 2న సింహపురి రాజకీయ చరిత్రలో ఓ అరుదైన ఘట్టంగా మారనున్నదని టీడీపీ వర్గాలు అంటున్నాయి. దీన్ని బట్టి చూస్తే టీడీపీలోకి చేరికల సంఖ్య ఎంత ఉండబోతున్నది అర్థమవుతోంది.

● ఒక్కరి వల్ల ఎంత జరిగింది ?

ఒక్కరి వల్ల జిల్లా మొత్తం నాశనం అయింది. కుట్రపన్ని వీపీఆర్‌ను పార్టీ నుంచి సాగనంపారు. ఇందుకు కారణమైన ఆ నాయకుడిని, ఆయన్ను వెనకేసు కొచ్చిన వైసీపీ అగ్రనాయకులను ఉద్దేశించి జిల్లాకు చెందిన ప్రముఖ వైసీపీ నాయకుడు అన్నమాటలివి. జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఆ నాయ కుడు అన్న మాటల్లో నిజమెంతో తెలుస్తోంది. వీపీఆర్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని వందలాది మంది వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు.. వీపీఆర్ వైసీపీకి రాజీనామా చేసిన మరుసటి రోజు నుంచే ఇందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజూ వైసీపీకి చెందిన కీలక నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేస్తూనే ఉన్నారు. నెల్లూరు సిటీ, రూరల్, సూళ్లూ రుపేట, గూడూరు, ఉదయగిరి, కావలి, కందుకూరు, ఆత్మకూరు నియోజక వర్గాల నుంచి పలువురు కీలక నాయకులు మార్చి 2న టీడీపీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ చేరికలతో టీడీపీ మరింత బలపడ టంతో పాటు వైసీపీ కోటకు బీటలు వారే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

రేపు వీపీఆర్ టీడీపీలో చేరిక

నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): మార్చి 2వ తేదీన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతోపాటు ఆయన అనుచరులు భారీ సంఖ్యలో చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరనున్నారని మాజీ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌లు వెల్లడించారు. చంద్రబాబు రాక సందర్భంగా నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాట్లను వేమిరెడ్డి, నారాయణ, అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణ, అజీజ్‌లు మీడియాతో మాట్లాడారు. మంచితనానికి మారుపేరు, హుందా రాజకీయాలు చేసే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి వారే వైసీపీలో ఇమడలేక పోయారంటే ఆ పార్టీ తీరు, జగన్మోహన్‌రెడ్డి వ్యవహార శైలి ఎలా ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. వైసీపీ అరాచక, నియంతృత్వ ధోరణితో అనేక మంది ఆ పార్టీ నుంచి బయటకొస్తున్నారని చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజలనే కాదని, తన వెంటన నడిచే నాయకులు, కార్యకర్తలను కూడా మోసం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు తామంతా వీపీఆర్‌ను టీడీపీలోకి ఆహ్వానించగా ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. వీపీఆర్‌తో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అనుచరులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్‌లు, మండల, జిల్లా స్థాయి నేతలు వేలాదిగా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు. కార్యకర్తల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొనే చంద్రబాబు జిల్లాకు వస్తున్నారని వెల్లడించారు. టీడీపీ శ్రేణులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



విలేకరులతో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్, తదితరులు

5 నుంచి శంఖారావం

- లోకేష్ పర్యటన ఖరారు
- ఉమ్మడి జిల్లాలో సభలు

నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'శంఖారావం' కార్యక్రమం మార్చి 5వ తేదీ నుంచి జిల్లాలో ప్రారంభం కానున్నది. మూడురోజుల పాటు లోకేష్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆరు నియోజకవర్గాల్లో 'శంఖారావం' సభలను నిర్వహించనున్నారు. 5వతేదీ ఉదయం కందుకూరు, సాయంత్రం ఉదయగిరి నియోజకవర్గాల్లో కార్యక్రమాలు జరగనున్నాయి. 6వ తేదీన ఉదయం కావలి, మధ్యాహ్నం కోవూరు, సాయంత్రం నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో సభలు నిర్వహించనున్నారు. 7వ తేదీన ఉదయం సర్వేపల్లి, మధ్యాహ్నం గూడూరు, సాయంత్రం వెంకటగిరి నియోజకవర్గాల్లో 'శంఖారావం' సభా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆక్రమణలకు అంతేది ?



నెల్లూరు రైల్వేస్టేషన్ ఎదురుగా సర్వేపల్లి కాలువను ఆక్రమించి ఏర్పాటు చేసిన నర్సరీ

- నెల్లూరులో ఇరిగేషన్ స్థలాల కబ్జా
- రూపుకోల్పోతున్న నీటిపారుదల కాలువలు
- వైసీపీ నేతలకు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది సహకారం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- ప్రమాదంలోకి నగరం

నెల్లూరు, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీ నాయకులు ఇరిగేషన్ ఆస్తులను అమ్మేస్తుంటే, వారికి ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారు. భవిష్యత్ ఏమిటన్న ఆలోచన వారిలో కొంచెం కూడా కనిపించడం లేదు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా అటు వైసీపీ నాయకులు, ఇటు ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలకు అండగా నిలుస్తూ, రూ.కోట్లు జేబుల్లో వేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోవడంలేదు. ఇలాగే కొనసాగితే నెల్లూరు నగరం ప్రమాదంలోకి జారుకోనున్నది.

కొన్నింటిని పరిశీలిస్తే....

● ఆధునికీకరణ పేరుతో సర్వేపల్లి కాలువను కుదించారు. అప్పటికే ఆక్రమణలకు గురైన ఈ కాలువ, ఆధునికీకరణ తర్వాత మరింత స్థలం మిగలడంతో యథేచ్ఛగా అక్కడ తిష్ఠ వేశారు. కాలువ స్థలాల్లో శాశ్వత నిర్మాణాలు చేయకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయకుండా మినీబైపాస్ వెంబడి సర్వేపల్లి కాలువ అంచున భవనాలు నిర్మిస్తున్నారు. దుకాణాలు, నర్సరీల ఏర్పాటుకు వైసీపీ నాయకులే ఈ స్థలాలను లీజుకు ఇచ్చారు. నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి వ్యక్తిగత సహాయకుడు ప్రతి నెలా ఈ వ్యాపారుల వద్ద నుంచి లీజు వసూలు చేస్తున్నారు. ఈ మొత్తం సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. ప్రస్తుతం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నివాసం ఎదురు గానే ఆక్రమణలు జరుగుతుండడం గమనార్హం.

● కృష్ణపట్నం కాలువ వెంబడి కూడా అదే పరిస్థితి. అక్కడ కూడా నర్సరీలు, దుకాణాల ఏర్పాటు జోరుగా సాగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన ఓ కార్పొరేటర్ ఈ కాలువ స్థలాలను ఏకంగా అమ్మేస్తుండడం గమనార్హం. ఈ వ్యాపారాల మూలంగా ఆ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతోంది. పలుమార్లు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు వచ్చినా రాజకీయ ఒత్తిళ్లతో మిన్నకుండిపోయారు.



మినీ బైపాస్‌లో ఆదాల ఇంటి ఎదురుగా ఉన్న నర్సరీ

● నెల్లూరు చెరువును కొద్దికొద్దిగా ఆక్రమించుకుంటూ వస్తున్నారు. కొన్నేళ్ల నుంచి జరుగుతున్న ఆక్రమణలతో ఇప్పటికే చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ఇప్పటికే చెరువులో అనేక ఇళ్లు వెలిశాయి. ఇంకా కూడా ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. 33వ డివిజన్ వెంగళరావునగర్ ప్రాంతంలో ప్రస్తుతం కొంతమంది ఆక్రమణదారులు చెరువును పూడుస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. తొమ్మిది అంకణాల చొప్పున ప్లాట్లుగా విభజించి ఒక్కో ప్లాటును రూ.3 నుంచి రూ.5 లక్షలకు అమ్మేస్తున్నారు.

● నగరంలోని అన్నమయ్య సర్కిల్‌లో కాలువను పూడ్చేసి ఏకంగా మూడంతస్థుల నిర్మాణాన్ని చేస్తున్నారు. పక్కన కాలువను పూడ్చేసినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. దీనిపై ఇరిగేషన్ అధికారులతోపాటు స్పందనలో కూడా స్థానికులు ఫిర్యాదు చేశారు. కానీ మూడు నెలల నుంచి సర్వే కూడా చేయలేని దుస్థితిలో యంత్రాంగం ఉంది. కాలువపై నిర్మాణానికి మున్సిపల్ అధికారులు జీప్లస్‌టు రెసిడెన్షియల్‌కు అప్రూవల్ కూడా ఇచ్చేశారు. మొదట పనులు ఆపిన ఇరిగేషన్ సిబ్బంది ఆ తర్వాత పట్టించుకోలేదు. ఈ భవనం జోలికి రాకుండా ఇరిగేషన్ సిబ్బందికి రూ.10 లక్షలు ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

● శ్రీహరినగర్‌లో రామిరెడ్డి కాలువను ఆక్రమించి ఓ బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆఫీసు నిర్మించారు. ఆ పక్కనే మరో మూడంతస్థుల భవన నిర్మాణం ప్రారంభమైంది. కొండాయపాలెం సాయిబాబా ఆలయం వెనుక వైపు ఓ వ్యక్తి కాలువను పూడుస్తూ నిర్మాణాలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ అధికారులను మేనేజ్ చేసుకొని ఏకంగా కాలువ భూమికి రిజిస్ట్రేషన్ కూడా చేసే శారు. దీనిపై గతంలోనే ఇరిగేషన్ సిబ్బంది సర్వే చేసి ఆక్రమ ణలు తేల్చి వదిలేశారు. మద్రాసు బస్టాండ్ సమీపంలో ఓ హోటల్ పార్కింగ్ కోసం ఏకంగా కాలువ స్థలాన్ని ఆక్రమించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఆక్రమ ణలు ఉన్నాయి. ఇలానే కొనసాగితే భవి ష్యత్‌లో నెల్లూరు నగరం ప్రమాదంలోకి జారుకునే అవకాశం ఉంది.

● కనిపించని కాలువలు

జిల్లా పాలనా కేంద్రమైన నెల్లూరు నగరంలో ఏ ఒక్క కాలువ కూడా సరిగా లేదు. అన్ని కాలువలు ఆక్రమణలకు గురై రూపుకోల్పోయాయి. దీంతో చిన్న వర్షం కురిసినా ప్రధాన ప్రాంతాలన్ని నీటిలో మునిగిపోతున్నాయి. ఓ వైపు పెనుప్రమాదం హెచ్చరిస్తున్నా పాలకులకు గానీ అధికారులకు గానీ పట్టించుకోవడం లేదు. నడిరోడ్డుపై కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నా ఎవరికీ కనిపించడం లేదు. స్థానికులు ఇదేమిటని ప్రశ్నిస్తుంటే వారిపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో వారు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారేకానీ ఫలితం ఉండడం లేదు. ఎవరో ఒకవ్యక్తి స్వలాభం కోసం కాలువను ఆక్రమించి మూసేస్తే ఆ ప్రభావం లక్షలమందిపై పడుతోంది. చివరకు ప్రజలే రోడ్లపైకి వచ్చి ఆక్రమణలను అడ్డుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు ఇరిగేషన్ స్థలాలను వారిసొంత స్థలాల్లాగా వ్యాపారులకు లీజుకు ఇస్తున్నారు. మరికొన్ని చోట్ల వైసీపీ నాయకులే ఆక్రమణలకు తెగబడుతున్నారు. వీరి జోలికి వెళ్లడానికి సాహసించలేని ఇరిగేషన్, రెవెన్యూ సిబ్బంది, ఇదే తడువుగా అందినకాడికి సొమ్ము చేసుకుంటున్నారు. పైపెచ్చు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తుంటే కార్పొరేషన్ సిబ్బంది కూడా పట్టించుకోరు. పైగా ఈ అక్రమ నిర్మాణాలకు అనుమతులు కూడా మంజూరు చేస్తుండడం కొసమెరుపు.

బుర్రాపై గుర్రు

- మధుకు సహకరించనని తేల్చిచెప్పిన మహీధర్
- ఫొటో వాడుకుంటామన్నా అంగీకరించని వైనం
- ఎమ్మెల్యేతో వీపీఆర్ భేటీ
- టీడీపీలోకి రావాలని ఆహ్వానం
- శరవేగంగా మారుతున్న కందుకూరు రాజకీయాలు

కందుకూరు, ఫిబ్రవరి 29: కందుకూరు వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్‌కు సహకరించలేనని సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి స్పష్టం చేశారు. గురువారం ఉదయం బుర్రా ఆయన్ను కలవగా ఈ మేరకు తేల్చిచెప్పారు. కాగా సాయంత్రం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాచవరం వచ్చి ఎమ్మెల్యే మహీధరరెడ్డితో చర్చలు జరిపారు. చర్చల సారాంశం తెలియకపోయినా మహీధరరెడ్డిని టీడీపీలోకి ఆహ్వానించేందుకే వీపీఆర్ వచ్చాడనేది సుస్పష్టం. వేమిరెడ్డితో సన్నిహిత సత్సంబంధాలు ఉన్న మహీధరరెడ్డి కూడా ఆయన అభిప్రాయానికి తగిన గౌరవం ఇచ్చే అవకాశాలే బలంగా ఉంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

● ఇద్దరు ఇన్‌చార్జిల మార్పు

నియోజకవర్గంలో బలమైన వర్గం, అనుచరగణం ఉన్న సిటింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డికి ఉద్దేశపూర్వకంగా టికెట్ ఇవ్వకుండా వైసీపీ పక్కన పెట్టింది. పదిహేనురోజుల్లోనే ఇద్దరు ఇన్‌చార్జులను మార్చింది. మొదట ప్రకటించిన అరవింద పోటీకి విముఖత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి బుర్రా మధుసూదన్ పేరును ప్రకటించారు. ఆ వెంటనే బుర్రా మాచవరం చేరుకుని ఎమ్మెల్యేని కలిసి సహకారం కోరారు. అందుకు మహీధర్‌రెడ్డి ససేమిరా అన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం మరోదఫా బుర్రా తన అనుచరులతో కలిసి మహీధరరెడ్డిని కందుకూరులోని ఆయన కార్యాలయంలో మళ్లీ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాను సహకరించేది లేదని బహిరంగంగానే బుర్రాకు స్పష్టం చేశారు. గంటన్నర పాటు బుర్రా ఎమ్మెల్యే కార్యాలయంలో ఉండగా శాలువాతో సత్కరించి పంపించాడే కానీ, సహకారం మాత్రం కుదిరేపని కాదని చెప్పేశాడు. సరే మీరు నావెంట రాకున్నా నాయకులకు ఫోన్లు చేసి చెప్పండని కోరగా, అవన్నీ అయ్యేపనులు కాదు, నాయకుల ఫోన్ నెంబర్లదేముంది ఎవరిని అడిగితే చెప్పరు..? మీరే తెలుసుకోండి.. అని అన్నారు. ప్రచారంలో మీ ఫొటో అయినా వాడుకుంటానని బుర్రా కోరినా కుదరనే కుదరదు నా ఫొటో ఎందుకు జగన్మోహనరెడ్డి ఫొటో పెద్దది వేసుకో... మాకు ఓట్లు ఎక్కడున్నాయి, ఆయన ఫొటోచూస్తేనే ఓట్లన్నీ పడతాయని ఎమ్మెల్యే అన్నారు. దీంతో బుర్రా వెనుదిరిగి వెళ్లిపోయారు.



మాచవరంలో కందుకూరు ఎమ్మెల్యే మహీధరరెడ్డిని కలిసి వెళ్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

● వీపీఆర్ భేటీ

కాగా గురువారం సాయంత్రం రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాచవరంలోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని ఏకాంతంగా చర్చలు జరిపారు. గంటకుపైగా వారిద్దరు చర్చించుకున్నారు. చర్చల సారాంశం తెలియనప్పటికీ మహీధరరెడ్డిని టీడీపీలోకి రావాల్సిందిగా వేమిరెడ్డి ఆహ్వానించినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై కేడర్‌తో చర్చించి మహీధరరెడ్డి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- 81 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 52,076 మంది విద్యార్థులు
- ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా అనుమతి
- ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నెల్లూరు(వ్యవసాయం), ఫిబ్రవరి 29 : ఇంటర్ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 20వతేదీ వరకు నిర్వహించే ఈ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయి. ఇందుకోసం జిల్లాలో 81 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో హాల్‌టికెట్ తీసుకోని విద్యార్థులు ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవాలి, హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా కూడా అనుమతి ఇస్తామని ఆర్ఐవో డాక్టర్ ఎ.శ్రీనివాసులు తెలిపారు. ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ నెంబరు 0861-2320312ను ఏర్పాటు చేశామని చెప్పారు.

● 52,076 మంది విద్యార్థుల హాజరు

ఇంటర్ పరీక్షలకు 52,076 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి జనరల్ 25,202, ఒకేషనల్ 1,217 కలిపి 26,419 మంది, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి జనరల్ 24,243, ఒకేషనల్ 1,414 కలికి మొత్తం 25,657 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులను ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తున్నట్లు ఇంటర్‌బోర్డు అధికారులు తెలిపారు. జిల్లాలో 7 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని వివరించారు. చేజర్ల, కుల్లూరు, రాపూరు, మర్రిపాడు, ఆత్మకూరు, బిట్రగుంట, ఉదయగిరి సెంటర్లలో పకడ్బందీగా పరీక్షలను నిర్వహించేందుకు ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఐదుగురు సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. వీరితోపాటు 81 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. వీరితోపాటు డీఈసీ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఆర్ఐవో శ్రీనివాసులు మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని, ఎవరికైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి తెలియచేయాలన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బిట్రగుంట, ఫిబ్రవరి 29: స్థానిక రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘం బిట్రగుంట బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విజయవాడ రైల్వే సీనియర్ డీపీవో ఆనంద్, డివిజనల్ సంఘ్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరావు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు క్రీడలు ఉత్సాహంతోపాటు ఆరోగ్యానిస్తాయని అన్నారు. తుని నుంచి గూడూరు స్టేషన్ల వరకు ఉన్న రైల్వేలోని వివిధ శాఖల కార్మికులకు ఏడు రోజులపాటు పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బిట్రగుంట సంఘ్ ఛైర్మన్ పీ గోవిందరాజు, ఏడీఎస్ జీ శ్రీనివాసులు, జీవన్‌కుమార్లను వారు అభినందించారు. మొదట జరిగిన మ్యాచ్‌లో గూడూరు జట్టుపై బిట్రగుంట ఎలక్ట్రికల్ జట్టు విజయం సాధించింది, కొత్త క్రికెట్ క్రీడామైదానంలో జరిగిన పోటీలో బిట్రగుంట రన్నింగ్ బ్యాచ్ ఇంజనీరింగ్ జట్టుపై విజయం సాధించింది. మధ్యాహ్నం విజయవాడ బీఆర్ఐపై చిన్నగంజాం జట్టు గెలుపొందింది, నెల్లూరు కమర్షల్ శాఖపై బిట్రగుంట లోకో డిపార్ట్‌మెంట్ విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే వైద్యులు సుధాకర్, వర్కింగ్ కమిటీ సభ్యులు డేగా శ్రీనివాసులు, స్టేష న్ మాస్టర్లు ఎల్వీ మీనాకుమార్, మురళీరెడ్డి, పీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు వెంకటేశ్వర్లు, రైల్వే కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైల్వే సీనియర్ డీపీవో కట్టా ఆనంద్



నెల్లూరు నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న తెలుగు మహిళలు

ధరల పెంపుపై నిరసన

- నల్లదుస్తులు ధరించి తెలుగు మహిళల ప్రదర్శన
- వైసీపీ పాలనపై కన్నెర్ర

నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 29 : వైసీపీ పాలనపై నెల్లూరు నగరంలో మహిళలు కన్నెర్ర చేశారు. గురువారం నల్లదుస్తులు ధరించిన మహిళలు గాంధీబొమ్మ నుంచి ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ నేత నారాయణ కుమార్తె డాక్టర్ సింధూర ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రదర్శన స్టోన్‌హౌస్‌పేటలోని జలకన్య విగ్రహం వరకు కొనసాగింది. ప్లకార్డులు చేతబట్టిన మహిళలు వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసీపీ అరాచకాలపైనా, నిత్యావసరాల పెంపునకు నిరసనగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సింధూర మాట్లాడుతూ వైసీపీ ప్రజావ్యతిరేక పాలనపై రాష్ట్రవ్యాప్తంగా నల్లదుస్తులు ధరించి మహిళలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారన్నారు. నెల్లూరు పురవీధుల్లో మునుపెన్నడూ లేని విధంగా నల్లచీరలు ధరించి ప్రభుత్వ తీరుకు నిరసన తెలపటం చూస్తుంటే ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో తెలుస్తున్నదన్నారు. వైసీపీ పాలనలో నిత్యావసరాలు, కరెంటు బిల్లులు, ఆర్టీసీ చార్జీలు, వంటగ్యాస్ రేట్లను విపరీతంగా పెంచేశారని విమర్శించారు. ఆఖరికి చేతకాని పాలన వల్ల చెత్తపై కూడా పన్ను వేయటం దారుణమన్నారు. ఈకార్యక్రమంలో నగర టీడీపీ మహిళా నేతలు రేవతి, విజయమ్మ, జానకి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మహిళా నేతలు

మున్సిపల్ బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

- పారిశ్రామికవాడకు నీటిని తరలిస్తే ఉద్యమిస్తాం
- పలు సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు



సమావేశంలో చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, సమస్యలపై నిలదీస్తున్న టీడీపీ కౌన్సిలర్

ఆత్మకూరు, ఫిబ్రవరి 29: స్థానిక మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఏడాది అభివృద్ధి పథంలో ముందుకెళతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జి. వెంకటరమణమ్మ తెలిపారు. స్థానిక కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం బడ్జెట్‌పై నిర్వహించిన సాధారణ సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది ఆదాయాన్ని పెంచుకునేదిశగా రూ.29.39 కోట్ల బడ్జెట్ ఆమోదానికి కౌన్సిల్ తీర్మానం కోసం సమావేశంలో ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా ఆమోదించడం హర్షదాయకమన్నారు. అజెండాలో పొందుపరిచిన ఆత్మకూరులోని నారంపేట పారిశ్రామికవాడకు 1ఎంఎల్‌డి వాటర్ తరలింపునకు పాతజంగాలపల్లి వద్ద నుంచి వాల్వ్ గేట్‌ను అమర్చి నీటి సరఫరా చేసేందుకు టీడీపీ కౌన్సిలర్లు షేక్ గౌస్‌బాష, మాదాల శ్రీనివా సులనాయుడు, వైసీపీ రెబల్ కౌన్సిలరు సూరా భాస్కర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమశిల జలశయం నుంచి మున్సిపాల్టీకి తాగునీటి సరఫరా చేసే పైపులకు వాల్ గేట్ అమర్చి నీటిని మళ్లిస్తే భవిష్యత్‌లో మున్సిపాల్టీ ప్రజలకు తాగునీటి సరఫరా ఇబ్బందికరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండురోజులకోసారి ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే పరిస్థితి ఉందని వాపోయారు. ఈ క్రమంలో పారిశ్రామికవాడకు నీటిని తరలిస్తే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రారంభ నిల్వలు ఎక్కడున్నాయో చెపాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. డబ్బులుంటే పనులు చేసిన కాంట్రాక్టర్లకు, ఉద్యోగులకు జీతభత్యాలు ఎందుకు ఇవ్వలేకపోతున్నారో చెప్పాలని పట్టుబట్టారు. పారిశుద్ధ్యం మెరుగుదల, పందుల నియంత్రణ, వీధి దీపాలు డ్రైనేజి నిర్వహణ తదిర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వైసీపీ కౌన్సిలర్లు సైతం అజెండాలోని కొన్ని అంశాలను వాయిదా వేయాలని కోరారు. ముందుగా మున్సిపల్ సమావేశంలో 88 అంశాలతో అజెండాపై కౌన్సిల్ తీర్మానంపై చర్చించారు. అందులో నాలుగు అంశాలను వాయిదా వేసి 84 అంశాలను చర్చించిన అనంతరం కౌన్సిల్‌లో ఏకగ్రీంగా ఆమోదించబడ్డాయి. కార్యక్రమంలో కమిషనర్ షేక్ ఫజుల్లాలా, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, మున్సిపల్ ఏఈ జూపల్లి ప్రసాద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాసీమ్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

సంగం, ఫిబ్రవరి 29: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాదికారి డాక్టర్ ఖాదర్ వలి వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారు. రికార్డులు.. వ్యాక్సీన్ నిల్వ చేయు ఐఎల్ఆర్, డీప్ ఫ్రీజర్‌లను పరిశీలించారు.

అనంతసాగరం: స్థానిక పీహెచ్‌సీని గురువారం జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి ఖాదర్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. పల్స్‌పోలియో ఏర్పాట్లను ఆరా తీశారు.

స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 29: స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్‌గా భారతిసిద్ధ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లూరు ఎస్సీ, ఎస్టీ పబ్లి ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆమెను న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

బర్త్ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి

అనంతసాగరం, ఫిబ్రవరి 29: ఆధార్‌లో వయస్సు తక్కువగా ఉన్నందున ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌కు అర్హత పొందలేక పొందలేక పోతున్నామని డప్పు కళాకారులు వాపోయారు. ఆధార్‌లో వయస్సు మార్పుకోసం తమకు బర్త్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని గురువారం వారు అనంతసాగరం తహసీల్దారు నరసింహను కలిసి వతిపత్రం అందజేశారు. వారి వెంట సీఐటీయూ మండల అధ్యక్షుడు అన్వర్‌బాష ఉన్నారు.

డిప్యూటీ ఈవో ఆకస్మిక తనిఖీ


నాడు-నేడు పనులపై విద్యాకమిటీకి సూచనలిస్తున్న డిప్యూటీ ఈవో

సీతారామపురం: మండకేంద్రంతో పాటు అయ్యవారిపల్లి హైస్కూల్, కేజీబీవీ పాఠశాలలను గురువారం డిప్యూటీ ఈవో పసుపులేటి రఘురామయ్య తనిఖీ చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. మార్చి నెలలో జరగనున్న పది పరీక్షల కోసం సన్నద్ధం కావాలని ఆదేశించారు. ప్రతి హైస్కూల్ పరిధిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంఈవో మస్తాన్‌వలి ఉన్నారు.

మర్రిపాడు: డిప్యూటి ఈవో రఘురామయ్య గురువారం పోలిరెడ్డిపల్లి ఉన్నతపాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ స్థాయి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అందులో ప్రదర్శించిన ప్రాజెక్టులను పరిశీలించి, ఉత్తమ ప్రాజెక్టులో ఎంపికైన వారికి ప్రశంశపత్రాలను అందజేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి విద్యాకమిటీ సభ్యులకు సూచనలిచ్చారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి-2 ధనలక్ష్మీ, ప్రధాన్యోపాధ్యాయులు హరికృష్ణ ఉన్నారు.

వైసీపీకి ఉదయగిరి నేతల రాజీనామా


విలేకరులతో మాట్లాడుతున్న చేజర్ల సుబ్బారెడ్డి తదితరులు

ఉదయగిరి రూరల్: వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఉదయగిరి మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇకనుంచి తన రాజకీయ పయనమంతా వేమిరెడ్డితోనే ఉంటుందన్నారు. అలాగే వైసీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ముటుకుందు వెంకటరెడ్డి, సీతారామపురం మాజీ ఎంపీపీ నేలటూరు అబ్రహం, వైసీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చేజర్ల సుధాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచి ఉప్పుటూరి హరి తదితరులు కూడా వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్‌సీ రమణారెడ్డి, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు బాలిబోయిన శ్రీనివాసులు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **సమాచారం లేకపోవడం అవమానంగా భావిస్తున్నా...**

కలిగిరి: 'ఉదయగిరిలో 2011 నుంచి 2024 వరకు టీడీపీ అభివృద్ధికి కష్టపడి పని చేశా.. అలాంటిది తనకు పార్టీ అధినేత చంద్రబాబు టికెట్ మార్పు విషయమై కనీస సమాచారం ఇవ్వకుండా, మరొకరికి కేటాయించడంపై అవమానానికి గురయ్యా.. కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటా'.. అని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు భావోద్వేగానికి గురయ్యారు. కలిగిరిలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన కన్నీళ్లపర్యంతరమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టికెట్ మార్పు విషయంలో జరిగిన అవమానాన్ని జీవితంలో మర్చిపోనని, మార్చి 2న చంద్రబాబు జిల్లా పర్యటన అనంతరం నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు.

బొల్లినేని నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం : ఓంకారం

కొండాపురం: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నామని మండల పార్టీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం పేర్కొన్నారు. గురువారం ఓంకారం అధ్యక్షతన పార్టీ శ్రేణులు సమావేశమై బొల్లినేని నిర్ణయం వచ్చేంత వరకు ఎటువంటి కార్యక్రమాలు చేయబోమని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసందర్భగా ఓంకారం మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా ఉదయగిరిలో బొల్లినేని ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేశామన్నారు. ఈకార్యక్రమంలో 19 పంచాయతీల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఈవోకు సన్మానం


చేజర్ల : పంచాంగుల కళాధర్‌ను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చేజర్ల, ఫిబ్రవరి 29: మండల విద్యాశాఖ అధికారి పంచాంగుల కళాధర్ పదవీ విరమణ సన్మానంను గురువారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎమ్‌వో జి.సుధీర్ బాబు, ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రావి పెంచల రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఉదయగిరి రూరల్: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ గురువారం పదవీ విరమణ పొందిన సయ్యద్ తహీర్ అలీహుస్సేని (కలీం)ను ఉపాధ్యాయులు, మిత్రబృందం ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

పదవీ విరమణ చేసిన జెట్టి ఎర్రయ్య


మాట్లాడుతున్న డాక్టర్ మాశిలామణి

వింజమూరు: స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ చేసిన జెట్టి ఎర్రయ్యను గురువారం కళాశాల యాజమాన్యం పట్టణ పుర్రప్రముఖులు సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మాసిలామణి పాల్గొని మాట్లాడారు. గుండెమడుగుల హైస్కూల్ హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, కళాశాల చైర్మన్ రాజా పవన్‌కుమార్, వివేకానంద జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ మద్దూరు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉదయగిరి రూరల్ : స్థానిక ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఈనెల 18వరకు జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారులు రమణ, కమలహాసన్‌లు తెలిపారు. గురువారం కళాశాలలో ఇన్విజిలేటర్లకు పరీక్షల నిర్వహణపై తగు సూచనలు ఇచ్చారు. విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ఉదయగిరి రూరల్ : సమాజంలో విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిలు తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 29: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. గురువారం స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి రికార్డులను పరిశీలించారు.

ఆలయానికి శంకుస్థాపన

సంగం, ఫిబ్రవరి 29: నీలాయపాళెంలో దేవాదాయశాఖ ద్వారా మంజూరైన రూ.50 లక్షల నిధులతో సీతారామస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు.

వరికుంటపాడు: వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గురువారం తూర్పు రొంపిదొడ్ల, దక్కనూరు గ్రామాల్లో నిర్వహించిన విజయ సంకల్పయాత్రలో పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, గుంటుపల్లి రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

వింజమూరు: స్థానిక ఎస్వీ కళ్యాణమండపంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీవో మాధవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

అనంతసాగరం, ఫిబ్రవరి 29: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉప్పలపాడులో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్‌సెంటర్ భవనాలను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ సంపూర్ణమ్మ, జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి ఖాదర్‌వలి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలకార్యాలయ ఆవరణలో దుత్తలూరు, వరికుంటపాడు మండలాలకు చెందిన వలంటీర్లకు వందనం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడినాఅ సన్మానించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, మాలకొండారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం మండలంలోని వలంటీర్లకు సేవరత్న, సేవవజ్ర పురస్కారాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉదయగిరిలో ఉపాధ్యాయుల ధర్నా

ఉదయగిరి రూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ సంఘం ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఓ.శ్రీనివాసరాజు తహసీల్దారు సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం తాలూకా అధ్యక్షులు ఖాదర్‌బాషా, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల ఏపీటీఎఫ్ అధ్యక్షులు ఓబులేసు, మాధవరాజు, బాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నందిపాడు అభయాంజనేయస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు వేదపండితులు ప్రత్యే పూజలు చేసి స్వామివారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా చేపట్టారు. మహోత్సవంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కాకర్ల సురేష్ ఈపాల్గొన్నారు.

టీడీపీని గెలిపించాలి

● ఇంటింటి ప్రచారానికి ఇంటూరి సౌజన్య శ్రీకారం

కందుకూరు, ఫిబ్రవరి 29: కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య గురువారం ఇంటింటి ప్రచారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని రెవెన్యూ కాలనీలో ఆమె మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాల కరపత్రాలు పంపిణీచేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి పాటుపడాలని, చంద్రబాబునాయుడుకు, ఇంటూరి నాగేశ్వరరావుకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కుసుమ కుమారి, దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఇంటూరి సౌజన్య

ఐఎస్ రావు నగర్‌లో బాబు ష్యూరిటీ కార్యక్రమం

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలోని 32వ వార్డు పరిధిలో ఉన్న 60 అడుగుల రోడ్డు, ఐఎస్ రావు నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండునెలల్లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడబోతున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, ముప్పవరపు వేణు, అత్తంటి వరప్రసాద్, చుంచు వేణు, గుమ్మళ్ల మాల్యాద్రి, ఎండ్లూరి బ్రహ్మయ్య, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాజగోపుర కలశ ప్రతిష్ఠ


మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహీధరరెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు

కందుకూరు, ఫిబ్రవరి 29: స్కందపురి జనార్ధన స్వామి దేవస్థానం నూతన రాజగోపుర కలశ ప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠా మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. వేలాదిమంది భక్తుల సమక్షంలో టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆలయ చైర్మన్ రావులకొల్లు బ్రహ్మానందం, ఈవో భైరాగి చౌదరి తదితరులు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల సమావేశం జయప్రదం చేయండి

కందుకూరు, ఫిబ్రవరి 29: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల కార్యకర్తల సమావేశం మార్చి 2న అద్దంకిలో జరుగుతుందని, ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పాల్గొంటున్నందున మాదిగ ఉద్యోగులంతా అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు కత్తి ఐజక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. మాదిగ ఉద్యోగులతో పాటు విద్యార్థులు, యువకులు, ఎంఆర్పీఎస్ బాధ్యులు, ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ


జగనన్న లేఅవుట్ల స్థలాల రిజిస్ట్రేషన్ల పత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్

లింగసముద్రం, ఫిబ్రవరి 29: మండలంలోని పలు గ్రామాలకు చెందిన జగనన్న లేఅవుట్లలోని ఇళ్ల స్థలాల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. గురువారం లింగసముద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని 16 గ్రామ పంచాయతీలలోని జగనన్న లేఅవుట్లలోని 712 మంది ఇళ్ల స్థలాల పట్టాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల పత్రాలను తహసిల్దార్ శ్రీచరణ్, ఎంపీడీఓ యు శేషుబాబు, రీ సర్వే డీటీ టి ప్రసాద్, గ్రామ సర్పంచ్ పులి రాఘవులు తదితరులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ పి తిరుపతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వి కృష్ణారెడ్డి పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోగోలులో ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభం

బిట్రగుంట, ఫిబ్రవరి 29: బోగోలు మండలంలో ప్రజా ఆశీర్వాద యాత్రను వైసీపీ కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం సాయత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కీర్తన, ఎంపీపీ సుజాత, సింగిల్‌విండో అధ్యక్షుడు మాల్యాద్రి, రమణయ్య, అంకులయ్య, శ్రీనివాసులు, సర్పంచులు మాచర్ల, గిరిబాబు, రామారావు ఎంపీటీసీలు కైశల్య, సుందర్‌రాజ్ తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సన్మానం

బిట్రగుంట, ఫిబ్రవరి 29: బోగోలు మండలం తాళ్ళూరు పంచాయతీలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సీహెచ్‌నాగరాజు పదవీ విరమణ సమావేశం పాఠశాల ఉపాధ్యాయులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయింత్‌బాబు, నరసింహారావు, ఉపాధ్యాయులు రాధయ్య, పాస్టర్ శ్యాంసన్‌బాబు, టీడీపీ నాయకులు ఎల్ సుధీర్‌బాబు, మాధవరావు, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు మాల్యాద్రి, హరిబాబు, వెంకయ్య పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ పోటీ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పసుపులేటి వెంకటేశ్వర్లు

అల్లూరు, ఫిబ్రవరి 29 : స్వతంత్ర అభ్యర్థిగా పసుపులేటి సుధాకర్ ఎన్నికల బరిలో ఉంటారని, ఇరు పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని నియోజకవర్గ సమన్వయకర్త పసుపులేటి వెంకటేశ్వర్లు అన్నారు. అల్లూరులోని పార్టీ కార్యాలయంలో గురువారం మండల సమన్వయకర్త ఎల్లు సాల్మన్‌రాజు అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపులేటి కొన్ని కార్యక్రమాల వలన బయటకు వెళ్లాల్సి వచ్చిందని, దీనిని అదునుగా చూసుకొని ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు ఆయన తిరిగి రాడని, పోటీ చేయడం లేదని దుష్ప్రచారాలు చేస్తున్నారని, దీనిని ప్రజలు నమ్మవద్దన్నారు. పోటీ చేయకుండా వెనకడుగు వేసే ప్రసక్తేలేదని ఆయన తేల్చి చెప్పారు. సమావేశంలో దర్శిగుంట వాసు, గుమ్మడి రాజేష్‌బాబు, కప్పల నవీన్‌కుమార్, పసుపులేటి ప్రసాద్, వల్లపు అనీల్, ఎల్లు సుబ్రహ్మణ్యం, కలిచేటి వెంకటేష్, కర్రా మల్లికార్జున, కందల శివరామిరెడ్డి, యజ్దానీబాషా పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి


ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు

కావలి, ఫిబ్రవరి 29: ఏపీటీఎఫ్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లు గురువారం కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎస్ రద్దుచేయాలని, బకాయిలు చెల్లించాలని ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం, ఉద్యోగ, ఉపాధ్యాయులకు 21వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఏపీటీఎఫ్ డివిజన్, కావలి, జలదంకి, బోగోలు మండల శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు జీ క్రిష్ణయ్య, కటారి నరసింహారావు, జిల్లా ఉపాధ్యక్షుడు రఘునాథరావు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య, ప్రధాన కార్యదర్శి సాయిరాం సింగ్, కావలి, బోగోలు, జలదంకి మండలాల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పూసల సామాజిక వర్గాన్ని ఎస్టీలో చేర్చాలి


ర్యాలీ చేస్తున్న పూసల సామాజిక వర్గ ప్రజలు

కొండాపురం, ఫిబ్రవరి 29: పూసల సామాజిక వర్గాన్ని ఎస్టీలలో చేర్చాలని ఆ సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆసంఘ జిల్లా అధ్యక్షుడు పొదిలి రాము అధ్యక్షతన సమావేశం జరిగింది. పూసల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కంభం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పూసల సామాజిక వర్గం దీనావస్థలో ఉన్నారు. గాజులు, పూసలు అమ్ముకుంటున్నామే తప్ప ఏ ప్రభుత్వం తమను ఆదుకోలేదన్నారు. పూసల సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చి ప్రత్యేకంగా కార్పోరేషన్ చేసి నిధులు కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అంతకు ముందు కాలనీ నుండి ర్యాలీగా వెళ్లి స్థానికంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళలర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పొదిలి రాము, రాష్ట్ర యువజన అధ్యక్షుడు మునగాల సునీల్, తుపాకుల వెంకటరమణ, చేని కుమారి, ము నగాల రాంబాబు, సూర్య చిరంజీవి, మండల అధ్యక్షుడు మునగాల సుధాకర్, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

మాలకొండలో దుకాణాలకు వేలం పాటలు

● మూడోసారి వాయిదాపడ్డ తలనీలాల వేలంపాట


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 29: మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 5 దుకాణాల బహిరంగ వేలం పాట ద్వారా రూ.92,60,000 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయంలోని కల్యాణ మండపంలో గురువారం కందుకూరు గ్రూప్ ప్రథమ శ్రేణి కార్య నిర్వహణాధికారి వీవీఎల్ రవీంద్రనాద్ పర్యవేక్షణలో వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరిచిప్పలు పోగుచేసుకొనే హక్కు పాటను రూ.17 లక్షలకు, అద్దాలు, ఫొటోల అంగడిని రూ.35,10,000 కాకర్లవారిపాలెం గ్రామానికి చెందిన కండ్లగుంట మాలకొండయ్య పాడుకున్నాడు. అదేవిధంగా కొబ్బరికాయలు రెండు అంగళ్లను పోలినేనిపాలెంకు చెందిన జాలారి ప్రసాద్ రూ.26,05000కు, ఫలహారసాల 1, 2 అంగళ్లను మాలకొండకు చెందిన వంకదారి కొండయ్య రూ.9,10,000కు, పాదరక్షలు భద్రపరచే పాటను అయ్యవారిపల్లెకు చెందిన బచ్చు వెంగళరావు రూ, 5,35,000లకు పాడుకున్నారు. తలనీలాలు వేలం పాట మూడోసారి కూడా వాయిదా పడినట్లు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ వేలం పాటలలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం, ఫిబ్రవరి 29: మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను కందుకూరు ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం కందుకూరు ఎస్ఈబీ ఎస్సై దీప్తికరంత్ స్సిబందితో దాడి చేసి ఎలాంటి అనుమతి పత్రాలు, లైసెన్స్ లేకుండా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను, ముగ్గురు డ్రైవర్లను గ్రామ శివారులో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఈబీ ఎస్సై లింగసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై ఎం బాజీబాబు ముగ్గురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కష్టాలు

దాహార్తితో స్థానికుల అవస్థలు

కావలి రూరల్, ఫిబ్రవరి 29: కావలి పట్టణ మునునూరు ఇందిరమ్మ కాలనీలో తాగునీటి కోసం కాలనీ వాసులు అలమటిస్తున్నారు. సుమారు 6000 మంది పేదలు నివసించే కాలనీ లో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా నేతలు, అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నామమాత్రపు చేతి పంపులు తప్ప నీటి వనరులు లేకపోవటం ఆప్రాంత పేదలకు శాపంగా మారింది. ఇదిలా ఉండగా కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం 90 శాతం పూర్తిచేసి, కాలనీ వీధుల్లో పైపులైన్లు సైతం పూర్తిచేశారు. కానీ వాటర్‌ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి నీటి సరఫరా చెయ్యకుండా అధికార పార్టీ నేతలు మున్సిపాలిటీకి ట్రాక్టర్లు పెట్టి అరకొరగా నీళ్ల తోలుతూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ఎన్నికల కోడ్ రాకముందే బిల్లులు రావన్న భయమో ఏమో గాని ట్రాక్టర్లతో నీటి సరఫరా నిలిపివేశారని అట్లల ఫ్యాక్టరీ కాలనీ, బీఈడి కాలేజ్ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.

కాగా, తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయం కావలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు కాలనీ వాసులు తెలిపారు. దీంతో నాలుగు రోజులుగా ఇందిరమ్మ కాలనీలోని వికలాంగుల కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, వినాయక కాలనీ, అట్లల ఫ్యాక్టరీ కాలనీలకు తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తూ నీటి దాతగా నిలిచి దాహార్తి తీరుస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు.


నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్


తాగునీటిని సరఫరా చేస్తున్న కావ్య క్రిష్ణారెడ్డి ట్యాంకర్